శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.





సంపుటి 09, సంచిక: 172 | శుక్రవారం | 22-05-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# నిప్పుల కుంపటి

- పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.5, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు
- 20 జిల్లాల్లోని 200 మండలాల్లో 44 డిగ్రీలు...
- అధిక వేడితో పాటు వడగాలులు వీస్తుండటంతో అల్లాడుతున్న జనం
- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దంటున్న వాతావరణశాఖ అధికారులు

**హైదరాబాద్ :** ఎండల తీవ్రతతో తెలంగాణ నిప్పుల కుంపటిని తలపిస్తుంది. భానుడి సెగతో అట్టుడుకుతోంది. అధిక వేడితో కూడిన వడగాలులకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.5, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. 20 జిల్లాల్లోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగనుందని అధికారులు తెలిపారు. రాష్ట్ర వాతావరణశాఖ సైతం ఎండ తీవ్రతపై ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దంటూ సంక్షిప్త సమాచారాలను తరువాయి 8లో

## కార్మికులకు కనీస వేతనాలు పెంపు

### జూన్ 1వ తేదీ నుంచి అమలులోకి

- మూడు జోన్లుగా రాష్ట్రం, నాలుగు కేటగిరీలుగా కార్మికుల విభజన
- జోన్ – 1 లో మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్ – 2లో మున్సిపాలిటీలు, జోన్ – 3లో గ్రామీణ ప్రాంతాలు
- వేతనాల పెంపుతో 1.11 కోట్ల మంది కార్మికులకు ప్రయోజనం
- సింగరేణి సంస్థలోనూ వేతనాలు పెంచేందుకు చర్యలు
- సంస్థలో 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే
- రాష్ట్ర ఆవిర్భావం తరువాత కార్మికులకు వేతన సవరణ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే
- రైతుల విషయంలో బిఆర్‌ఎస్‌వి శవరాజకీయాలు
- పోక్సో కేసులో బండి భగీరథను పోలీసులే అరెస్టు చేశారు
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని కార్మికులకు కనీస వేతనాలను పెంచుతున్నట్లు ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. పెంచిన వేతనాలు జూన్ 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని చెప్పారు. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా, కార్మికులను నాలుగు కేటగిరీలుగా విభజించి కనీస వేతనాలను పెంచామని వెల్లడించారు. అన్ స్కిల్డ్ కార్మికులకు కేటగిరిలో జోన్ –1లో రూ.16,000లకు, జోన్2లో రూ.15,000లకు, జోన్3లో రూ. 14,000లకు, సెమీ స్కిల్డ్ కార్మికులకు కేటగిరిలో జోన్ –1లో రూ.17,000 లకు, జోన్2లో రూ.16,000లకు, జోన్–3లో రూ.15,000లకు, స్కిల్డ్ కేటగిరిలో జోన్ –1లో రూ.18,500లకు, జోన్2లో రూ17,500లకు, జోన్3లో రూ.16,500లకు, హైలీ స్కిల్డ్ కేటగిరిలో జోన్ –1లో రూ.20,000లకు, జోన్2లో రూ.19,000 లకు, జోన్3 లో రూ.18,000 లకు పెంచుతున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికుల కనీస వేతనాలు నిర్ణయించకపోవడంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కార్మిక వేతనాల సవరణను మొట్ట మొదటి సారి కాంగ్రెస్ ప్రభుత్వమే చేసిందని చెప్పారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో సిఎం మాట్లాడారు. సమావేశంలో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, విజయరమణా రావు, ప్రభుత్వ సలహాదారు తరువాయి 8లో



**పెంచిన కనీస వేతనాల వివరాలు**

| కేటగిరి | జోన్ –1 | జోన్–2 | జోన్–3 |
|---|---|---|---|
| అన్‌స్కిల్ | రూ. 16,000 | రూ.15,000 | రూ. 14,000 |
| సెమీస్కిల్ | రూ.17,000 | రూ.16,000 | రూ.15,000 |
| స్కిల్ | రూ.18,500 | రూ17,500 | రూ.16,500 |
| హైలీ స్కిల్ | రూ.20,000 | రూ19,000 | రూ.18,000 |

## బిజెపి మితవాద రాజకీయాలకు వామపక్షమే ప్రత్యామ్నాయం

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



**న్యూఢిల్లీ :** పాలక భారతీయ జనతాపార్టీ సాగిస్తున్న దుందుడుకు మితవాద రాజకీయాలకు వామపక్షం ఒక్కటే సైద్ధాంతిక ప్రత్యామ్నాయం అని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా చెప్పారు. కేరళలో ఎన్నికల్లో ఎదురుదెబ్బలు, పశ్చిమ బెంగాల్‌లో పార్టీని పునరుద్ధరించటంలో వైఫల్యం నేపథ్యంలో, సిపిఐ ఆగస్టు 6 నుంచి 15వరకు దేశవ్యాప్తంగా రాజకీయ ప్రచార కార్యక్రమం తలపెట్టింది. అది సెప్టెంబర్‌లో ఢిల్లీలో బహిరంగసభతో ముగుస్తుంది. వచ్చే రౌండ్ సార్వత్రిక ఎన్నికలలోపు తన నిర్మాణాన్ని, కార్యకర్తలను పటిష్టం చేయటానికి సిపిఐ కృషి చేస్తున్నది. బలహీన స్థితినుంచి సంప్రదింపులు జరిపే పరిస్థితిని ఇది నివారిస్తుందని రాజా 'ది హిందూ'కు చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ పునాదిగా ఉన్న బిజెపి ప్రభుత్వం 2014 నుంచీ దేశ బహుళత్వాన్ని విస్మరించి ఏకరూప భారత్ నిర్మాణం కోసం కృషి చేస్తున్నదని ఆయన చెప్పారు. "వామపక్షం ఎన్నికల పోరాటాల్లో ఓటమి పొంది ఉండవచ్చు, పార్లమెంటు, అసెంబ్లీలో దాని ఉనికి కుదించుకపోయి ఉండవచ్చు. అయితే బిజెపి మితవాద రాజకీయాలకు వామపక్షం ఒక్కటే శక్తిమంతమైన ప్రత్యామ్నాయం" అని రాజా అన్నారు. అందువల్లనే, బిజెపి నిరంతరం వామపక్షంపై దాడి చేస్తున్నదన్నారు. మే 4న ఇటీవలి ఎన్నికల ఫలితాలు వెలువడినాక మోదీ వామపక్ష నాయకులను 'అర్బన్ నక్సల్స్' అని ప్రస్తావించటాన్ని రాజా గుర్తు చేశారు. ప్రజల దైనందిన సమస్యలపై పోరాటాలకు నాయకత్వం వహించే శక్తిగా ఆవిర్భవించటానికి "వామపక్షం ప్రజలతో సంబంధాలు పునరుద్ధరించుకోవాలి, పునరుద్ధరణ పొందాలి, పునరావిర్భవించాలి" అని ఆయన అన్నారు. ప్రజల జీవనోపాధి సమస్యలను ముందుకు తేవటానికై సిపిఐ ఆగస్టు 5–16 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు చేబడుతుందని, సెప్టెంబర్ 28న ఢిల్లీలో ర్యాలీతో ఈ ప్రచారాందోళన ముగుస్తుందని రాజా చెప్పారు. ఇండియా కూటమిలో పెద్ద పార్టీగా ఉన్న కాంగ్రెస్ మరింత సర్దుబాటు వైఖరి ప్రదర్శించాలన్నారు. తన మిత్రపక్షాల విషయంలో తన విధానాల గూర్చి అది తీవ్రంగా ఆత్మావలోకనం చేసుకోవాలని, ఆత్మవిమర్శనా పూర్వక సమీక్ష చేబట్టాలని రాజా సూచించారు.

## తెలంగాణ ప్రజలకు రైల్వే కనెక్టివిటీ పెంచుతాం

- ఆధునిక సౌకర్యాల కల్పనలో కేంద్రం సహకారం ఉంటుంది
- హైదరాబాద్‌లో ఎంఎంటిఎస్ సేవలను బలోపేతం చేసేందుకు ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం
- రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ హామీ



ప్రజాపక్షం/ హైదరాబాద్

రాబోయే రోజుల్లోనూ తెలంగాణ ప్రజలకు రైల్వే కనెక్టివిటీని పెంచడం, ఆధునిక సౌకర్యాల కల్పనలో కేంద్రం తరఫున పూర్తి సహకారం ఉంటుందని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పునరుద్ఘాటించారు. హైదరాబాద్ ప్రయాణికుల ఇబ్బందులను తొలగించేందుకు, ఎంఎంటిఎస్ సేవలను బలోపేతం చేసేందుకు త్వరలోనే ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, తదనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, తరువాయి 12లో

## త్రివేణి సంగమ తీరాన పుష్కర హోరు



- అంగరంగ వైభవంగా ప్రారంభమైన సరస్వతీ అంత్యపుష్కరాలు
- గవర్నర్ శుక్ల, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ హాజరు
- పుష్కరాలను ప్రారంభించిన కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర జయేంద్ర సరస్వతి

ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం

కాళేశ్వరం త్రివేణి సంగమం వేద మంత్రోచ్ఛారణలతో మార్మోగింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఏకైక క్షేత్రం అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి సంగమంలో గురువారం ఉదయం 5.43 నిమిషాలకు పుష్కరాలు లాంఛనంగా ప్రారంభం అయ్యాయి. వేకువ జామునే త్రివేణి సంగమ తీరాన సరస్వతి నదికి పుష్కరుడిని ఆహ్వానించే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. త్రివేణి సంగమ క్షేత్రం, త్రిలింగ క్షేత్రం అయిన కాళేశ్వరం అత్యంత అరుదైన ఘట్టానికి వేదికగా నిలిచింది. ఇప్పటి వరకూ సాంప్రదాయానికే పరిమితమైన సరస్వతి అంత్య పుష్కరాలు ఈ సారి అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.

**గణపతి పూజతో...**

గోదావరి, ప్రాణహిత నదులు కలిసిన చోట అంతర్వాహినిగా సరస్వతి నది ఉద్భవించిన ప్రాంతంలో గురువారం ఉదయం 5.43 గంటలకు సరస్వతి పుష్కరాలు ప్రారంభం అయ్యాయి. గోదావరి పుష్కరాల సమయంలో (విఐపి ఘాట్) సరస్వతి ఘాట్‌లో సరస్వతి నది పుష్కరాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి తరువాయి 12లో

## 119 నియోజకవర్గాలకు బిఆర్‌ఎస్ ఇన్‌చార్జీలు

- ప్రకటించిన పార్టీ అధినేత కెసిఆర్
- త్వరలో డిజిటల్ ఆప్ ద్వారా సభ్యత్వ నమోదు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ సభ్యత్వనమోదు కార్యక్రమం త్వరలోనే ప్రారంభించనున్నారు.'డిజిటల్ యాప్' ద్వారా సభ్యత్వ నమోదు చేపట్టనున్న నేపథ్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు బిఆర్‌ఎస్ ఏర్పాట్లు చేసింది. సభ్యత్వ నమోదు ప్రక్రియలో భాగంగా తరువాయి 12లో

## 'ఎబోలా'పై హై అలర్ట్

### భారత్‌కు వచ్చే విదేశీ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ

### ఇండియా–ఆఫ్రికా సదస్సు వాయిదా




**న్యూఢిల్లీ :** ప్రపంచవ్యాప్తంగా ఎబోలా వైరస్ కలకలం రేపుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎబోలా తీవ్రత ఎక్కువగా ఉన్న ఆఫ్రికా దేశాల నుంచి భారతదేశానికి వచ్చే ప్రయాణికుల కోసం కేంద్ర ఆరోగ్య శాఖ అడ్వైజరీ జారీ చేసింది. ఈ మేరకు ఆరోగ్య శాఖ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ కీలక ఆరోగ్య మార్గదర్శకాలను విడుదల చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి భారత్‌కు వచ్చే ప్రయాణికులు, ఇమ్మిగ్రేషన్ తనిఖీలకు ముందే ఆరోగ్య అధికారులను సంప్రదించాలని కోరింది. ముఖ్యంగా డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డిఆర్‌సి), ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు ఎబోలా లక్షణాలు కనిపిస్తే వెంటనే ఎయిర్‌పోర్ట్ ఆరోగ్య అధికారులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఒ) ఇటీవల కాంగో, ఉగాండాలో వైరస్ వ్యాప్తిపై 'గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ' ప్రకటించిన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలు చేపట్టింది. అయితే ఇది తరువాయి 8లో



## ఉక్కిరి బిక్కిరి...

### కరీంనగర్ డంపింగ్ యార్డులో కమ్ముకుంటున్న దట్టమైన పొగ

- నరకం చూస్తున్న కాలనీల వాసులు
- శాశ్వత పరిష్కారం చూపాలంటూ ప్రజలు వేడుకోలు
- నేడు సిపిఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాపక్షం/కరీంనగర్

స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందిన కరీంనగర్ డంప్ యార్డు సమస్యతో సతమతమవుతోంది. మానేరు నదీ తీరాన ఉన్న డంప్ యార్డులో ఏర్పడే మంటల కారణంగా వ్యాపిస్తున్న పొగతో సమీప కాలనీల ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. బయో మైనింగ్ చేసే యంత్రాలు సరిగా పని చేయక పోవడంతో చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుని గట్టలుగా తయారవుతుంది. దీంతో ఎండవేడికి డంప్ యార్డులో ఏర్పడ్డ మంటలు వ్యాపించి దట్టమైన పొగ కమ్ముకుంటుంది. సాయంత్రమైతే చాలు కోతి రాంపూర్, ఆటోనగర్, కట్ట రాంపూర్, హనుమాన్ నగర్, అల్కాపురి కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీలు పొగతో నిండిపోతుపోతున్నాయి. అలాగే రామగుండం,హైదరాబాద్ బైపాస్ రహదారి పక్కనే ఉండటంతో పొగ కమ్ముకుని వాహనాల రాపోకలకు అంతరాయం ఏర్పడి అక్సిడెంట్లు సంభవిస్తున్నాయి.

**నలబై ఏళ్లుగా అక్కడే..**

కరీంనగర్‌లోని డివిజన్‌లలో సేకరించిన చెత్తను మానేరు నది వెంట రామగుండం బైపాస్ ను ఆనుకొని ఉన్న డంప్ యార్డులో డంప్ చేస్తున్నారు. ఈ డంపు యార్డులో గత నలబై ఏళ్లుగా చెత్తను డంపు చేస్తుండటంతో ఇప్పుడది కుప్పలు కుప్పలుగా పేరుకు పోయి తీవ్రమైన కాలుష్యాన్ని వెదజల్లుతోంది. నగర పాలక సంస్థ పరిధిలో 4 లక్షల 50 వేల మంది ప్రజలు నివాసముంటుండగా నగరం తరువాయి 8లో

## సోలార్ ఎనర్జీ నిల్వ... సింగరేణికి సిరులు



- మిగులు సోలార్ విద్యుత్‌కు విలువ తెచ్చిన సింగరేణి
- నాలుగు నెలల్లోనే సత్ఫలితాలు, బిఇఎస్ఎస్‌తో రూ.26 లక్షల ఆదా
- రాష్ట్రంలోనే తొలి అతిపెద్ద ప్రాజెక్టు సింగరేణిలో ఏర్పాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోనే తొలిసారిగా సింగరేణిలో ఏర్పాటు చేసిన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ సత్ఫలితాన్ని ఇస్తోంది. పగటిపూట ఉత్పత్తి జరిగే సోలార్ విద్యుత్తులో వినియోగించబడని విద్యుత్తును ఉచితంగా గ్రిడ్‌కు సరఫరా చేయకుండా, బ్యాటరీలో నిలువ చేసుకుని, అవసరమైనప్పుడు వాడుకునే అవకాశం కలిగించే ఈ వ్యవస్థ సింగరేణికి ఆర్థిక లబ్ధి చేకూర్చుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు నాలుగు నెలల కింద మందమర్రి ఏరియాలోని 28 మెగావాట్ల సింగరేణి సోలార్ ప్లాంట్‌కు అనుబంధంగా 1 మెగావాట్ బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ నెలకొల్పారు. ఇందు కోసం రూ.2.5 కోట్లను యాజమాన్యం వెచ్చించింది. రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్తుకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని తరువాయి 12లో

## పుల్వామా ఉగ్రదాడి కీలక సూత్రధారి హతం

### పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్‌లో హమ్జా బుర్హాన్‌ను కాల్చి చంపిన దుండగులు



**జమ్ము :** పుల్వామా ఉగ్రదాడి కీలక సూత్రధారి హమ్జా బుర్హాన్ హతమయ్యాడు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తులు అతడిని కాల్చిచంపారు. పుల్వామాకు చెందిన బుర్హాన్ ఉన్నత విద్యను అభ్యసించే నెపంతో 2017లో పాకిస్థాన్‌కు వెళ్లాడు. తర్వాత నిషేధిత ఉగ్రవాద సంస్థ అల్‌బదర్‌లో చేరి, కొద్ది కాలంలోనే కమాండర్ స్థాయికి ఎదిగాడు. 2022లో భారత్ అతడిని ఉగ్రవాదిగా తరువాయి 8లో

# చైనా–రష్యా మధ్య దృఢమైన బంధం

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చైనా పర్యటన, అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో సంభాషణల అనంతరం మే 20న బీజింగ్‌లో విడుదలచేయబడిన సంయుక్త ప్రకటనకు నేటి ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో బహుముఖ ప్రభావాలున్నాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏకపక్ష చర్యలు, ఇరాన్‌పై ఇంకనూ ముగించని యుద్ధం సందర్భంలో ఈ ప్రకటనకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ట్రంప్ ప్రభుత్వం ప్రపంచాన్ని మళ్లీ ఆటవిక న్యాయంలోకి తీసుకెళ్లిందని, దానికి వ్యతిరేకంగా సమష్టి ఫ్రంట్‌గా కృషి చేయాలని చైనా–రష్యా నిర్ణయించాయి. బీజింగ్‌లో మే15న జిన్‌పింగ్– ట్రంప్ శిఖరాగ్ర సమావేశం జరిగిన ఐదు రోజుల్లోనే ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. ట్రంప్ చర్యల తర్వాత సంయుక్త ప్రకటన విడుదలకాలేదు. చైనా– అమెరికా మధ్య సంబంధాల్లో కొనసాగుతున్న మెరుగుదల పట్ల ఇరు పక్షాలు సంతృప్తి వ్యక్తం చేశాయి. వ్యాపారం, ఆర్థిక సంబంధ చర్యల్లో పురోగతి ఉంది. ఇరాన్ యుద్ధం, తైవాన్ సమస్యపై ఎక్కువగా సంభాషణలు జరిగాయి. అయితే అధికారికంగా చైనా పక్షం నుంచి వివరాలు వెల్లడి కాలేదు. అయితే ట్రంప్ మాత్రం తైవాన్‌పై ఆయన చెప్పింది విన్నాను, సమాధానం చెప్పలేదు అని తిరుగుప్రయాణంలో విలేకరులతో అన్నారు. తైవాన్ చైనా భూభాగం. తైవాన్–చైనా మధ్య సైనిక ఘర్షణ తలెత్తిన పక్షంలో తైవాన్‌కు మద్దతుగా అమెరికా చర్యలు తీసుకుంటే ఘర్షణ విస్తరిస్తుందని జిన్‌పింగ్ నిర్మోహమాటంగా ట్రంప్‌కు చెప్పారు. తైవాన్‌కు ఆయుధాల విక్రయం ఫైలు ట్రంప్ దగ్గర పెండింగ్‌లో ఉంది. పుతిన్‌తో చర్చల సందర్భంలో జిన్‌పింగ్ ఇరాన్‌పై మరింత స్పష్టంగా ముందుకువచ్చారు. తమ షరతులకు ఇరాన్ తలొగ్గి శాంతి ఒప్పందం చేసుకోకపోతే మరింత తీవ్రమైన యుద్ధం పునఃప్రారంభమవుతుందని ట్రంప్ రోజుకో హెచ్చరిక జారీచేస్తున్న నేపథ్యంలో జిన్‌పింగ్, యుద్ధం కొనసాగింపు కోరుకోకూడనిది, కాల్పుల విరమణ అవసరం అని నొక్కిచెప్పారు. సంప్రదింపులు కొనసాగాలని, సమగ్రమైన కాల్పుల విరమణ అవసరమని స్పష్టం చేశారు. మధ్యప్రాచ్యంలో మిస్సైలీదాడుల నుంచి రక్షణకై 175 బిలియన్ డాలర్లతో గోల్డన్ డోమ్‌ను నిర్మించే ట్రంప్ ప్రణాళికలను రష్యా– చైనా సంయుక్త ప్రకటన తీవ్రంగా తప్పుపట్టింది. అంతేగాక, అమెరికా–రష్యా ఆయుధ నియంత్రణ ఒప్పందం గడువు ఫిబ్రవరిలో ముగిసినప్పటికీ, దాని పొడిగింపు కోసం రష్యా చేసిన ప్రతిపాదనకు అమెరికా స్పందించకపోవటాన్ని జిన్‌పింగ్, పుతిన్ విమర్శించారు. అది అణ్వాయుధాల నియంత్రణకు సంబంధించిన ఒడంబడిక.రష్యా–చైనా సంయుక్త ప్రకటన ప్రభావం ఇరాన్ యుద్ధంలో శాంతికోసం జరుగుతున్న ప్రయత్నాలపై కూడా ఉంటుంది. ఈ విషయమై జిన్‌పింగ్‌తో ట్రంప్ చర్చించినప్పటికీ ఫలితం రాలేదు. ఇరాన్ యుద్ధం ముగించేందుకు చర్చలు తప్ప యుద్ధం సాధనం కాదని జిన్‌పింగ్ పుతిన్‌తో చర్చల్లో స్పష్టం చేశారు. ట్రంప్ ముందు ఇప్పుడు మూడు ముసాయిదా ప్రతిపాదనలున్నాయి. ఒకటి, ట్రంప్ సొంత శాంతి ప్రణాళిక; రెండు, టెహరాన్ శాంతి ప్రణాళిక; మూడు, చైనా నాలుగు సూత్రాల పథకం. ట్రంప్, ఇరాన్‌లు సంప్రదింపుల ద్వారా రాజీకిరాక తప్పదు. రష్యా–చైనా సంయుక్త ప్రకటన ఇరాన్ యుద్ధం ముగింపునకై సంప్రదింపులు ప్రారంభించాల్సిందిగా ట్రంప్‌కు గట్టిగా గుర్తుచేస్తున్నది. జిన్‌పింగ్, పుతిన్ చర్చల్లో మరో ప్రధానాంశం ఆర్థిక సహకారం. అందులో ఇంధన రంగానిది చోదకపాత్ర అని పుతిన్ సరిగ్గానే చెప్పారు. ఉక్రేన్‌పై రష్యా యుద్ధం మొదలు పెట్టిన తర్వాత పశ్చిమ దేశాలు రష్యా ఆయిలు, గ్యాస్ కొనుగోలును అంచెలంచెలుగా పూర్తిగా నిలుపు చేశాయి. ఆర్థికంగా రష్యా వెన్ను విరచటం వారి ఉద్దేశం. అప్పుడు చైనా ప్రధాన కొనుగోలుదారుగా ముందుకువచ్చి రష్యా ఆర్థిక శ్వాసకు దన్నుగా నిలిచింది. ఈ శిఖరాగ్ర సమావేశంలో నేతలిరువురూ దాదాపు 40ఒప్పందాలపై సంతకాలు చేశారు. వాటిలో ఇంధన భద్రత పుతిన్ ప్రాధాన్యత. చైనాకు ఆయిలు, గ్యాస్ నిరంతరాయ సరఫరా నిమిత్తం 'పవర్ ఆఫ్ సైబీరియా' గ్యాస్ పైపులైన్ నిర్మాణంపై చాలా కాలంగా చర్చలు జరుగుతున్నా అవి తాజా సంభాషణల్లో కూడా తుదిదశకు చేరుకోలేదు. పైప్‌లైన్ గూర్చి ఇరుపక్షాలు దాని మార్గం సహా 'ప్రాథమిక అవగాహన'కు వచ్చాయిగాని, దాన్ని అమలు జరిపేందుకు కాల నిర్ణయం జరగలేదు.రానురానూ మీదుమిక్కిలి అరాచకంగా తయారవుతున్న, ఆధిపత్యం పైచేయిగా ఉన్న ప్రపంచంలో రష్యా, చైనాల మధ్య రాజకీయంగా పరస్పర విశ్వాసం, వ్యూహాత్మక సహకారం గాఢమైనాయని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. అటువంటిది చైనా–అమెరికా మధ్య లేదన్నారు.2049 నాటికి– కమ్యూనిస్టు చైనా శతవార్షికోత్సవం నాటికి, చైనాను సుప్రీం ఆర్థిక శక్తిగా తమారు చేయటం షి జిన్‌పింగ్ ఆకాంక్ష. సోవియట్ యూనియన్ కాలంతో పోల్చితే రష్యా ఆర్థిక శక్తి తగ్గుదలలో ఉన్న వాస్తవం విస్మరించరానిది. ఆ కారణంగానే చైనా ఈరోజున రెండవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఉంది.



## ఇటలీలో మోదీ రీల్స్... వీధుల్లోకి భారత యువత

నీట్-యూజీ పేపర్ లీక్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాధ్యత తీసుకోలేదు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించలేదు. ప్రధాన్ రాజీనామా చేసే వరకు, పేపర్ లీక్‌లను నివారించడానికి ఒక పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసే వరకు కాంగ్రెస్ ఆగదు. ప్రధానమంత్రి ఇటలీలో రీల్స్ తీస్తుండగా, భారతదేశ యువత పేపర్ లీక్‌పై న్యాయం కోరుతూ వీధుల్లోకి వచ్చారు. నీట్ పేపర్ లీక్ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసింది. చాలా మంది పిల్లలు ప్రాణాలు కూడా కోల్పోయారు.

లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

# 'తెలంగాణ షాద్' కాళోజీ రామేశ్వరరావు



నాటి నిజాం నిరంకుశ పాలనలో భూస్వాముల, పెత్తందారులు దౌర్జన్యాలకు బలైపోతున్న సామాన్య రైతులు, ప్రజల పక్షాన నిలిచి పోరాడిన న్యాయవాది, ప్రతిభాశాలి, ఉన్నత వ్యక్తిత్వశీలి, స్ఫురద్రూపి, ప్రజా సేవకుడు, షాద్‌గా ప్రసిద్ధి పొందిన తెలంగాణ ఉర్దూ కవి కాళోజీ రామేశ్వరరావు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఇతని తమ్ముడే. రామేశ్వరరావును పెద్ద కాళోజీ అని, నారాయణ రావును చిన్న కాళోజీ అని పిలుస్తూ ఉండేవారు.

### బాల్యం, విద్యాభ్యాసం

1908, జూన్ 22న కాళోజీ రంగారావు, రమాబాయమ్మ, దంపతులకు జన్మించాడు. కాళోజీ రామేశ్వరరావు పూర్తి పేరు రామేశ్వర్ నరహరి రాధాకిషన్ ఇతని విద్యాభ్యాసం మడికొండ, హనుమకొండ,వరంగల్ తదితర ప్రాంతాలలో జరిగింది. ఇతడు వకాలత్ పట్టా పుచ్చుకుని వరంగల్ పట్టణంలో ప్రాక్టీసు చేసి గొప్ప క్రిమినల్ లాయర్‌గా పేరు గడించాడు. ఇతడికి తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో గొప్ప పండితుడు. ఈ భాషలే కాక ఇతడికి పార్సీ, అరబ్బీ భాషలలో కూడా ప్రవేశం ఉంది. ఇతడు స్వాతంత్రోద్యమ పోరాటంలో కవిగా, న్యాయవాదిగా తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాడు. బందగీకి, ఇస్నూరు దొరకు మధ్య నడిచిన కేసులో బందగి పక్షాన వాదించి గెలిపించాడు. ఇతడు రాజకీయంగా మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ అభిమాని. బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, పి.వి.నరసింహారావు వంటి వారు ఇతడంటే ఎంతో అభిమానం చూపేవారు.

### ఉద్యమ నేపథ్యం

రామేశ్వరరావుపై చిన్నతనంలోనే స్వాతంత్రోద్యమం, ఆర్యసమాజ ప్రభావం ఉండేది. న్యాయవిద్యను అభ్యసిస్తున్న రోజుల్లో దేశంలో స్వాతంత్రోద్యమం ఉధృతంగా సాగుతున్నది. కాంగ్రెసు న్యాయస్థానాల బహిష్కరణకు పిలుపునిచ్చింది. స్వాతంత్రోద్యమంలో, నిజాం వ్యతిరేఖోద్యమంలో అక్రమ కేసులు ఎదుర్కొంటున్న దేశభక్తులు, ఉద్యమకారుల తరపున కోర్టులో న్యాయపోరాటం చేసి వారిని విడిపించేవాడు. నిష్కళంక దేశభక్తి కలిగి, నిరంతరం ప్రజలకు సేవ చేయాలనే తపన గల రామేశ్వరరావు ఆ రోజుల్లో పేరుమోసిన క్రిమినల్ లాయర్ అయినప్పటికీ పెద్దగా డబ్బు సంపాదించినది ఏమీలేదు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వచ్చిన అతను స్వాతంత్ర్యానంతరం వరంగల్ పట్టణం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా, కొంతకాలం మున్సిపల్ కౌన్సిలర్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించాడు. ఆతరువాత కారణంతరాలచే రాజకీయాలకు దూరమయ్యాడు.

### అన్నదమ్ముల అనుబంధం

రామేశ్వరరావుకు తమ్ముడు కాళోజీ నారాయణరావు ఆరేండ్ల వయస్సులో ఉన్నప్పుడే తల్లి చనిపోయింది. అన్నగారైన రామేశ్వరరావు తమ్ముడికి అన్నీ తానై ఏ లోటు రాకుండా చూసుకున్నాడు. అతనికి కావలసినవన్ని సమకూర్చి పెట్టాడు. నారాయణరావు ఏ ఉద్యోగం చేయకుండా తన కుటుంబాన్ని పట్టించుకోకుండా స్వాతంత్రోద్యమం, నిజాం వ్యతిరేకొద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని అనేక మార్లు జైలుకు వెళ్లేవాడు. సభలు, సమావేశాల్లో విరివిగా పాల్గొనేవాడు. ఆ పరిస్థితుల్లో తమ్ముడితో పాటు అతని కుటుంబ పోషణ బాధ్యత రామేశ్వరరావే చూసుకునేవాడు. నారాయణరావుకు ఎప్పుడైనా డబ్బు అవసరమైతే తానెక్కడున్నా అన్నగారికి చీటీ రాసి పంపేవాడు. వెంటనే అన్నగారు తమ్ముడికి డబ్బు పంపేవాడు. వారిద్దరిది రామలక్ష్మణుల వంటి అన్యోన్య ప్రేమ. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు తన అన్న చనిపోయినపుడు మాట్లాడిన మాటలు గుర్తుచేసుకోవాలి. 'నేను నా ఆరవయేట మా అన్న భుజాల మీదకు ఎక్కాను. మరణించేదాకా దిగలేదు. నేను అతని భుజాలపైకి ఎక్కడం గొప్ప కాదు. నా డెబ్బయి ఏండ్ల వయస్సు వరకు అతడు నన్ను దించకుండా మోస్తూ ఉండడం గొప్ప' అంటూ తన పట్ల సోదరుడు నిర్వహించిన గొప్ప బాధ్యత ఎటువంటిదో చాటి చెప్పాడు. నారాయణరావు కుటుంబ బాధ్యతలను రామేశ్వరరావే చూడడం వల్ల కాళోజీ నారాయణరావు స్వేచ్ఛగా ఉద్యమాలలో, సాహితి సభలలో, సమావేశాల్లో పాల్గొన గలిగాడంటే అతిశయోక్తి కాదు.

### వ్యక్తిగత జీవితం:

రామేశ్వరరావు భార్య పేరు సరస్వతి భాయి. భర్త ఆలోచనలు, ఆదర్శాలు అర్థం చేసుకున్న ఉత్తమ ఇల్లాలు. తమ్ముడిని, అతని కుటుంబాన్ని తన భర్త పోషిస్తున్నా ఏనాడు స్వార్థచింతనతో మాట్లాడలేదు. తమ్ముడిపట్ల అన్నకు ఉన్న అనురాగం అర్థం చేసుకుని సహకరించేది. వీరికి ఒక కూతురు. ఆమె పేరు సక్కుబాయి.

### ఉర్దూ కవిత్వం

ఇతడు షాద్ పేరుతో అద్భుతమైన ఉర్దూ కవిత్వాన్ని వ్రాశాడు. ఇతడు వ్రాసిన గజళ్ళు ఢిల్లీ, కాశ్మీర్ వంటి ప్రాంతాలలో అక్కడి రేడియోలు ప్రసారం చేశాయి. ఇతని ఆధ్వర్యంలో అనేక ముషాయిరాలు జరిగాయి. ఇతడు ఉర్దూలో వందలాది గజళ్ళు, కవితలు వ్రాశాడు. ఇతని కవితలు కొన్ని తెలుగులోనికి దేవులపల్లి సుదర్శనరావు చేత అనువదించబడ్డాయి. ఇతని కవితలు సియాసత్ వంటి పత్రికలలో ప్రచురితమయ్యాయి. ఇతడు రాసిన కొన్ని ఉర్దూ కవితలు కలామే షాద్, కాయానా తేషాద్ (అవ్వల్ దువ్వల్) పేరుతో పుస్తకంగా వెలువడ్డాయి. ఇతడి హిందీ కవితలు గుణ్‌గాన్ పేరుతో అచ్చయ్యాయి. భారత ఉపరాష్ట్రపతి శ్రీ హిదయతుల్లా చేతుల మీదుగా రామేశ్వరరావు కు ఘన సన్మానం జరిగింది. రామేశ్వరరావు అభిమానులు ఆయన సహస్ర చంద్రోదయ దర్శన మహోత్సవాన్ని పేర్వారం జగన్నాథం గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఎన్నో త్యాగాలతో కూడిన జీవితాన్ని గడిపిన కాళోజీ రామేశ్వరరావు 1996 నవంబర్ 11న మరణించారు.

– సుధాకర్.ఏ.వి, 9000674747

# దక్షిణాఫ్రికాలో త్రైపాక్షిక కూటమిలో బీటలు

## ఎఎన్‌సి నాయకత్వం మాపై కుట్ర పన్నుతోందని కమ్యూనిస్ట్ పార్టీ ఆరోపణ

రోజర్ మెకెంజీ

ఒకవైపు రాజకీయ పార్టీలలో ద్వంద్వ సభ్యత్వం మంచి చెడుల గురించి బ్రిటన్ వామపక్ష వర్గాలలో తీవ్ర చర్చలు జరుగుతుండగా, మరోవైపు ఇటువంటి ఒక దీర్ఘకాలిక ఏర్పాటు తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్నది. మెజారిటీ నల్లజాతి ప్రజలను అణచివేసిన జాత్యహంకార, వర్ణవివక్షతో కూడిన శ్వేతజాతి వలస పాలనను ఓడించే పోరాటమంతటా, దక్షిణాఫ్రికా కమ్యూనిస్ట్ పార్టీ (ఎస్‌ఎసిపి), ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి)కు వెన్నెముకగా నిలిచింది.కానీ, విముక్తి కోసం జరిగిన తీవ్రమైన, బలమైన పోరాటంలో ఏర్పడిన ఈ వ్యూహాత్మక కూటమిలోని సభ్యులైన కమ్యూనిస్టులకు ఎఎన్‌సి తాజాగా ఒక 'అల్టిమేటం' జారీ చేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది జరిగే స్థానిక ప్రభుత్వ ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేయాలని ఎస్‌ఎసిపి నిర్ణయించుకున్న తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది.

ఎఎన్‌సికి చేతికింద ఉన్నట్లయితే ఎస్‌ఎసిపికి ఒక రాజకీయ పార్టీగా దాని ఉనికిని అంగీకరిస్తున్నట్లు కనపడుతోంది. కమ్యూనిస్టులను వేటాడుతున్నట్లు కనిపిస్తున్న ఈ చర్యలో ఎఎన్‌సి ఇప్పుడు ఎస్‌ఎసిపి సభ్యుల నుండి డిక్లరేషన్‌ను కోరింది. పార్టీ ప్రచారం కోసం పనిచేస్తున్నారని తాను భావించే వారిపై చర్యలు తీసుకుంటామని ఎఎన్‌సి బెదిరిస్తోంది. చారిత్రాత్మక కూటమి భవిష్యత్తుకు ముప్పు తెచ్చే ఈ చర్య ఏ మాత్రం ఒక చిన్నపాటి విధానపరమైన విభేదం కాదు. ఇది కూటమిని,ద్వంద్వ సభ్యత్వాన్ని సంకుచిత ఎన్నికల పరంగా పునర్నిర్వచించే ప్రయత్నానికి సమానం. ఇది ఒక మిత్రపక్షాన్ని తమ చెప్పుచేతలలో ఉండాలని, శాశ్వత మద్దతు కోరే ఏకపక్ష డిమాండ్‌గా ఒక చారిత్రక వ్యూహాత్మక సంబంధాన్ని దిగజార్చుతోంది. స్వతంత్రంగా ఎన్నికలలో పోటీ చేసే ఎఎన్‌సి హక్కుకు ఎస్‌ఎసిపి ఎల్లప్పుడూ మద్దతు ఇచ్చింది. అలాగే, స్వతంత్రంగా ఎన్నికలలో పోటీ చేసినందుకు ఎఎన్‌సిని ఎన్నడూ శత్రువుగా పరిగణించలేదు. ఎఎన్‌సిని నిర్మించడంలో, దానికి ఓటు వేయడంలో, ప్రచారం చేయడంలో పాల్గొన్నందుకు ఎస్‌ఎసిపి సభ్యులలో ఎవరినీ ఎన్నడూ క్రమశిక్షణా చర్యలకు గురిచేయలేదు లేదా బెదిరించలేదు. నిజానికి కేవలం ఎఎన్‌సి స్వతంత్రంగా ఎన్నికలలో పోటీ చేయడాన్ని అంగీకరించడమే కాకుండా, ఎఎన్‌సి ఎన్నికల పోటీలకు ఎస్‌ఎసిపి మద్దతు కూడా ఇచ్చింది.అదే సమయంలో కేవలం ఎఎన్‌సికి ఓటు వేయడం, ప్రచారం చేయడంతో సరిపెట్టకుండా, ప్రత్యక్ష ఎన్నికలలో పోటీ చేసే హక్కును ఎస్‌ఎసిపి ఏనాడూ వదులుకోలేదు. ఎఎన్‌సితో వ్యూహాత్మక పొత్తు అంటే కమ్యూనిస్ట్ పార్టీని రద్దు చేసుకోవటంగా అర్థం కాదు. ద్వంద్వ సభ్యత్వం అంటే, కార్మిక వర్గానికి చెందిన ఒక స్వతంత్ర పార్టీగా, ఏ విషయంపైనైనా ఆలోచించడానికి, సంఘటితం కావడానికి, ప్రచారం చేయడానికి, పోరాటాలకు నేతృత్వం వహించడానికి, వ్యూహాలను రూపొందించుకోవడానికి ఎస్‌ఎసిపికి ఉన్న హక్కును రద్దు చేయడమని అర్థం కాదు.

దక్షిణాఫ్రికాలోని జాతీయ ప్రజాస్వామ్య శక్తులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, ఎస్‌ఎసిపి ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించుకోవడం వల్ల తలెత్తలేదు.దక్షిణాఫ్రికా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు చాలా లోతుగా పాతుకుపోయినవి. దక్షిణాఫ్రికాలోని శ్రామిక వర్గానికి విముక్తిని స్పష్టంగా, అర్థవంతంగా అందించడానికి అవసరమైన సమూల ఆర్థిక మార్పులను తీసుకురావడంలో ఎఎన్‌సి విఫలమైంది. ఎఎన్‌సి నయా సరళీకృత విధానం వైపు మొగ్గు చూపడంతో దేశ ఆర్థిక వ్యవస్థపై గుత్తాధిపత్య పెట్టుబడిదారీ శక్తుల నియంత్రణ పెరిగింది. గృహనిర్మాణం, ఉద్యోగాల కల్పనతో పాటు, భూమి, ప్రజల పాదాల కింద ఉన్న సహజ సంపదపై సామూహిక యాజమాన్యం వంటి అంశాలకు సంబంధించి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోనూ ఎఎన్‌సి విఫలమైంది. ఈ కారణాల వల్లే ఎఎన్‌సికి లభించే మద్దతు క్షీణించింది. తద్వారా అది 'నేషనల్ పార్టీ'తో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కమ్యూనిస్టులను ఎంతగా వేటాడినా ఈ మౌలిక సమస్యలను ఏమాత్రం మార్చలేరు. శ్రామిక వర్గాల మధ్య విముక్తి ఉద్యమానికి లభించే మద్దతు తగ్గుముఖం పట్టిన సమయంలోనూ, స్థానికంగానూ, జాతీయంగానూ అవినీతి పెరిగిపోయిన తరుణంలోనూ స్థానిక ప్రభుత్వ ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేయాలని ఎస్‌ఎసిపి తీసుకున్న నిర్ణయం వెలువడింది.



దక్షిణాఫ్రికాలో పేదరిక స్థాయిలు ఇప్పటికీ అధికంగానే ఉన్నాయి. ఈ సంవత్సరం ప్రారంభంలో విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం, 2006లో 'దిగువ స్థాయి పేదరిక రేఖ' (ఎల్‌బిపిఎల్) ఆధారంగా లెక్కించినప్పుడు పేదరిక శాతం 57.5గా (సుమారు 27.3 మిలియన్ల మంది) నమోదైంది. 2023 నాటికి ఇది 37.9 శాతానికి (సుమారు 23.2 మిలియన్ల మందికి) తగ్గింది.గత 17 ఏళ్లలో పేదరికంలో వచ్చిన ఈ 19.6 శాతం తగ్గుదల, సగటున సంవత్సరానికి సుమారు 1.15 శాతం తగ్గుదలకు సమానం. మొత్తంగా చూస్తే, 2006తో పోలిస్తే 2023 నాటికి ఎల్‌బిపిఎల్ దిగువన జీవిస్తున్న ప్రజల సంఖ్య 4.1 మిలియన్లు తగ్గిందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.క్వాజూలూనాటల్, ఈస్ట్రన్ కేప్, నార్త్ వెస్ట్, లిపోపో రాష్ట్రాలు దేశంలోనే అత్యంత పేదరికంతో సతమతమవుతున్న ప్రాంతాలుగా అత్యధిక పేదరిక స్థాయిలను నమోదు చేశాయి. ఇక్కడ పేదరికం పిల్లలు, నల్లజాతి ఆఫ్రికన్లు, మహిళలు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారిపై అసమాన రీతిలో ప్రభావం చూపుతోంది. పేదరికంతో బాధపడేవారిలో సుమారు 60 శాతం మంది ఈ నాలుగు రాష్ట్రాల్లోనే నివసిస్తున్నారు. దక్షిణాఫ్రికాలోని ప్రతి నలుగురు పేదవారిలో ఒకరు కేవలం క్వాజూలునాటల్ (కెజెడ్ఎన్) రాష్ట్రంలోనే నివసిస్తుండటం గమనార్హం. 2023లో వెస్ట్రన్ కేప్ తర్వాత అత్యల్ప పేదరిక స్థాయిలో రెండవ స్థానాన్ని గౌటెంగ్ నమోదు చేసినప్పటికీ, కాలక్రమేణా ఆ ప్రావిన్స్‌ల్లో పేదరిక స్థాయిలు తగ్గుముఖం పట్టినప్పటికీ, 2015 నుండి ఆ ప్రావిన్స్ పేదరిక వాటా మాత్రం గణనీయంగా పెరిగింది. దక్షిణాఫ్రికాలోని ప్రతి ఐదుగురు పేదవారిలో సుమారు ఒకరు వెస్ట్రన్ కేప్ (డబ్ల్యుసి)లోనే నివసిస్తున్నారు.


అయితే, నల్లజాతి ఆఫ్రికన్లు మాత్రం అత్యధిక స్థాయిల పేదరికాన్ని మోస్తూనే ఉన్నారు. నల్లజాతి ఆఫ్రికన్లలో పేదరికం 2006లో 67.3 శాతం నుండి 2023 నాటికి 43.8 శాతానికి తగ్గింది. ఈ తగ్గుదల ఉన్నప్పటికీ, ఇతర జనాభా సమూహాలతో పోలిస్తే నల్లజాతి ఆఫ్రికన్లలోనే పేదరిక స్థాయిలు అత్యధికంగా ఉన్నాయి. 'కలర్డ్స్' (రంగుజాతులు) వర్గంలో పేదరిక స్థాయిలు స్థిరంగా, గణనీయంగా తగ్గాయి. ఇవి 2006లో 42.8 శాతం నుండి 2023 నాటికి 24.6 శాతానికి పడిపోయాయి. భారతీయులు/ఆసియన్లలో ఈ కాలమంతటా పేదరిక స్థాయిలు చాలా తక్కువగా ఉన్నాయి. ఇవి 2006లో 10.5 శాతం నుండి 2015 నాటికి 2.8 శాతానికి తగ్గి, ఆ తర్వాత 2023లో తిరిగి 5.8 శాతానికి పెరిగాయి. అన్ని జనాభా సమూహాలతో పోలిస్తే శ్వేతజాతీయులలో పేదరిక స్థాయిలు అత్యల్పంగానే కొనసాగాయి. అయినప్పటికీ, ఆ స్థాయి కూడా రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగి, 2006లో 0.6 శాతం నుండి 2023 నాటికి 1.4 శాతానికి చేరుకుంది. ఈ కాలమంతటా, పురుషుల కంటే మహిళలే అధిక స్థాయిల పేదరికాన్ని ఎదుర్కొన్నారు. పురుషులలో పేదరిక శాతం 2006లో 54.7 శాతం నుండి 2023 నాటికి 36.0 శాతానికి తగ్గగా, అదే కాలంలో మహిళలలో పేదరిక శాతం 60.3 శాతం నుండి 39.7 శాతానికి తగ్గింది. 2023లో పేద జనాభాలో పిల్లలు తీవ్రమైన పేదరికం అనుభవిస్తున్నారు. పేదల్లో వారి వాటా 43.1 శాతం మరోవైపు, 65 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు గల వారి విభాగంలో పేదరిక స్థితిలో అత్యధిక మెరుగుదల కనిపించింది. 2006 – 2023 మధ్య వీరి పేదరిక శాతం 54.8 శాతానికి (మొత్తం 30.6 శాతం తగ్గుదల) తగ్గింది. 2025లో దక్షిణాఫ్రికాలో నిరుద్యోగ రేటు 32.39 శాతంగా నమోదైంది. 1991–2025 మధ్య కాలంలో, నిరుద్యోగ రేటు 9.25 శాతం మేర పెరిగింది. అపారమైన వనరులు కలిగిన దేశమైన దక్షిణాఫ్రికా, తన జనాభాకు సరిపడా ఆహారాన్ని సమకూర్చగలుగుతుందా లేదా అనే దానిపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

(బ్రిటీష్ కమ్యూనిస్టు పార్టీ పత్రిక 'మార్నింగ్ స్టార్' సౌజన్యంతో)

## 'సంక్షోభమా లేక అవకాశమా?'

# అనిశ్చితి మధ్య భారత ఆర్థిక భవిష్యత్తు

ఈ ఆర్థిక సంవత్సరం(2026)ప్రారంభంలో భారత ఆర్థిక వృద్ధిపై అంచనాలు 6.8 శాతం నుంచి 7.2 శాతం మధ్యలో ఉన్నాయి. అయితే ఇరాన్ పై జరిగిన దాడి తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ముడి చమురు ధరలు ఆకాశమంటాయి, రూపాయి విలువ తీవ్రంగా పడిపోయింది. ఫలితంగా మూడీస్ సంస్థ 2026లో భారత వృద్ధి రేటు 6 శాతానికి పడిపోతుందని హెచ్చరిస్తోంది. ఇటీవలి తాజా గణాంకాల ప్రకారం భారత వాస్తవ జిడిపి (స్థూల దేశీయోత్పత్తి ) వృద్ధి 2025–26లో 7.6 శాతంగా ఉంది. అయితే 2026–27లో ఈ వృద్ధి రేటు మందగిస్తుందని, ఇంధన ధరల పెరుగుదల, ప్రపంచ వాణిజ్య అనిశ్చితుల కారణంగా సవాళ్లు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ముందున్న దారి ఏమిటి? రుపాయి బలహీనతను ప్రయోజనంగా మార్చుకోవడం సమంజసమైన మార్గం. ఒక సంవత్సరం క్రితం ఒక డాలర్ విలువ సుమారు 85 రూపాయలు ఉండేది. నేడు అది రూ.96కు చేరింది. ఫలితంగా భారత ఎగుమతులు చౌకగా, పోటీతత్వంతో మా రాయి. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఎగుమతి రంగాన్ని ప్రోత్సహించాలి. అంతేకాకుండా విదేశీ కంపెనీలకు భారత్‌లో తయారీ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి అనువైన వాతావరణాన్ని కల్పించాలి. దిగుమతి చమురు, గ్యాస్‌పై భారత్ ఆధారపడటం తగ్గించడం తక్షణ అవసరం. ప్రధాన మంత్రి రైతులను సౌర పంపుల వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రిక్ వాహనాలు, జీవ ఇంధనాలను మరింతగా ప్రోత్సహించాలి. రష్యా రూపాయలకు చమురును విక్రయించడానికి సిద్ధపడితే దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకోవాలి. ఈ చర్యలు దిగుమ తి బిల్లును గణనీయంగా తగ్గించగలవు. ప్రస్తుతం చము రు, బంగారం, ఎరువులు, వంటనూనె, ఎలక్ట్రానిక్స్ – ఈ ఐదు వస్తువుల దిగుమతులే భారత్ మొత్తం దిగుమతుల్లో సగానికి పైగా ఉన్నాయి. దేశీయ వినియోగ డిమాండ్ భారత ఆర్థిక వృద్ధికి ప్రధాన చోదక శక్తి. ద్రవ్యోల్బణం పెరిగితే వినియోగం దెబ్బతింటుంది, ముఖ్యంగా దిగువ ఆర్థికవర్గాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ప్రభుత్వాలు చేస్తున్న నగదు బదిలీలు అంతా ఈ వర్గాల ను రక్షించడంలో సహాయపడతాయి. మరోవైపు కరోనా సమయంలో చూసినట్లు ప్రీమియం వినియోగ డిమాండ్ స్థితిస్థాపకంగా ఉంటుంది. బలమైన స్టాక్ మార్కెట్లు సంపన్న వర్గాలకు పెట్టుబడుల్లో లాభాలు అందిస్తున్నాయి,




తద్వారా వారి వినియోగ సామర్థ్యం పెరుగుతోంది. ఇలాంటి చిన్న విధాన మార్పులు కూడా కావాల్సిన ప్రభావాన్ని చూపగలవు.

భారత ఆర్థిక దృశ్యంలో మరో ముఖ్యమైన సవాల్ నిరుద్యోగ సమస్య. 2026లో యువత నిరుద్యోగిత రేటు 15 శాతానికి చేరింది. 22–29 సంవత్సరాల వయస్సు గల గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగిత రేటు 33 శాతంగా ఉంది. గ్రాడ్యుయేట్లలో సుమారు 40 శాతం మంది ఉపాధి లేకుండా ఉన్నారు. భారత్‌లో 15–29 సంవత్సరాల మధ్య 367 మిలియన్ల యువకులు ఉన్నారు. ఇది అద్భుతమైన జనాభా సామర్థ్యం. అయితే విద్యా నైపుణ్యాలకు, సృష్టించబడుతున్న ఉద్యోగాలకు ఎంతో అంతరం ఉంది. ప్రతి సంవత్సరం 50 లక్షల గ్రాడ్యుయేట్లు ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. కానీ తగినంత ఉద్యోగాలు లేకపోవడంతో ఈ విద్యాసామర్థ్యం సరైన ప్రయోజనాలను అందించడంలేదు. జనాభా డివిడెండ్ ప్రయోజనాన్ని పొందడానికి 20–30 నాటికి సమయం చాలా కఠినంగా మారుతోంది. ఆ తర్వాత కార్మిక వయస్సు జనాభా వాటా తగ్గడం ప్రారంభమవుతుంది. వాతావరణ మార్పు ప్రభావం కూడా ఆర్థిక వ్యవస్థపై దృష్టి పెట్టాల్సిన అంశం. ప్రపంచంలోనే అత్యంత వేడిగా ఉండే 100 నగరా ల్లో 98 భారత్ లోనే ఉన్నాయి. ఏప్రిల్ 24 నాలుగేళ్లలోనే అత్యంత వేడి రోజుగా నమోదైంది. వేడి తీవ్రత విపరీతంగా పెరుగుతుండడంతో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగింది. గత ఏప్రిల్ 25న గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 256 జిడబ్ల్యు (గిగావాట్)కు చేరింది, గత ఏడాది ఇదే నెలలో 235 జిడబ్ల్యుగా ఉండేది. గ్రిడ్లపై భారం పెరిగి, లోడ్ షెడ్డింగ్ ప్రమాదం పెరుగుతుంది. ఇది ఉత్పాదన మీద తీవ్ర ప్రభావం చూపిస్తుంది. రైతులు అప్పటికే ఇన్పుట్ ఖర్చులతో పోరాడుతున్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతంలో కొరత ఏర్పడి, వ్యవసాయ ఉత్పత్తి తీవ్రంగా దెబ్బతింటుంది. 2025లో తీవ్ర వాతావరణ ఘటనలు 4,419 మంది ప్రాణాలను బలితీసుకున్నాయి, 2025లోనే 99 శాతం రోజుల్లో తీవ్ర వాతావరణం నెలకొంది. ఈ మహమ్మారి స్థాయి సంక్షోభం కొనసాగితే ఆర్థిక వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉంది. తెలుగు రాష్ట్రాలను ప్రత్యేకంగా పరిశీలిస్తే, తెలంగాణ నగరీకరణ రంగంలో దేశాన్నే దాటిపోయింది. 2026 నాటికి తెలంగాణలో 50.08 శాతం నగరీకరణ ఉంటుందని అంచనా. ఇది దేశ సగటు 36.01 శాతం కంటే చాలా ఎక్కువ. కృత్రిమ మేధ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీతో బిల్డింగ్ నిర్మాణ అనుమతుల ప్రక్రియను సామాన్యంగా మారుస్తుంది. బిల్డ్ వేదిక 24 లక్షల చదరపు అడుగుల, 66 అంతస్తుల భవన నిర్మాణ ప్రణాళికను కేవలం 1 నిమిషం 31 సెకన్లలో పరిశీలించి రికార్డు సృష్టించింది. వ్యవస్థకు మంచి సామర్థ్యం ఉంది కానీ ఇలాంటి సాంకేతిక సామర్థ్యం ఉద్యోగాల కల్పనకు అనువదించబడుతుందా లేదా అనేది ప్రశ్న.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో అమెజాన్ మార్కెట్ వృద్ధి నాలుగు రెట్లు పెరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలు కలిపి అమెజాన్ దగ్గర 75 వేలకు పైగా విక్రేతలు ఉన్నారు. ఇది డిజిటల్ ఆర్థిక వ్యవస్థ సామర్థ్యానికి సంకేతం. అయితే నిరుద్యోగ సమస్య మాత్రం ఇక్కడా పెద్ద సవాలుగా మిగిలింది. తెలుగు రాష్ట్రాల్లోని యువతకు స్థానిక ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉండటంతో విదేశాల వలసలు పెరుగుతున్నాయి. చివరిగా, ప్రపంచీకరణ అనిశ్చితులు, యుద్ధ ఉద్రిక్తతలు, దేశీయ సమస్యల మధ్య భారత ఆర్థిక వ్యవస్థ కీలకమైన మలుపులో ఉంది. దేశం రెండు మార్గాలను ఎంచుకోవచ్చు. ఒకటి సురక్షితంగా 6 శాతం వృద్ధితో సరిపెట్టుకోవడం, రెండవది బోల్డ్ నిర్ణయాలు తీసుకుని 7 శాతం వృద్ధి లక్ష్యంగా పయనించడం. ప్రస్తుత ఇంధన ధరల సంక్షోభం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారీ సవాళ్లు సృష్టిస్తున్నాయి. కానీ ప్రతి సంక్షోభంలోనూ ఓ అవకాశం ఉంటుంది. భారత ప్రభుత్వం సరైన దృక్పథంతో, సరైన విధానాలతో ముందుకు వెళితే, ఈ సంక్షోభాన్ని ఒక బంగారు అవకాశంగా మార్చుకోవడం సాధ్యమవుతుంది. దేశ భవిష్యత్తు నేడు తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుంది.

– డాక్టర్॥ కోలాహలం రామ్ కిశోర్

## వరి కొయ్య మంటల్లో చిక్కుకొని రైతు మృతి



ప్రజాపక్షం/నకిరేకల్(శాలి గౌరారం) : ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకుని ఓ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఎన్జీ కొత్త పల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది.పోలీసులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన నూనెముంతల సత్తయ్య (72)తన వ్యవసాయ పొలంలో వరి కొయ్యలకు నిప్పు పెట్టే క్రమంలో ఒక్కసారిగా మంటలు భారీగా చెలరేగాయి.దీంతో మంటలు ఆయనను చుట్టుముట్టడంతో పాటు తీవ్రంగా వ్యాపించిన పొగలో చిక్కుకుని ఊపిరి ఆడక అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.ఈ ఘటనను గమనించిన స్థానికులు,బంధువులు వెంటనే అతన్ని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. మంటల ప్రభావంతో సత్తయ్య చేతులు,కాళ్లు,ముఖంపై తీవ్ర గాయాలు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడి కుమారుడు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు.అనంతరం శవపరీక్ష నిమిత్తం మృత దేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ ఐ సైదులు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతులకు చెల్లింపులు : కలెక్టర్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.గురువారం ఉదయాదిత్య భవన్‌లో డీఆర్‌డీఏ,ఐకేపీ,పీఏసీఎస్ ఏజెన్సీల ప్రతినిధులు, ట్యాబ్ ఆపరేటర్లు, ఏపీఎంలు, పీఏసీఎస్ సీఈవోలు, మండల వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీలను పూర్తిచేసి రైతుల ఖాతాల్లో సకాలంలో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.మిల్లర్లు ట్రక్ షీట్లు త్వరితగతిన ఇవ్వాలని, ధాన్యం నిల్వలు ఎక్కువ కాలం కొనుగోలు కేంద్రాల్లో ఉండకుండా వెంటనే తరలింపు ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీసీఓ పత్యానాయక్, పౌరసరఫరాల అధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ కుటుంబాలకు పిఆర్‌టియు అండ



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ఉపాధ్యాయ కుటుంబాలకు పిఆర్‌టియు అండగా ఉంటుందని శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఇటీవల మరణించిన పిఆర్‌టియు సభ్యులు చెరుకు శ్రీను, మహ్మద్ అబ్దుల్ రషీద్ కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి లక్ష చొప్పున సంఘం సంక్షేమ నిధి నుండి చెక్కులను అందజేసి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిఆర్‌టియు సంఘం మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు అన్ని రకాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల యొక్క సర్వీస్ పరమైన సమస్యలతో పాటుగా ఆపదలో ఉన్న వారికి అండగా కూడా ఉంటుందన్నారు. జాతీయ స్థాయిలో 70వేల పైచిలుకు సభ్యత్వాలను కలిగిన ఏకైక అతిపెద్ద ఉపాధ్యాయ సంఘం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తంగెళ్ల జితేందర్ రెడ్డి, తీగల నరేష్, కందుకూరి శివశంకర్, ధారాసింగ్, గుగులోతు తావీర్య, దండుగుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో నడిరోడ్డుపై యువకుల వీరంగం

కూలీలపై దాడి, ట్రాక్టర్‌ను తగలబెడతామని బెదిరింపులు



ప్రజాపక్షం/కోదాడ: కోదాడ పట్టణంలోని మద్యం మత్తులో రెచ్చిపోయిన యువకులు గుంపు నడిరోడ్డుపై హల్‌చల్ సృష్టించి భయాందోళనలకు గురిచేసింది. వ్యవసాయ పనులు ముగించుకుని ట్రాక్టర్‌పై ఇంటికి తిరిగి వస్తున్న కూలీలపై దాడికి దిగిన ఘటన తీవ్ర కలకలం రేపింది. అనంతగిరి మండల కేంద్రానికి చెందిన కొందరు కూలీలు తొగర్రాయి గ్రామంలో పనులు ముగించుకుని కోదాడ మీదుగా వెళ్తుండగా మద్యం, గంజాయి మత్తులో ఉన్న కొందరు యువకులు ట్రాక్టర్‌ను అడ్డగించి డ్రైవర్‌తో పాటు మరికొందరిపై విచక్షణారహితంగా దాడిచేసినట్లు సమాచారం. అడ్డొస్తే ట్రాక్టర్‌ను తగులబెడతామని బెదిరింపులకు దిగడంతో అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దాడిలో కొందరికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించి వీడియోలు సిసి కెమెరా దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నడిరోడ్డుపై యువకుల బీభత్సం చూసిన పట్టణవాసులు పోలీసుల పనితీరుపై అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధిత కూలీలు కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## నేడు ప్రజానాట్యమండలి జిల్లా మహాసభ

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: తెలంగాణ ప్రజానాట్యమండలి నల్లగొండ జిల్లా 4వ మహాసభ ఈ నెల 22న నల్లగొండలోని అమరజీవి నిస్సార్ కళా ప్రాంగణం,సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి చెల్లం పాండురంగారావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కూరుమిద్దె శ్రీనివాస్,పల్లె నర్సింహ హాజరవుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో కళాకారులు ప్రదర్శనలు ఇచ్చేందుకు మినీ రవీంద్రభారతిని ఏర్పాటు చేయాలని, కళాకారులకు ఆర్టీసీ బస్సులు, రైళ్లలో రాయితీ కల్పించాలని కోరారు.మహాసభలో కళాకారులు, సానుభూతిపరులు, రచయితలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఇంధన ధరల భారంపై 'విప్' వినూత్న నిరసన!

యాదగిరిగుట్ట నుండి మోటకొండూరు వరకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య 'సైకిల్ యాత్ర'



ప్రజాపక్షం/యాదాద్రి/మోటకొండూర్ : పెట్రోల్, డీజిల్ ధరల విపరీత పెరుగుదలతో సామాన్య ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వినూత్న రీతిలో నిరసన తెలిపారు. యా దాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణం నుండి మోటకొండూరు మండలం వరకు ఆయన స్వయంగా సైకిల్ తొక్కుతూ సుదీర్ఘ 'సైకిల్ యాత్ర' చేపట్టారు. నిరంతరం ప్రజా సమస్యలపై తనదైన శైలిలో స్పందించే ఎమ్మెల్యే.. సామాన్య, మధ్యతరగతి ప్రజల ఇబ్బందులను, వారి గళాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంగా ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దారిపొడవునా ప్రజలు, పార్టీ శ్రేణులు ఆయనకు మద్దతుగా నిలుస్తూ ఘనస్వాగతం పలికారు.

**రైతుల ఇబ్బందులు తొలగించాలి**

సైకిల్ యాత్ర ముగించుకుని మూటకొండూరు చేరుకున్న ఎమ్మెల్యే.. ఏమాత్రం అలసట లేకుండా మండలంలోని ప్రజా సమస్యలపై, అభివృద్ధి పనులపై సుడిగాలి సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను (ఐకేపీ సెంటర్లను) ఆయన స్వయంగా సందర్శించారు.

**ప్రభుత్వ కార్యాలయాల పనుల్లో నాణ్యత**

అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే నిశితంగా పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన.. నాణ్యత విషయంలో రాజీ పడొద్దన్నారు.

**మహనీయులకు నివాళులు..**

మండల కేంద్రంలోని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా స్మరించుకున్నారు. ప్రాంతీయ అభివృద్ధి, ప్రజా సంక్షేమ మే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మూటకొండూరులో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గంగపురం మల్లేశ్, మండల కాంగ్రెస్ వర్కింగ్ అధ్యక్షులు భాస్కరుని రఘునాథరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మెన్ పచ్చిమట్ల మధార్ గౌడ్, బాలరాజు గౌడ్ పాల్గొన్నారు.

## నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/నూతనకల్/మద్దిరాల : జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, వచ్చే నాలుగు రోజుల్లో పూర్తిస్థాయిలో కొనుగోళ్లను పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మద్దిరాల, నూతనకల్ మండలాల్లోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా సందర్శించి, ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. ఇందుకు సంబంధించి రూ.437 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందని చెప్పారు. మిగిలిన ధాన్యాన్ని కూడా వెంటనే కొనుగోలు చేసేందుకు వీలుగా ప్రతిరోజు ట్యాబ్‌ఎంట్రీలు, ట్రక్ షీట్లను నిరంతరం పరిశీలిస్తూ మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. రోజుకు 10వేల టన్నుల కొనుగోలు ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు, మిల్లుల వద్ద లారీల అన్‌లోడింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఒక ఇంచార్జి అధికారిని నియమించామని, మిల్లుల్లో ధాన్యం అన్‌లోడింగ్ వేగంగా జరిగేలా చూసేందుకు ఒక సీనియర్ అధికారితో పాటు ఒక పోలీసు అధికారిని నియమించి ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాలో ప్రతిరోజు 9 వేల నుండి 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, వెంటనే మిల్లులకు తరలిస్తున్నామని చెప్పారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారని తెలిపారు. ట్రాన్స్‌పోర్టు సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరిస్తూ కొనుగోలు ప్రక్రియకు ఆటంకం కలగకుండా చూస్తున్నామన్నారు. వచ్చే నాలుగు రోజులు ధాన్యం కొనుగోళ్లకే అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, జిల్లాలోని పూర్తిస్థాయి ధాన్యాన్ని సేకరిస్తామని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ సన్యాసయ్య, అడిషనల్ ఫీడ్ చంద్రశేఖర్, మద్దిరాల ఎంపిడిఓ సత్యనారాయణరెడ్డి, నూతనకల్ ఎంపిడి సునీత పాల్గొన్నారు.

## నలుగురు చైన్ స్నాచర్స్ అరెస్ట్... రిమాండ్

బంగారు గొలుసు, మూడు మోటార్ సైకిల్స్, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం

డిఎస్‌పి రాజశేఖర్‌రాజు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామానికి చెందిన వృద్ధురాలు మెడలో బంగారు గొలుసులు దొంగలించడంతోపాటు మూడు మోటార్ సైకిల్స్ అపహరించిన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం వేపల సింగారం గ్రామానికి చెందిన సూరోజు భార్గవచారి, దండగల వినోద్‌కుమార్, శివనాగ మల్లిఖార్జునరావుతోపాటు హుజూర్‌నగర్ మండలం మిట్టగూడెంకు చెందిన పటాన్ అష్రాఫ్‌లు తమ జల్సాలకు పలు దొంగతనాలకు పాల్పడే వారన్నారు. ఈ క్రమంలో జప్తివీరప్పగూడెంలో ఒక నెల రోజుల పాటు రెక్కి నిర్వహించి ఒంటరిగా ఉంటున్న వృద్ధ మహిళ లక్ష్మమ్మను ఎంచుకోని పథకం ప్రకారం ఏప్రిల్ 28న జప్తివీరప్పగూడెం గ్రామానికి నలుగురు మోటార్ సైకిల్స్‌పై వచ్చి దండగల వినోద్‌కుమార్, శివనాగమల్లిఖార్జునరావులు ఊరి చివరి కాపలాగా ఉండగా మరో ఇద్దరు భార్గవచారి, అష్రఫ్‌లు లక్ష్మమ్మ తన ఇంటిలో నడిపే కిరాణం షాపు వద్దకు వచ్చి ఆమె షాపులో మద్యం తాగి రూ.500 నోటును ఇవ్వగా చిల్లర కోసం లక్ష్మమ్మ ఇంట్లో వెళ్లగా ఆమె వెనకాలే వెళ్లిన భార్గవచారి, అష్రాఫ్‌లు ఆమె మెడలోని బంగారు పుస్తలతాడు గుంజుకోని పారిపోయి ఊరి చివరి ఆగి ఉన్న తన తోటి వ్యక్తులతో కలిసి బైక్‌లపై పారిపోయారు. అంతకుముందు మార్చి 21న భార్గవచారి, అష్రఫ్‌లను వినోద్‌కుమార్ తన గ్రామం అయిన జప్తివీరప్పగూడెంలోని బంధువుల దిన కార్యక్రమాలకు రమ్మని ఆహ్వానించాడు. మోటార్‌సైకిల్‌పై సదరు వ్యక్తులు వస్తున్న క్రమంలో మార్గమధ్యలో గుంపుల సైదులు అనే వ్యక్తి గ్రామ వివారులో తన మోటార్ సైకిల్‌ను రోడ్డు పక్కన నిలిపి కల్లు గీయడానికి వెళ్లాడు. ఇది గమనించిన వారు మోటార్ సైకిల్‌ను ఎత్తుకోని పారిపోయారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేర్వేరుగా కేసులను నమోదు చేసుకోని విచారణ చేపట్టగా గురువారం దొంగలించిన సొమ్మును అమ్ముకోవడానికి మిర్యాలగూడకు వస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బంది ఆలగడప టోల్‌గేట్ వద్ద నలుగురు వ్యక్తులను పట్టుకోని విచారించగా అసలు నేరాన్ని అంగీకరించారన్నారు. వారి వద్ద నుంచి బంగారు పుస్తెలతాడు, మూడు మోటార్ సైకిల్స్, ఐదు సెల్‌ఫోన్లను స్వాదీనం చేసుకోని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాల మేరకు నేర విచారణ చేయగా కేసును త్వరితగతిన ఛేదించినందుకు రూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్యతోపాటు సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించినట్లు తెలిపారు.

## కౌమార దశలో ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలి




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : కౌమార దశలో ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో అనేక వ్యాధులను నివారించవచ్చని నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 15 నుండి18 సంవత్సరాల వయస్సు గల కౌమార బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక ఆరోగ్య స్క్రీనింగ్ శిబిరాన్ని గురువారం పానగల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నిర్వహించారు.ఈశిబిరంలో రక్తహీనత,మధుమేహం బి ఎం ఐ పరీక్షలతో పాటు నెలసరి పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా కౌమార దశలో బాలికలు ఎదుర్కొనే శారీరక, మానసిక, పోషకాహార సంబంధిత సమస్యలపై వైద్య నిపుణులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బాలికల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. కౌమార దశలో ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో అనేక వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ బి.శరత్ చంద్ర మాట్లాడుతూ 15 నుండి18 సంవత్సరాల వయస్సు గల బాలికలలో హార్మోన్ల మార్పుల కారణంగా శారీరక, మానసిక సమస్యలు సాధారణమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నల్లగొండ పిఎసిఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు,కార్పొరేటర్లు పేర్ల మల్లేశ్వరి, ఆలకుంట్ల ఝాన్సీ,మెప్మా టీఎంసీ శ్రీనివాస్, సిఓలు అనిల్ కుమార్,జ్యోతి,రాజా,నరసింహ,ఏఎన్‌ఎంలు,ఆశ వర్కర్లు,ఆర్‌పీలు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి

డబుల్ బెడ్రూమ్ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్



ప్రజాపక్షం/బీబీనగర్ : మండలంలోని కొండమడుగు, బీబీనగర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం సందర్శించి ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న 30 ఇళ్లకు విద్యుత్తు, త్రాగునీటి, రోడ్డు నిర్మాణ సౌకర్యాలు వెంటనే కల్పించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధన మేరకు అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తామని త్వరలోనే పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ అలివేలు. తాసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి. హౌసింగ్ డిఇ రామ్ సునీల్, ట్రాన్స్కో ఏడిఇ మచ్చేందర్, ఏఈ మనోహర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ గీత, వివిధ గ్రామాల సర్పంచులు పంజాల శ్రీనివాస్ గౌడ్, కడెం పాండు రంగం, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సెల్ టవర్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : జనావాసాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న సెల్ టవర్ పనులను గురువారం మండల కేంద్రంలో గ్రామస్తులు అడ్డుకున్నారు. నిబంధనలను పక్కనబెట్టి ప్రజల ఇండ్ల మధ్య టవర్ నిర్మించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిర్మాణ పనులను సాగనివ్వకుండా నిలిపివేశారు. సమాచారం అందుకున్న స్థానిక సర్పంచ్ ఒగ్గు రవి, పంచాయితీ కార్యదర్శి నాగరాజులు సంఘటనా స్థలానికి చేరుకొని సెల్ టవర్ నిర్మాణ కాంట్రాక్టర్‌తో మాట్లాడి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాంట్రాక్టర్ వినకపోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఎంపిఓ రాజేశ్వర్ అక్కడికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి ప్రజల వినతిని, అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, దీనిపై నిర్ణయం తీసుకునేందుకు వారం రోజులు గడువు కావాలని కోరారు. ఉన్నతాధికారుల నుండి నివేదిక, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు సెల్ టవర్ నిర్మాణం పనులను నిలిపివేయాలని సూచించడంతో గ్రామస్తులు శాంతించారు.

## అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

ప్రజాపక్షం/గరిడేపల్లి: మండలంలో తీవ్రంగా ఎండలు వడగాల్పులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావద్దు అని ఆయన తెలిపారు. తగినంత నీరు తాగుతూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, చిన్న పిల్లలు, వృద్ధులు ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు.


## పాటను పదునైన బాణంగా మలిచింది ప్రజా నాట్యమండలి

తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్

ప్రజాపక్షం/నేరేడుచర్ల: పాటను పదునైన బాణంగా మలిచింది ప్రజా నాట్యమండలి అని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా ప్రజానాట్య మండలి 4వ మహాసభ నేరేడుచర్ల పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా చైతన్యానికి, సామాజికమార్పుకు కళ ఒక ఆయుధం లాంటిదని, మనిషి పుట్టిన దగ్గర నుంచి మరణించేంత వరకు కళ ప్రతి మనిషి జీవితంలో అంతర్భాగంగా ఉంటుందన్నారు. పుట్టగానే జోలపాటతో మొదలుకొని చనిపోయిన తర్వాత అంతిమయాత్రలో సైతం పాటలతోనే దహనం చేస్తారన్నారు. అంతే కాకుండా పని పాటతో అనే పదం పుట్టుకొచ్చిందని పాటతో పాటు పని పనితో పాటే మనిషీ జీవితంతో పెనవేసుకుపోయాయన్నారు. ప్రజా ఉద్యమాల విజయవంతంలో పాట పాత్ర మహోన్నతమైనదని, కళారంగంలో పెడదోరణలు వస్తే సమాజం బీటలు వారి పోతుందన్నారు. కళ అనేది రెండంచుల కత్తి లాంటిదని సమాజ హితానికి మాత్రమే కళలను ఉపయోగించాలన్నారు. నేడు సినిమాల్లో వస్తున్న అసాంఘిక దృశ్యాల వల్ల యువత చెడుబాట పడుతుందని, గంజాయి మత్తు పదార్థాలు వంటి వాటికి బానిసలు అవుతున్నారని అన్నారు. ఈ మహసభకు దొంతగాని సత్యనారాయణ అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, దూళిపాళ ధనుంజయనాయుడు, యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, దేవరం మల్లేశ్వరి, బూర వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసరెడ్డి, దొడ్డా వెంకటయ్య, రావుల సత్యం, కొండా కోటయ్య, దంతాల రాంబాబు, అమరరాపు పున్నయ్య, గోపనబోయిన వెంకటేశ్వర్లు, పిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.




## ప్రజా కళా ఉద్యమాల బలోపేతమే లక్ష్యం





ప్రజాపక్షం/ఆలేరు : ఆలేరు పట్టణ కేంద్రంలో జరిగిన తెలంగాణ ప్రజా నాట్యమండలి జిల్లా మూడో మహాసభలకు కళాకారులు ప్రజాసంఘాల నాయకులు సాంస్కృతిక కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. మహాసభలను విప్లవ గీతాలు డప్పుల నృత్యాలు జానపద కళారూపాలతో ప్రారంభించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను కళారూపాల ద్వారా సమాజం ముందుకు తీసుకురావడంలో ప్రజానాట్యమండలి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సామాజిక అసమానతలు రైతు కూలీల సమస్యలు కార్మిక వర్గ పోరాటాలు ప్రజాస్వామ్య హక్కులు పరిరక్షణ కోసం కళాకారుల ముందు ఉండాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న మతవిద్వేషాలు ,కార్పొరేట్ సంస్కృతి, ప్రజా కలలపై జరుగుతున్న దాడులను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ కళలకు పునర్జీవం పోసి యువతను ప్రజాకళ ఉద్యమాల వైపు తీసుకురావాలని తీర్మానించారు. మహాసభల్లో గత కమిటీ సమీక్ష నిర్వహించి రాబోయే కాలానికి కార్యచరణ ప్రణాళికను ఆమోదించారు. జిల్లాలో ప్రతి మండలంలో ప్రజా కళా బృందాలను ఏర్పాటు చేసి సామాజిక చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా కలకొండ సంజీవ, జిల్లా అధ్యక్షుడిగా బుసి పాక నరసింహ, ఉపాధ్యక్షులుగా పోతు ప్రవీణ్, ఇంజ హేమలత, మనోహర, ప్రధాన కార్యదర్శిగా చెక్క వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా కట్ల యాదగిరి, సోమ నరసయ్య, కందుకూరి వెంకన్న, కోశాధికారిగా పోచయ్య 31 మందితో కూడిన నూతన కమిటీని సభలో పాల్గొన్న ప్రతినిధులు ఘనంగా అభినందనలు తెలిపారు. ప్రజల బాటలోనే ప్రజా కళా ఉద్యమం కొనసాగుతుందని అణగారిన వర్గాల గొంతుకగా తెలంగాణ ప్రజానాట్యమండలి నిలుస్తుందని నూతన కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఈనెల 25 26 తేదీలలో హైదరాబాదులో జరిగే తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర నాలుగో మహాసభలకు ఎంపిక చేసిన ప్రతినిధులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

## ‘ఉపాధి’ని సద్వినియోగం చేసుకోవాలి

ఎంపిడిఒ రాధరాణి...



**ప్రజాపక్షం/యాచారం :** ఉపాధి పనిని కూలీలందరు సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి రాధరాణి అన్నారు. గురువారం మండల పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామంలో ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని అడిగిన ప్రతి కూలీకి పని చూపించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఉపాధి కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లను, మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. కూలీలకు ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దెంది రాంరెడ్డి, పంచాయతి కార్యదర్శి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## మేలైన సాగు విధానాలతోనే అధిక దిగుబడులు సాధించాలి



**ప్రజాపక్షం/కేశంపేట:** మేలైన సాగు విధానాలతోనే పంటల దిగుబడి అధికంగా పెరుగుతుందని వ్యవసాయ శాస్త్ర వేత్తలు వివరించారు. గురువారం కేశంపేట మండల పరిధిలోని అల్వాల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుసదస్సులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ దామోదర్ రాజు హాజరయ్యారు. కార్యక్రమంలో డిస్కం ఇన్‌చార్జి ఇందిర ప్రియా, అల్వాల సర్పంచ్ సురేష్‌రెడ్డి, ఉప సర్పంచ్ సూరు మల్లేష్, మండల వ్యవసాయ అధికారి రామశివరావు, అధికారులు వినయ్, నిఖిల్‌రెడ్డి, ప్రశాంత్, సుధ, సమీన, రాజేశ్వరీ, సర్పంచ్‌లు వేణుగోపాల్ పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో డివిజన్‌లోని ఆరు మండలాల్లో ఉన్న వివిధ గ్రామాల ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్కులను గురువారం లబ్దిదారులకు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నడికుడ అనిత రఘునాథ్ యాదవ్, బిఎస్ సుధీర్, ఈశ్వర్‌రాజు, కాట్న రవీందర్, ప్రశాంత్‌రెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, శ్రీశైలం యాదవ్, ఉపసర్పంచులు సత్తయ్య, సిద్దయ్య పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** సెంట్రింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం షాద్‌నగర్ ఆర్‌డిఒ సరితకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సెంట్రింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నడికూడ ఆంజనేయులు, నర్సింహులు, రమేష్‌నాయక్, భాస్కర్, రాము, శ్రీను పాల్గొన్నారు.

## గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పరిశీలన..

టిజిఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ శశాంక్



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టబోతున్న గ్రీన్ ఫార్మాసిటి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు స్థలాన్ని గురువారం టిజిఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ శశాంక్ అధికారులతో కలిసి పరిశీలించారు. మూడు ఎకరాల స్థలంలో పోలీస్ స్టేషన్ నిర్మాణం అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేయనున్నారు. పక్క నుండి గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేస్తున్న నేపథ్యంలో పోలీస్ స్టేషన్ నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు..కార్యక్రమంలో అర్డిఒ అనంతరెడ్డి, ఎసిపి రాజు, తహసీల్దారు అయ్యప్ప, గ్రీన్ ఫార్మాసిటి పోలీస్ స్టేసన్ సిఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

## పదవులు తీసుకొని ఉత్సవ విగ్రహాల్లా ఉంటే ప్రయోజనం ఏమిటీ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పదవులు తీసుకుని ఉత్సవ విగ్రహాల్లా ఉంటే ప్రయోజనం ఏమిటని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని గ్రేడ్..1శాఖ గ్రంథాలయం ఆవరణలో ఆర్యవైశ్య సీనియర్ నాయకులు, జర్నలిస్టు సరాపు రమేష్ అనంతలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. గ్రేడ్..1శాఖ గ్రంథాలయం చైర్మన్ మధన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ నాయకులు పదవులు తీసుకోవడంలో చూపిస్తున్న శ్రద్ధ పనులపై ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. కౌన్సిలర్ రఘునాథ్ యాదవ్, క్యాసెట్ శ్రీనివాస్, నక్క బాల్‌రాజ్, వీరేష్‌కుమార్ పాల్గొన్నారు.

# జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్ సమస్య పరిష్కరించరా?

### టౌన్‌హాల్ సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం

### సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దశాబ్దాలుగా స్థానిక ప్రజలను వేధిస్తున్న జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యపై అటు ప్రభుత్వం, ఇటు ప్రజాప్రతినిధులు తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) పరిధిలోని సమస్యలపై నాగోల్‌లోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో గురువారం ఒక టౌన్‌హాల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంఎంసి కమిషనర్ టి.వినయ్‌కృష్ణ రెడ్డి అధ్యక్షత వహించారు. ప్రజాప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎంఎంసి పరిధిలోని వివిధ నియోజకవర్గాలలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వివరించారు. సమావేశంలో ఎంపి ఈటల రాజేందర్, ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినందుకు ప్రజాప్రతినిధులందరూ సిఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు.

### డంపింగ్‌యార్డు సమస్య పరిష్కారానికి ఆదేశించిన సిఎం : కమిషనర్

డంపింగ్ యార్డు సమస్యను తక్షణమే పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసినట్లు కమిషనర్ వినయ్‌కృష్ణా రెడ్డి తెలిపారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యతో పాటు కార్పొరేషన్ పరిధిలోని ఇతర సమస్యలను కూడా గుర్తించామన్నారు. ముఖ్యంగా డంపింగ్ యార్డు అంశం అత్యంత కీలకంగా మారిందన్నారు. శుక్రవారం ప్రజాప్రతినిధులతో కలిసి డంపింగ్ యార్డును సందర్శించి పరిస్థితిని పరిశీలించనున్నట్లు తెలిపారు. డంపింగ్ యార్డు నిర్వహణలో ఉన్న రాంకీ సంస్థతో సమన్వయం చేసుకొని, ఒప్పందంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తామని కమిషనర్ చెప్పారు. నగరంలో ఉత్పత్తి అవుతున్న చెత్తను వికేంద్రీకరించాల్సిన అవసరం ఉందన్నారు. నగరానికి నాలుగు వైపులా కొత్త డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఇందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని వినయ్ కృష్ణా రెడ్డి కోరారు.

### రాంకీ సంస్థ నిర్లక్ష్యంపై ప్రజాప్రతినిధుల ధ్వజం

సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు జవహర్ నగర్ డంపింగ్ యార్డు వల్ల స్థానికులు ఎదుర్కొంటున్న నరక ప్రాయమైన పరిస్థితులను వివరిస్తూ అధికారులపై, నిర్వహణ సంస్థ రాంకీపై మండిపడ్డారు. ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ జవహర్ నగర్ భారాన్ని తగ్గించేందుకు నాగరం పరిసర ప్రాంతాల్లో చిన్న చిన్న డంపింగ్ యార్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రేవంత్ రెడ్డి ఎంపిగా ఉన్న సమయం నుంచే ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాంకీ సంస్థ నిర్వహణ లోపాల వల్ల భూగర్భ జలాలు విషతుల్యమవుతున్నాయని, స్థానిక ప్రజలు జెఎసి ఏర్పాటు చేసి ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. రోడ్ల పరిస్థితి కూడా దయనీయంగా ఉందన్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ మూడు కార్పొరేషన్ల చెత్తను ఒకే చోట వేయడం వల్ల కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జవహర్ నగర్ వాసులకు ఆస్తి పన్ను రద్దు చేయాలని, ఉచిత తాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఎస్ఆర్ కింద రూ.35 కోట్లు ఖర్చు చేస్తామన్న రాంకీ సంస్థ స్థానికులకు రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ డంపింగ్‌యార్డు కాలుష్యం వల్ల స్థానిక మహిళలకు అబార్షన్లు అవుతున్నాయని దిగ్భ్రాంతికర విషయాన్ని వెల్లడించారు. అలాగే నగరంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు ఆపరేషన్లు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ డంపింగ్ యార్డు కాలుష్యంతో చెరువుల్లో చేపలు కూడా చనిపోతున్నాయని, దుర్వాసన సైనిక్‌పూరి వరకు వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి పెరిగిందని ఆరోపించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ డంపింగ్ యార్డు తాగునీటి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. ప్రజలకు ప్రాథమిక సదుపాయాలు అందించడం ప్రభుత్వ బాధ్యతని, ప్రాంతీయ సమస్యల పరిష్కారానికి తగిన బడ్జెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం రాబోతున్న నేపథ్యంలో వరద ముప్పు తప్పేలా మహేశ్వరం, ఎల్.బి.నగర్ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న ఎస్ఎన్‌డిపి నాలా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి కోరారు. మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద డంపింగ్ యార్డు ఇక్కడ ఉండటం వల్ల లక్షలాది మంది ప్రజల ప్రాణాలు సంకటంలో పడ్డాయని, రాంకీ సంస్థకు మాత్రం లాభాలు వస్తున్నాయని విమర్శించారు. గతంలో ఉచిత నీరు ఇస్తామని చెప్పి ఇప్పుడు అమలు చేయడం లేదని సమావేశంలో ప్రస్తావించారు. సమావేశంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, పోలీస్ కమిషనర్ సుమతి, జోనల్ కమిషనర్లు రాధికా గుప్తా, సంచిత్ గంగ్వార్, వికాస్ మహతో, అదనపు కమిషనర్లు సి.ఎన్. రఘు ప్రసాద్, వేణు గోపాల్, చీఫ్ సిటీ ప్లానర్ బి.ప్రదీప్ కుమార్, చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా జిహెచ్‌ఎంసి అవగాహన కార్యక్రమాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘99 రోజుల కార్యాచరణ ప్రణాళిక’లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా అధికారులు, సిబ్బంది విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గోషామహల్, మల్లేపల్లి, మెట్టుగూడ ప్రాంతాలలో డిప్యూటీ కమిషనర్లు, ఎంటమలాజి సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది సంయుక్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ప్రజలు, ముఖ్యంగా యువతను భాగస్వామ్యం చేస్తూ మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై చైతన్యపరిచారు. ఆరోగ్యంగా ఉండాలి, బాధ్యతగా ఉండాలి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి అని అధికారులు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

# పకడ్బందీగా ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక

### అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** లోటుపాట్లకు తావు లేకుండా ప్రకడ్బందీగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ఆదేశించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం ఆవరణలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సభలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ,జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం ఏర్పాట్లపై గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమె మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజాపాలన కార్యక్రమాలను చక్కగా విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అదే స్ఫూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మరింత అట్టహాసంగా నిర్వహించేలా కృషి చేయాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పోటోలు, ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితాలను, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించేందుకు వీలుగా సమగ్ర వివరాలతో నివేదికలను అందించాలని ఆదేశించారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సాధించిన పురోగతిని సమగ్రంగా ప్రదర్శించేలా నివేదికలు ఉండాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి స్టాళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, శాఖల వారీగా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి అధికారులకు సూచించారు.

## సైబర్ నేరాల నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంచాలి

### ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి

**ప్రజాపక్షం/కొందుర్గు:** సైబర్ నేరాల నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి సూచించారు. గురువారం కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ పోలీస్ స్టేషన్లను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, షాద్‌నగర్ డిసిపి శిరీష, ఏసిపి లక్ష్మీ నారాయణ, సిఐ శ్రీనివాస్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించడంతోపాటు 100డైల్ కేసులపై ఎలా స్పందిస్తున్నారనే విషయాలను స్థానిక పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు దారుల పట్ల పోలీసులు తక్షణమే స్పందించి చట్ట పరమైన కేసులు నమోదు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. విధి నిర్వహణలో పోలీసులు నిజాయితీగా పని చేయాలన్నారు. ఈతనిఖీల్లో కొందుర్గు ఎస్ఐ రవీందర్ నాయక్, జిల్లేడు చౌదరిగూడ ఎస్ఐ విజయ్, ఏఎస్ఐ తుల్జానాయక్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనయ్యలు ఉన్నారు.



## వినోదమందించడమే లక్ష్యం

### డిష్ టివి ఇండియా చీఫ్ అధికారి సుఖ్‌ప్రీత్ సింగ్




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** దక్షిణ భారతీయ కుటుంబాల కోసం అందుబాటు ధరల్లో ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యతతో, అంతరాయం లేని వినోద అందించడమే లక్ష్యమని డిష్ టీవీ ఇండియా లిమిటెడ్ చీఫ్ రెవెన్యూ అధికారి సుఖ్‌ప్రీత్ సింగ్ తెలిపారు. మాదాపూర్‌లోని కోహినూర్ హోటల్‌లో డిష్ టీవీ ని లాంచ్ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిష్ టీవీ ఇండియా లిమిటెడ్ చీఫ్ రెవెన్యూ అధికారి సుఖ్‌ప్రీత్ సింగ్, డిష్ టీవీ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోజ్ ధబోల్, డిష్ టీవీ మార్కెటింగ్ హెడ్ అంకుష్ నాగ్‌రాన్, తెలంగాణ, ఆంధ్రా డిష్ టీవీ జోనల్ సేల్స్ హెడ్ శ్యామ్ పోతుల లు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో అత్యంత చురుకైన, సాంస్కృతిక వైవిధ్యంతో కూడిన వినోద మార్కట్లలో ఒకటైన డిష్ టీవీ దక్షిణ భారతదేశంపై తమ నిబద్ధతను మరింత బలోపితం చేస్తూ డిష్ టీవీ ప్రాంతీయ భాష అభిరుచులు, సరసమైన వినోదాలను నెలకు 149 రూపాయలతో 190 చానళ్ళు ప్రసారం అందించడానికి ముందుకు వచ్చిందని ఇది దక్షిణాది ప్రజలకు చక్కని అవకాశమని తెలిపారు.

## గచ్చిబౌలిలో ఐసాల్వ్‌డ్ ఇండియా నూతన సాఫ్ట్‌వేర్ సంస్థ ఏర్పాటు

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** ఐసాల్వ్‌డ్ ఇండియా సాఫ్ట్‌వేర్ సంస్థ తమ కార్యకలాపాలను విస్తరించడానికి హైద్రాబాద్‌లోని గచ్చిబౌలిలో నూతన కార్యలయాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసాల్వ్డ్ చీఫ్ అపరేటింగ్ అధికారి ప్రగ్యా గుప్త, ఐసాల్వ్‌డ్ చీఫ్ పీపుల్ అధికారి అమీ మోషర్, ఐసాల్వ్డ్ ఇండియా జనరల్ మేనేజర్ యోగేష మోర్‌లు విచ్చేసి నూతన కార్యలయాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐసాల్వ్‌డ్ సంస్థ ఇంజనీరింగ్, ఏఐ విభాగాలలో అభివృద్ధి చేయాడానికి భారతదేశంలో ఇప్పటికే తమ కార్యకలాపాలను విస్తరించడంలో కీలక ముందడుగుగా హైద్రాబాద్ వేదికగా తమ కార్యకలాపాలను విస్తరించడానికి గచ్చిబౌలి చక్కని వేదిక అని తెలిపారు. తమ కార్యకలాపాలను మరింత విస్తృతం చేస్తూ ఇంజనీరింగ్, ఏఐ ఆవిష్కరణలు, ఉత్పత్తి అభివృద్ధి చేస్తూ ఇక్కడి యువతకు ఉద్యోగ అవకాశాలను అందిస్తున్నామన్నారు. ఏకీకృత క్లౌడ్, ప్లాట్‌ఫామ్‌ను ముందుకు తీసుకెళ్ళడం, ఇంజనీరింగ్ ప్రాడక్ట్, ఏఐ ఆదారిత సామర్థ్యాలు, ప్లాట్ ఫామ్ డెలివరీ విభాగాలలో అభివృద్ధి చెందే విధంగా పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు.



# సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసిన మహోన్నతవ్యక్తి

### రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమంలో టియుఎఫ్ఎస్ఐడిసి చైర్మన్ నర్సింహారెడ్డి





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** దేశంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసిన మహోన్నత వ్యక్తి, మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ అని తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్(టియుఎఫ్ఐడిసి) చైర్మన్,రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి కొనియాడారు. గురువారం రాజీవ్ గాంధీ వర్ధంతి సభను రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో మందమల్లమ్మ చౌరస్తాలోని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ సాంకేతిక రంగాన్ని భారతదేశానికి పరిచయం చేసిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని, ఆధునిక భావాలు, నిర్ణయాత్మక శక్తి కలిగిన రాజీవ్ గాంధీ దేశప్రజల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధలా దశరథ్, సిద్ధలా శ్రీశైలం, వెంకటేశ్వర్‌గౌడ్, విజేందర్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బి.రోహిత్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, గంగమ్మ, వై.అరుణదేవి, కె.పద్మశ్రీ, సిదేశ్వర్ చారి, ఆలే శ్రీనివాస్ శేఖర్‌రెడ్డి, సుభాష్ రెడ్డి, మురళి గౌడ్, పరశురాం, సైదులు, ఓంప్రకాష్, అలా శ్రీనివాస్‌రెడ్డి, కె.సుధాకర్, రాజేందర్ కమల్‌నెహ్రూ పాల్గొన్నారు.

**యాచారం :** యాచారం మండల కేంద్రంలో గురువారం రాజీవ్‌గాంధి వర్ధింతిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం అధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాజు, చైతన్య, మంగ, నరంధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మస్కు నర్సింహ్మా, టులాం అక్బర్, యువజన విభాగం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, మండల యూత్ అధ్యక్షులు జయప్రకాశ్, మధర్ డైరి డైరెక్టర్ జంగయ్య, పాండురంగారెడ్డి, విష్ణు, ఉపసర్పంచ్‌లు మదుకర్‌రెడ్డి, శ్రీకాంత్, బన్నె జంగయ్య, బెత జంగయ్య, సంగెం మల్లేశ్, కలకోండ మల్లేశ్, ఎరుకలి చింటు తదితరులు పాల్గొన్నారు.

### దేశానికి సాంకేతిక రంగాన్ని తీసుకువచ్చిన ఘనత రాజీవ్‌గాంధీదే

**షాద్‌నగర్:** దేశానికి సాంకేతిక రంగాన్ని తీసుకువచ్చిన ఘనత రాజీవ్‌గాంధీదేనని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం షాద్‌నగర్‌లో రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, నేతలు దామోదర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, కౌన్సిలర్లు రాజునాయక్, మురళీమోహన్, పెంటయ్య, దిలీప్‌కుమార్, కాంగ్రెస్‌నేతలు దంగు శ్రీనివాస్, ఇబ్రహీం, జితేందర్‌రెడ్డి, అగీరు రవికుమార్ గుప్తా, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ ఆన్‌లైన్ ఔషధ అమ్మకాలపై

# ప్రధాని జోక్యం చేసుకోవాలి

● దేశ వ్యాప్తంగా ఔషధ వ్యాపారుల సమ్మె ● సమ్మె విజయవంతమైందని ఎఐఒసిడి ప్రకటన



**న్యూఢిల్లీ:** ఔషధ దుకాణదారులు, వ్యాపారులు బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సమ్మె మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. భారతదేశ వ్యాప్తంగా చట్టవిరుద్ధంగా, అనియంత్రితంగా జరుగుతున్న మందుల ఆన్‌లైన్ అమ్మకాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలన్న డిమాండ్లపై 12 లక్షలకు పైగా సభ్యులున్న ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఎఐఒసిడి) సమ్మెకు పిలుపునిచ్చింది. రోగుల భద్రత, నియంత్రణ ఉల్లంఘనలు, చిన్న లైసెన్స్ పొందిన రిటైలర్ల మనుగడపై ఆందోళన వ్యక్తం చేసింది. చట్టవిరుద్ధంగా, అనియంత్రితంగా జరుగుతున్న మందుల ఆన్‌లైన్ అమ్మకాలకు, సరైన ప్రిస్క్రిప్షన్లు లేకుండా మందుల అమ్మకానికి, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు అనుసరిస్తున్న దోపిడీపూరిత భారీ డిస్కౌంట్ల పద్ధతులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఒకరోజు టోకెన్ సమ్మెను పాటించారు. ఈ సమ్మె విజయవంతం అయిందని ఎఐఒసిడి సంఘం అభివర్ణించింది. అయితే, పలు రాష్ట్ర స్థాయి రిటైల్ ఫార్మసీ సంఘాలు ఇందులో పాల్గొనకుండా తమ దుకాణాలను తెరిచే ఉంచాయని, అందువల్ల మందుల లభ్యతకు ఎలాంటి అంతరాయం కలగలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విచ్చలవిడిగా, చట్టవిరుద్ధంగా ఆన్‌లైన్‌లో మందులు అమ్ముతున్నారనే ఆరోపణలపై దీర్ఘకాలంగా ఉన్న ఆందోళనలకు ప్రతిస్పందనగా, సరైన సమాచారం, బహిరంగ నోటీసు ఇచ్చిన తర్వాత భారతదేశవ్యాప్తంగా 12.40 లక్షలకు పైగా కెమిస్టులు, డ్రగ్గిస్టులు సమ్మెలో పాల్గొన్నారని ఎఐఒసిడి తన మెమోరాండంలో పేర్కొంది. లైసెన్స్ పొందిన కెమిస్టులు, ఆరోగ్య సంరక్షణ భాగస్వాములలో పెరుగుతున్న అసంతృప్తిని ప్రతిబింబిస్తూ, సభ్యులు, అన్ని రాష్ట్ర, జిల్లా కెమిస్టులు, డ్రగ్గిస్ట్ సంఘాలు ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానం మేరకు ఈ సమ్మె శాంతియుతంగా జరిగిందని వారు తెలిపారు. అదుపులేని, నియంత్రణ లేని ఆన్‌లైన్ మందుల అమ్మకాలు, నకిలీ, ధృవీకరించలేని ఇ–ప్రిస్క్రిప్షన్‌ల చలామణి, సరైన వైద్య సంప్రదింపులు లేకుండా ఇంటికే మందుల డెలివరీ, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు అవలంబిస్తున్న దోపిడీపూరిత భారీ డిస్కౌంట్ల పద్ధతులు దేశంలో ప్రమాదకరమైన, ఆందోళనకరమైన పరిస్థితిని సృష్టించాయి అని ఎఐఒసిడి అధ్యక్షుడు జెఎస్ షిండే, ప్రధాన కార్యదర్శి రాజీవ్ సింఘాల్ రాసిన లేఖలో పేర్కొన్నారు. 'ఈ పద్ధతులు కోట్లాది మంది అమాయక రోగుల ఆరోగ్య, భద్రతకే కాకుండా, దశాబ్దాలుగా అంకిత భావంతో, బాధ్యతతో సమాజ ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీరుస్తున్న లక్షలాది మంది లైసెన్స్ పొందిన కెమిస్టులు, డ్రగ్గిస్టుల జీవనోపాధికి, మనుగడకు కూడా తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయని అని వారు అన్నారు. చెల్లుబాటు అయ్యే, ధృవీకరించబడిన, చట్టబద్ధంగా ఆమోదించబడిన ప్రిస్క్రిప్షన్లు లేకుండా మందుల అమ్మకం, హోమ్ డెలివరీపై పూర్తి నిషేధం విధించాలని, అలాగే ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, కార్పొరేట్ సంస్థలు అనుసరిస్తున్న దోపిడీ ధరల విధానం, అనైతిక భారీ డిస్కౌంట్ల పద్ధతులపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా ఆ సంఘం డిమాండ్ చేసింది. '1940 నాటి డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం, 1945 నాటి నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను అనుమతించే స్పష్టమైన, చట్టపరమైన నిబంధనలు ఏవీ లేవని ఇక్కడ ప్రస్తావించడం సముచితం. అయినప్పటికీ, అనేక ఆన్‌లైన్ సంస్థలు చాలా సంవత్సరాలుగా చట్టాన్ని బరితెగించి ఉల్లంఘిస్తూ తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి' అని వారు అన్నారు. ఈ తీవ్రమైన ఉల్లంఘనలు, అవకతవకలను డాక్యుమెంటరీ ఆధారాలతో సహా సంబంధిత మంత్రిత్వ శాఖలు, అధికారుల దృష్టికి పదేపదే తీసుకురావడం జరిగిందని, అయినప్పటికీ, అనేక చట్టవిరుద్ధ కార్యకలాపాలను అంగీకరించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి ప్రభావవంతమైన, స్పష్టమైన చర్యలు ప్రారంభించలేదని అని ఆ విజ్ఞప్తిలో పేర్కొన్నారు. ఎఐఒసిడి, వివిధ రాష్ట్ర సంఘాలు ఇచ్చిన పిలుపునకు స్పందిస్తూ, దేశవ్యాప్తంగా జిల్లాల వ్యాప్తంగా ఉన్న కెమిస్టులు, డ్రగ్గిస్టులు తమ సంస్థలను మూసివేసి, ఈ ఉద్యమానికి ఏకగ్రీవ మద్దతు తెలిపారని ఆ సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది.

## రాజీవ్‌గాంధీకి యావత్ దేశం నివాళి



**న్యూఢిల్లీ :** మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం యావత్ దేశం ఆయనను స్మరించుకుంది. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడింది. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేలు రాజీవ్‌గాంధీకి ఘన నివాళి అర్పించారు. దేశ ప్రగతి కోసం ఆయన చేపట్టిన వివిధ కార్యక్రమాలను వారు గుర్తుచేసుకున్నారు. గాంధీ కుటుంబ సభ్యులతో పాటు, పలువురు మాజీ ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు ఢిల్లీలోని వీరభూమిలో ఉన్న రాజీవ్‌గాంధీ స్మారక చిహ్నం వద్ద ఆయనకు నివాళులర్పించారు. తన తండ్రి బోధనలు, విలువలు ఎల్లప్పుడూ తనతోనే ఉంటాయని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. 'నాన్నా, మీరు ఊహించిన నైపుణ్యం గల, సుసంపన్నమైన, బలమైన భారత దేశ కలను సాకారం చేసే బాధ్యతను నేను పూర్తిగా భుజాలపై మోస్తాను' అని రాహుల్ గాంధీ ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. మీ బోధనలు, మీ విలువలు, మీ జ్ఞాపకాలు ఎల్లప్పుడూ నాతోనే ఉంటాయన్నారు. మాజీ ప్రధానమంత్రికి పుష్పాంజలి ఘటించిన అనంతరం, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే రాజీవ్ గాంధీ మాటలను గుర్తుచేసుకున్నారు. భారతదేశం ఒక పురాతన దేశం, కానీ యువతను కలిగి ఉందన్నారు. మానవాళి సేవలో బలంగా, స్వతంత్రంగా, ఆత్మనిర్భరంగా, ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలిచే భారతదేశాన్ని తాను చూడాలనుకుంటున్నానన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మందిలో ఆశ, ఆకాంక్షలను ప్రేరేపించిన భారతదేశపు గొప్ప పుత్రుడు, మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీకి తాము మా ప్రగాఢ నివాళులు అర్పిస్తున్నామన్నారు. ఆయన చేపట్టిన పరివర్తనాత్మక కార్యక్రమాలలో ఓటింగ్ వయస్సును పద్దెనిమిదికి తగ్గించడం, పంచాయతీ రాజ్ ద్వారా స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేయడం, టెలికాం, సమాచార సాంకేతిక విప్లవాన్ని తీసుకురావడం, కంప్యూటరీకరణను ముందుకు తీసుకెళ్లడం, ముఖ్యమైన శాంతి ఒప్పందాలను సాధించడం, సార్వత్రిక రోగనిరోధక కార్యక్రమాన్ని ప్రారంభించడం, సమ్మిళిత అభ్యసనంపై కేంద్రీకృతమైన దూరదృష్టి గల విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడం వంటివి ఉన్నాయన్నారు. ఆయన వారసత్వం ఆధునిక భారతదేశాన్ని తీర్చిదిద్దుతూనే ఉందని, తరతరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆయన దార్శనికత వర్తమానానికే పరిమితం కాలేదు, భవిష్యత్ తరాల భారతదేశాన్ని తీర్చిదిద్దడంపై దృష్టి సారించింజదని ఖర్గే పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ స్మారక చిహ్నం వీర భూమి వద్ద కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, కె.సి. వేణుగోపాల్, మాజీ ముఖ్యమంత్రులు భూపిందర్ సింగ్ హుడా, అశోక్ గెహ్లాట్‌తో పాటు పలువురు మాజీ కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఆధునిక భారతదేశ నిర్మాతగా రాజీవ్ గాంధీని పలువురు కాంగ్రెస్ నాయకులు స్మరించుకున్నారు. రాజీవ్ గాంధీ 1944 ఆగస్టు 20న ముంబయిలో జన్మించి, 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో హత్యకు గురయ్యారు. ఆయన 1984 అక్టోబర్ 31 నుండి 1989 డిసెంబర్ 2 వరకు భారతదేశ ప్రధానమంత్రిగా పనిచేశారు.

## కొండచరియలు విరిగిపడి చిక్కుకుపోయిన యాత్రికులు

10,450 మంది యాత్రికులను రక్షించిన సంయుక్త సహాయక బృందాలు



**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్‌లో మున్‌కటియా వద్ద అకస్మాత్తుగా సంభవించిన కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో కేదార్‌నాథ్ మార్గంలో చిక్కుకుపోయిన 10,450 మంది యాత్రికులను సంయుక్త సహాయక బృందాలు సురక్షితంగా తరలించాయని అధికారులు గురువారం తెలిపారు. ఆ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా మంగళవారం అర్ధరాత్రి సోన్‌ప్రయాగ్, గౌరీకుండ్ మధ్య ఈ కొండచరియలు విరిగిపడ్డాయని, శిథిలాలు ప్రధాన రహదారిని అడ్డుకోవడంతో, పెద్ద సంఖ్యలో యాత్రికులు చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. నిరంతరంగా రాళ్లు పడటం, భారీ వర్షం, చీకటి, సవాలుతో కూడిన పర్వత ప్రాంతం చిక్కుకుపోయిన యాత్రికులకు అత్యంత క్లిష్ట పరిస్థితిని సృష్టించాయి. రుద్రప్రయాగ్ జిల్లా నియంత్రణ గది (డిసిఆర్) రాత్రి 9.16 గంటలకు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాన్ని (ఎస్‌డిఆర్‌ఎఫ్) అప్రమత్తం చేసింది. సోన్‌ప్రయాగ్ నుండి ఒక సహాయక బృందం అవసరమైన పరికరాలతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంది. ఆ తర్వాత ఎస్‌డిఆర్‌ఎఫ్, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్) సంయుక్తంగా సహాయక, రెస్క్యూ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. సంయుక్త బృందాలు ప్రభావిత ప్రాంతంలో చిక్కుకుపోయిన 10,450 మంది యాత్రికులకు మార్గనిర్దేశం చేశాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం, తక్కువ దృశ్యమానత ఉన్నప్పటికీ సహాయక సిబ్బంది యాత్రికులను ఉత్సాహపరిచారు. యాత్రికులను సహాయక బృందాలు నిర్దేశిత సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. సహాయక చర్యలు పూర్తి చేసిన తర్వాత, పేరుకుపోయిన శిథిలాలను తొలగించడానికి అధికారులు జెసిబి యంత్రాలను మోహరించారు. కొద్దిసేపటికే అధికారులు హైవేను పునరుద్ధరించి, సాధారణ వాహనాల రాకపోకలను పునఃప్రారంభించారు. యాత్ర మార్గంలో మోహరించిన బృందాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని ఎస్‌డిఆర్‌ఎఫ్ కమాండెంట్ అర్పన్ యదువంశీ తెలిపారు. ఈ ముందస్తు మోహరింపు త్వరిత ప్రతిస్పందనకు, సమర్థవంతమైన సమన్వయానికి దోహదపడిందని యదువంశీ తెలిపారు. కార్మికులు శిథిలాలను తొలగించడంతో అడ్డంకి తొలగిపోయిందని, చిక్కుకుపోయిన వాహనాలు ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లాయని ఆ అధికారి తెలిపారు.

'జ్ఞానేష్'తో ఎన్నికలు నెట్టుకొస్తున్న ప్రధాని మోదీకి...

## ఆర్థిక వ్యవస్థపై 'కొత్త జ్ఞానం' అవసరం

కాంగ్రెస్ ఎద్దేవా



**న్యూఢిల్లీ :** ఆర్థిక వ్యవస్థ స్థితిపై కాంగ్రెస్ గురువారం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'జ్ఞానేష్'తో ఎన్నికలు నెట్టుకొస్తున్నారు' అని, కానీ ఆర్థిక వ్యవస్థపై ఆయనకు 'కొత్త జ్ఞానం' అవసరమని ఆరోపించింది. భారత ఆర్థిక వ్యవస్థ సెంటిమెంట్ ఎంతగా దిగజారిందంటే, మోదీ ప్రభుత్వానికి వృత్తిపరమైన మద్దతుదారులు కూడా తమ ఆందోళనలను బహిరంగంగా వ్యక్తం చేయడం ప్రారంభించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరామ్ రమేశ్ అన్నారు.' ద్రవ్యోల్బణం అంచనాలు తీవ్రంగా పెరుగుతుండగా, వృద్ధి అంచనాలు గణనీయంగా తగ్గాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) నిరవధికంగా క్షీణిస్తూనే ఉన్నాయి. సప్లయ్‌చైన్‌లను ఎంత దారుణంగా నిర్వహించారంటే, వినియోగదారులు తమ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రధానమంత్రి ఇప్పుడు బహిరంగంగా కోరారు' అని జైరామ్ రమేశ్ చెప్పారు. ఈ ఆందోళనలలో కొత్తదనం ఏమీ లేదన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ దీనిపై కొంతకాలంగా గొంతుక వినిపిస్తూనే ఉందని, అయితే వీటిలో అత్యంత ముఖ్యమైనది మందకొడిగా ఉన్న పెట్టుబడి వాతావరణానికి సంబంధించినదని ఆయన ఇక్కడ ఒక ప్రకటనలో తెలియజేశారు.ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీకి ప్రధానమంత్రి మోదీ టోఫీలను బహుమతిగా ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ, ప్రధానమంత్రి టోఫీలు పంచుతూ ప్రజలకు భక్తిపూర్వక విజ్ఞప్తులు చేయడంలో నిమగ్నమై ఉన్నారని జైరామ్ రమేశ్ ఎద్దేవా చేశారు. దేశ ం కాళ్ల కింద నేలా జారిపోతోందని, ఆర్థిక విధానాల రూపకల్పనలో సమూలమైన మార్పులు అవసరమని, కానీ మోదీ ప్రభుత్వానికి యథావిధిగా ఆత్మస్తుతి చేసుకోవడం తప్ప వేరే ఆలోచనలు లేకుండా పోయాయని విమర్శించారు. ప్రధానమంత్రి జ్ఞానేష్ ద్వారా ఎన్నికలను నిర్వహిస్తున్నారు కానీ ఆయనకు తక్షణమే కొత్త జ్ఞానం అవసరమని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను ఉద్దేశించి కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ ఆరోపించారు. ప్రైవేట్ పెట్టుబడుల రేటులో గణనీయమైన పెరుగుదల లేకుండా ఆర్థికవృద్ధిని వేగవంతం చేయడం, ఉన్నత స్థాయిలలో నిలబెట్టడం సాధ్యం కాదని, వాస్తవానికి అది తప్పనిసరి అని వివరించారు. వాస్తవ వేతనాలు స్తంభించిపోవడం వల్ల అన్ని ఆదాయవర్గాలలో వినియోగవృద్ధి అణిచివేయబడింది. అందువల్ల చైనా అధిక ఉత్పత్తి సామర్థ్యం నుంచి దిగుమతులను నిరంతరం డంపింగ్ చేయడం తయారీ రంగం అంతటా స్థానిక వస్తువులవస్తువుల డిమాండ్‌ను దెబ్బతీసిందని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు.

# తమిళనాడులో మంత్రివర్గం విస్తరణ

● కొత్తగా మరో 23 మంది సభ్యులు మంత్రులుగా ప్రమాణం ● ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు చోటు ● సిఎం సహా 33కు చేరిన మంత్రుల సంఖ్య




**చెన్నై :** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జో సెఫ్ విజయ్ గురువారం తన మంత్రివర్గా న్ని విస్తరించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరితో సహా మరో 23 మంది శాసనసభ్యులను మంత్రులుగా చేర్చుకున్నారు. దాదాపు 60 ఏళ్ల తర్వాత తమిళనాడులో కాంగ్రెస్ సభ్యులకు మంత్రివర్గంలో చోటు దక్కడం గమనార్హం. కాగా, లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ నియమితులైన మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీనాథ్, ఎస్. కమలి, సి. విజయలక్ష్మి, ఆర్.వి. రంజిత్‌కుమార్‌లతో సహా టివికె ఎమ్మెల్యేలు తొలుత మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కిల్లియూర్‌కు ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్. రాజేష్ కుమార్, మేలూరు నియోజకవర్గం నుంచి గెలిచిన పి. విశ్వనాథన్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తమిళనాడు ఎఐసిసి ఇన్‌చార్జి గిరీష్ చోడంకర్ మాట్లాడుతూ మంత్రివర్గంలో తమ పార్టీ ఎమ్మెల్యేల చేరిక తమిళనాడు రాజకీయ చరిత్రలో ఒక మలుపు అని అన్నారు. 'కాంగ్రెస్ కార్యకర్తలు గత 59 ఏళ్లుగా అధికారం కోసం కృషి చేస్తూ, విధేయత, అంకితభావంతో పనిచేశారని, ఇప్పుడు వారు దానిని సాధించారని చోడంకర్ అన్నారు. మొత్తం 23 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు, వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారు. తూత్తుకుడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికైన విజయ్ స్నేహితుడు శ్రీనాథ్ మొదటగా ప్రమాణ స్వీకారం చేశారు. మహమ్మద్ ఫర్వాస్ జె, ఎన్ మేరీ విల్సన్ మైనారిటీ వర్గాలకు చెందినవారు. కాంగ్రెస్ నాయకుడు రాజేష్ కుమార్ ప్రమాణ స్వీకారం చేస్తుండగా గవర్నర్ ఆర్లేకర్ ఆయనను సరిదిద్ది, తనకు ఇచ్చిన లిఖిత ప్రమాణానికే కట్టుబడి ఉండాలని కోరారు. కాగితంపై ఉన్న ప్రమాణాన్ని చదువుతూ, ఆయన అకస్మాత్తుగా కాంగ్రెస్ నాయకులైన కామరాజ్, రాజీవ్ గాంధీ, రాహుల్ గాంధీలను ప్రశంసించడంతో, గవర్నర్ 'అది మీ ప్రమాణంలో భాగం కాదు' అని అన్నారు. దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత తమిళనాడులో కాంగ్రెస్ తిరిగి ప్రభుత్వంలో చేరింది. ఎందుకంటే, ద్రవిడ ప్రధాన పార్టీలైన డిఎంకె, ఎఐఎడిఎంకెలు వేర్వేరు సమయాల్లో ఈ రెండు పార్టీలతో పొత్తు పెట్టుకున్న జాతీయ పార్టీతో సహా తమ మిత్రపక్షాలకు ఎన్నడూ చోటు కల్పించలేదు. చివరి కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఎం. భక్తవత్సలం. ఆయన 1963 నుండి 1967 వరకు అప్పటి మద్రాసు రాష్ట్రంగా పిలువబడే తమిళనాడుకు నాయకత్వం వహించారు. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో మొట్టమొదటి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని 1967లో ద్రవిడ దిగ్గజం, డిఎంకె వ్యవస్థాపకుడు సి.ఎన్. అన్నదొరై అధికారంలోకి తీసుకువచ్చారు. ఆయన నాయకత్వంలో డిఎంకె అప్పటి అధికార కాంగ్రెస్‌పై ఘన విజయం సాధించింది. కాగా, తమిళనాడు శాసనసభలో 234 మంది సభ్యులు ఉన్నారు, ముఖ్యమంత్రితో సహా గరిష్టంగా 35 మంది మంత్రులు ఉండవచ్చు. ఈనెల 10న విజయ్ నేతృత్వంలోని 10 మంది సభ్యులతో మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయగా, తాజాగా మరో 23 మంది ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు; దీంతో మొత్తం మంత్రుల సంఖ్య 33కు చేరింది, ఇకపై మంత్రివర్గంలో మరో ఇద్దరికి మాత్రమే చోటు కల్పించే అవకాశం ఉంది.

జార్ఖండ్‌లో ఆయుధాలు వీడిన

## 27 మంది మావోయిస్టులు




**రాంచి :** జార్ఖండ్‌లో మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారు. డిజిపి తదాషా మిశ్రా సమక్షంలో గురువారం మొత్తం 27 మంది మావోయిస్టులు లొంగిపోయారని అధికారులు తెలిపారు. నిషేధిత సిపిఐ (మావోయిస్టు) సంస్థకు వీరు జార్ఖండ్ పోలీసులు, జార్ఖండ్ జాగ్వార్, సిఆర్‌పిఎఫ్ వంటి వివిధ విభాగాలకు చెందిన సీనియర్ అధికారుల సమక్షంలో తమ ఆయుధాలను అప్పగించారని వారు పేర్కొన్నారు. అనేక కేసుల్లో నిందితులుగా ఉన్న 27 మంది మావోయిస్టులు 'ఆపరేషన్ నవజీవన్' కింద పోలీసుల ఎదుట లొంగిపోయారు. 2026లో మొత్తం 22 మంది మావోయిస్టులు హతమయ్యారు. 44 మంది అరెస్టు అయ్యారు. 29 మంది లొంగిపోయారు. మిగిలిన కొద్దిమంది కూడా జనజీవన స్రవంతిలోకి తిరిగి రావాలని తాము విజ్ఞప్తి చేస్తున్నట్లు ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. రాష్ట్రంలో తీవ్రవాదాన్ని నిర్మూలించడానికి భద్రతా దళాల సంయుక్త ప్రయత్నాలు కొనసాగుతాయని, గురువారం లొంగిపోయిన 27 మంది మావోయిస్టులకు పూర్తి సహకారంతో పునరావాసం కల్పిస్తామని మిశ్రా తెలిపారు. ఇంకా లొంగిపోని వారు హింసామార్గాన్ని విడనాడి, జనజీవన స్రవంతిలోకి రావాలని విజ్ఞప్తి చేస్తున్నామని సిఆర్‌పిఎఫ్ ఐజి సాకేత్ సింగ్ అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు సిపిఐ (మావోయిస్టు) సంస్థలో ఇంకా క్రియాశీలకంగా ఉన్న చివరి పొలిట్‌బ్యూరో సభ్యుడు మిసిర్ బేస్రా వర్గానికి చెందినవారని అధికారులు తెలిపారు. మిసిర్ బేస్రా తలపై రూ. 1 కోటి రివార్డు ఉందని, ఇతను సరండా, కోల్హాన్ ప్రాంతాల్లో క్రియాశీలకంగా ఉండేవాడన్నారు. లొంగిపోయిన వారిలో 123 కేసుల్లో నిందితుడిగా ఉన్న 'సబ్ జోనల్ కమాండర్' సాగెన్ అంగారియా అలియాస్ డోకోల్, జెజెఎంపికి చెందిన 'సబ్ జోనల్ కమాండర్' సచిన్ బేగ్ ఉన్నారని పోలీసులు తెలిపారు. భద్రతా దళాల ఉనికిని మరింత బలోపేతం చేయడానికి సరండా ప్రాంతంలో సుమారు 21 కొత్త 'అడ్వాన్స్‌డ్ క్యాంప్ లొకేషన్లు' (ఎసిఎల్ఎస్), 'ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్‌లు' (ఎఫ్ఒబిఎస్) ఏర్పాటు చేసినట్లు ఒక అధికారి తెలిపారు.

## ఐదు దేశాల పర్యటన ముగించి భారత్ తిరిగొచ్చిన మోదీ



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇం ధనం, రక్షణ, కీలక ఖనిజాలపై ఒప్పందాలపై సంతకాలు చేసిన ఐదు దేశాల పర్యటన ముగించుకుని గురువారం తిరిగి భారత్‌లో అడుగుపెట్టారు. ప్రధానమంత్రి 15న తన పర్యటనను ప్రారంభించి, పలు రోజుల వ్యవధిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీలలో పర్యటించారు. యుఎఇలో, వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు, దీర్ఘకాలిక ఎల్‌పిజి సరఫరా, రక్షణ, షిప్పింగ్ రంగాలకు సంబంధించి భారత్ పలు చారిత్రాత్మక ఒప్పందాలపై సంతకాలు చేసింది. ఈ ఒప్పందాలలో భాగంగా అబుదాబి భారత్‌లో మొత్తం 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టడానికి హామీ ఇచ్చింది. పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో మోదీ, యుఎఇ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌ల మధ్య సమావేశం జరిగింది. నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా, రక్షణ, కీలక ఖనిజాలు, ఇతర ముఖ్య రంగాలలో సహకారాన్ని పెంపొందించేందుకు భారత్ 17 ఒప్పందాలపై సంతకాలు చేసింది. మోదీ, డచ్ ప్రధాని రాబ్ జెట్టెన్‌ల మధ్య చర్చల అనంతరం ఇరు దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయి. పశ్చిమ ఆసియాలో నెలకొన్న పరిస్థితిపై, ముఖ్యంగా దెబ్బతిన్న చమురు సరఫరా కారణంగా ఈ ప్రాంతంపైనా, ఇతర ప్రాంతాలపైనా పడే ప్రభావాలపైనా ఇద్దరు ప్రధానమంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. పర్యటనలోని తదుపరి దశలో, భారత్, స్వీడన్ తమ సంబంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకోవడానికి అంగీకరించాయి. మోదీ, స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్‌సన్ ఒక సమావేశంలో వాణిజ్యం, సాంకేతికత, రక్షణ, ఇతర కీలక రంగాలపై చర్చించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కీలక ఖనిజాలు, ఆవిష్కరణలు, వాణిజ్యం, సాంస్కృతిక మార్పిడులను కలుపుకొని ఒక ప్రతిష్ఠాత్మకమైన రోడ్‌మ్యాప్‌ను ఇరు దేశాలు ఆవిష్కరించాయి. ఓస్లోలో, భారత ప్రధానమంత్రి ఐస్‌లాండ్, ఫిన్లాండ, డెన్మార్క్‌ల ప్రధానమంత్రులతో వేర్వేరు సమావేశాలలో స్వచ్ఛ ఇంధనం, వాణిజ్యం, సుస్థిరత, డిజిటలైజేషన్ వంటి రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు. మూడవ భారత్–నార్డిక్ సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి ఈ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐస్‌లాండ్ ప్రధానమంత్రి క్రిస్ట్రూన్ ఫ్రాస్టాడోటిర్, ఫిన్లాండ్ ప్రధానమంత్రి పెటెరి ఓర్పో, డెన్మార్క్ ప్రధానమంత్రి మెట్టె ఫ్రెడెరిక్సెన్‌లతో చర్చలు జరిపారు. ఉక్రెయిన్, పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించడంలో సంప్రదింపులు, దౌత్యం పాత్రను విశ్లేషించేందుకు మోదీ, నార్వే ప్రధాని జోనాస్ గార్ స్టోర్ చర్చలు జరపడంతో, భారత్, నార్వే ఒక హరిత వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పటిష్ఠం చేసుకున్నాయి. స్వచ్ఛ ఇంధనం, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం, నీలి ఆర్థిక వ్యవస్థ, హరిత నౌకాయానం, డిజిటల్ టెక్నాలజీ, అంతరిక్షం, ఆర్కిటిక్ పరిశోధన వంటి రంగాలలో సహకారాన్ని విస్తరించడం గురించి ఇద్దరు నాయకులు చర్చించారు. తన పర్యటన చివరి అంచె అయిన ఇటలీ పర్యటనలో, మోదీ ఇటలీ ప్రధాని జార్జియా మెలోనితో చర్చలు జరిపి, ఇరు దేశాల మధ్య సంబంధాలను ఒక ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి ఉన్నతీకరించారు. మోదీకి స్వీడన్ అత్యున్నత పురస్కారమైన 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్, డిగ్రీ కమాండర్ గ్రాండ్ క్రాస్', నార్వే అత్యున్నత పౌర పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది రాయల్ నార్వేజియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్' ప్రదానం చేశారు. ఆహార భద్రత, సుస్థిర వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా, రోమ్‌లో ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ) ఆయనకు 'ఎఫ్ఎఒ అగ్రికోలా మెడల్'ను ప్రదానం చేసింది.


SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP36TB 6772 | SURESH BIGULLA | CHEVROLET TVERA NEO-P | 2014 |
| 2 | TS02FG 2449 | MOHANNED ISRATH | SWIFT DZIRE VDI DIESEL 5 SEATER | 2011 |
| 3 | TS03UB 1417 | SHESHADRI NAVEEN | CHEVROLET TVERA NEO-P | 2015 |
| 4 | TS24A 5367 | BHUKYA MOUNIKA | MAHINDRA YUVO 575DI | 2017 |
| 5 | TS24TA 1835 | SHIVA CHINTHALA | TATA SIGNA 2830 K BS6 FBT | 2023 |
| 6 | TS24T 8293 | SAVITHA MYADABOINA | TAFE MF 9500 | 2021 |

AUCTION DATE : 23-05-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H No : 55-1-191, 1st Floor , Above HDFC Bank, Karimnagar Road, Ramaram Complex, Hanamkonda 506015 Cell : 9666576664, 9959103322 & 9676049567.

# అమెరికా, ఉత్తర కొరియాకు చైనా మధ్యవర్తిత్వం!






**సియోల్ :** అమెరికా, ఉత్తర కొరియా దేశాల మధ్య సయోధ్య కోసం మధ్యవర్తిత్వం వహించేందుకు చైనా ముందుకొచ్చింది. ఈ మేరకు దక్షిణ కొరియా మీడియా పేర్కొంది. అణు పరీక్షలతో అమెరికా, ఉత్తర కొరియా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగిన నేపథ్యంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్యవర్తిత్వం వహించబోతున్నట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. జిన్‌పింగ్ త్వరలో ఉత్తర కొరియాలో పర్యటించనున్నారు. చైనా సెక్యూరిటీ, ప్రోటోకాల్ బంధాలు ఇప్పటికే ఉత్తర కొరియా చేరుకున్నాయి. జిన్‌పింగ్ రాక కోసం ఏర్పాట్లు చేస్తోంది.
చైనా, ఉత్తర కొరియా మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడమే జిన్‌పింగ్ పర్యటన ముఖ్య ఉద్దేశమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అణు నిరాయుధీకరణ చర్చలకు ఉత్తర కొరియా ఆసక్తి చూపడం లేదు. తమ అధినేత కిమ్‌జాంగ్ ఉన్ కిమ్ హత్యకు గురైతే ఏ విధంగా ముందుకెళ్లాలన్నదీ ఉత్తర కొరియా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. కిమ్ మరణించిన వెంటనే అణు దాడులు చేసేలా తన విధానాలను ఉత్తర కొరియా మార్చుకున్నట్లు సమాచారం. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కలిసి యుద్ధం చేస్తుండటం, ఆ దేశాధినేత సహా అనేక కీలక నేతలను హత్య చేసిన నేపథ్యంలో ఉత్తర కొరియా యంత్రాంగం అప్రమత్తమైంది. తమ విధానాల్లో ముందస్తు మార్పులు చేసుకుంటోంది. ఇలాంటి పరిణామాల క్రమంలో కిమ్‌జిన్‌పింగ్ భేటీ కానుండటం ఆసక్తికరంగా మారింది. వీరిద్దరు ద్వైపాక్షిక అంశాలతో పాటు ప్రాంతీయ అస్థిరతలకు చెక్ పెట్టే దిశగా చర్చలు జరపనున్నారు. ఇదే క్రమంలో అమెరికాతో ఉత్తర కొరియా సంబంధాలు మెరుగుపర్చేందుకుగాను జిన్‌పింగ్ ప్రయత్నించవచ్చని తెలుస్తోంది.

# ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు అక్రమం

## రష్యా, చైనా ఉమ్మడి ప్రకటన

**బీజింగ్ :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధాన్ని రష్యా, చైనా అధినేతలు వ్లాదిమిర్ పుతిన్, జిన్‌పింగ్ తీవ్రంగా ఆక్షేపించారు. ఈ దాడులు చట్టవిరుద్ధమైనవిగా వెల్లడించారు. వ్యక్తిగతంగా దేశాలు విధించే షిప్పింగ్ ఆంక్షలను ఖండించారు. ఇవి అంతర్జాతీయ వాణిజ్యానికి ఆటంకం కలిగిస్తాయని హోర్మూజ్ జల సంధిలో నిషేధాన్ని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. పశ్చిమాసియా సుస్థిరతకు తీవ్ర విఘాతం కలిగిస్తూ ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ అక్రమంగా దాడులు జరుపుతున్నట్లు రష్యా, చైనా ఉమ్మడి ప్రకటన పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'గోల్డెన్ డోమ్ షీల్డ్' రక్షణ ప్రణాళికను విమర్శించింది. ఇది అంతర్జాతీయ భద్రతకు



అత్యంత ప్రతికూలంగా పరిణమిస్తుందని ఉమ్మడి ప్రకటన పేర్కొన్నట్లు క్రెమ్లిన్ వెల్లడించింది. ఇద్దరు అధినేతల మధ్య చర్చలు ముగిసే సమయానికి 20 ఒప్పందాలపై సంతకాలు జరిగినట్లు రష్యా మీడియా పేర్కొంది. తమ రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంచుకోవడమే కాకుండా సహకారాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవడం కోసం ఇద్దరు అంగీకరించినట్లు తెలిపింది.

# క్యూబాకు రష్యా సంపూర్ణ మద్దతు

**మాస్కో :** కమ్యూనిస్టు ద్వీపాన్ని లొంగదీసుకోవాలని అమెరికా ఉచ్చు బిగుస్తున్న తరుణంలో క్యూబాకు రష్యా సంపూర్ణ మద్దతు ప్రకటించింది. భయపెట్టి, బెదిరించి, ఆంక్షలు విధించి పెత్తనం చలాయిస్తామని కుదరదని తేల్చిచెప్పింది. 'ఈ క్లిష్ట పరిస్థితుల్లో సోదర దేశమైన క్యూబాకు వెన్నంటే ఉంటాం. అక్కడి ప్రజలకు క్రియాశీల మద్దతిస్తాం' అని రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మారియా జకారోవో గురువారం విలేకరులతో అన్నారు. క్యూబాకు సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. సార్వభౌమ దేశ అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చే ప్రయత్నాలను ఖండించారు. బెదిరింపులకు దిగుతూ... అక్రమంగా, ఏకపక్షంగా నిర్బంధాలకు పాల్పడినా, బ్లాక్‌మెయిల్ చేసినా ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. అమెరికా నిరంకుశ వైఖరిని ఆక్షేపించారు. ఆ దేశం అసమ్మతిని తట్టుకోలేదన్నారు. క్యూబాకు రష్యా ఏ విధంగా మద్దతు ఇవ్వనున్నదన్న విషయాన్ని మాత్రం జకారోవో వెల్లడించలేదు.



# రాల్ కాస్ట్రోపై అమెరికా హత్యారోపణలు

**వాషింగ్టన్/హవానా :** క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా తీవ్రస్థాయిలో దుష్ప్రచారం చేస్తోంది. దీనికి మరింత ఊతమిచ్చే విధంగా ద్వీపదేశ మాజీ అధ్యక్షుడు రాల్ కాస్ట్రోపై హంతకుడిగా ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తోంది. ఆయనపై తాజాగా హత్యారోపణలు నమోదు చేసింది. 1996లో అమెరికా జాతీయవాదుల హత్యకు కుట్ర చేశారని ఆరోపించింది. క్యూబా, ఫ్లోరిడా మధ్య రెండు విమానాలు కూల్చివేసినట్లు రాల్ కాస్ట్రోతో పాటు మరో ఐదుగురిపై ఆరోపణలు చేసింది. రాల్ కాస్ట్రోకు 94 సంవత్సరాలు. ఆయన గతంలో దేశ సాయుధ దళాధిపతిగా ఉన్నారు. యుద్ధ విమానాల కూల్చివేతకుగాను అంతర్జాతీయ ఖండనను ఎదుర్కొన్నారు. అయితే క్యూబాలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అమెరికా తీవ్రస్థాయిలో ఒత్తిడి చేస్తున్నది. ఈ క్రమంలో అక్కడి అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కానెల్ తీవ్రంగా స్పందించారు. చట్టబద్ధమైన ఆధారాలు లేకుండా రాజకీయ ప్రేరేపిత ఆరోపణలతో అమెరికా అవాస్తవాలను ప్రచారం చేస్తోందని విమర్శించారు. క్యూబా ప్రజలందరికీ ఉమ్మడి శిక్ష విధించేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. రాల్ కాస్ట్రోపై తప్పుడు ప్రచారాన్ని కానెల్ ఖండించారు. అమెరికాకు కూబా తలొగ్గదని ఆయన తేల్చిచెప్పారు.

# రాజీవ్‌గాంధీ ఆలోచనలు, సంస్కరణలు దేశ అభివృద్ధికి మార్గదర్శకం

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ట్యాంక్‌బండ్ వద్ద సచివాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎ.రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆలోచనలు, సంస్కరణలు దేశ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచాయని అన్నారు. రాజీవ్ గాంధీ దేశానికి సాంకేతికతను పరిచయం చేసి భారతాన్ని ప్రపంచ వేదికపై నిలబెట్టిన దార్శనిక నాయకుడని రేవంత్ రెడ్డి కొనియాడారు. పరిపాలనలో ఆధునికీకరణ, సరళీకరణ విధానాలకు ఆయన పునాది వేశారని గుర్తుచేశారు. రాజీవ్ గాంధీ చూపిన మార్గంలోనే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. చట్టసభల్లో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలన్న రాజీవ్ గాంధీ ఆశయం కొనసాగించే క్రమంలో మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని కోరారు.సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ ప్రజల దశాబ్దాల కల సాకారమైందని, తెలంగాణ ఉన్నంతకాలం ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటూనే ఉంటారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, పలువురు ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, కార్పొరేషన్ చైర్మన్లు రాజీవ్‌గాంధీకి నివాళ్లు అర్పించారు.

**రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ నేతల ఘన నివాళి**

మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీకి పలువురు కాంగ్రెస్ నేతలు ఘనంగా నివాళ్లు అర్పించారు. గురువారం రాజీవ్ గాంధీ వర్ధంతి పురస్కరించుకుని గాంధీభవన్‌లో ఆయన చిత్ర పటానికి ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి సెక్రటరీ సచిన్ సావంత్, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్ పలువురు నాయకులు నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా వారంతా మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకున్నారు. మన మహోన్నత దేశం పట్ల రాజీవ్ గాంధీ ఆకాంక్షలు, దార్శనికతను నెరవేర్చే దిశగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు మోతా రోహిత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఫోటో ప్రదర్శన నిర్వహించారు. దాదాపు 65 మంది రక్త దానం చేశారు.



**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నివాళి**

భారతదేశ ఆధునిక అభివృద్ధికి దిశానిర్దేశం చేసిన దూరదృష్టి నాయకుడు,దేశ సమగ్రత కోసం తన ప్రాణాలను అర్పించిన మహానేత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొనియాడారు. మాజీ ప్రధాని మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు మంత్రి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘనంగా నివాళ్లు అర్పించారు. జీవితాన్ని దేశ సేవకే అంకితం చేసిన రాజీవ్ గాంధీ రాజకీయాలను అధికారంగా కాకుండా ప్రజాసేవగా భావించిన ఆయన, యువత కలలను దేశ అభివృద్ధితో ముడిపెట్టి కొత్త భారత నిర్మాణానికి పునాది వేశారని కొనియాడారు. సాంకేతిక విప్లవానికి నాంది పలికి భారతదేశాన్ని ఆధునిక యుగంలోకి తీసుకెళ్లిన రాజీవ్ గాంధీ, సమాచార సాంకేతికత, టెలికాం, కంప్యూటర్ రంగాల అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, గ్రామీణాభివృద్ధి, యువత సాధికారత, మహిళలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడం వంటి ఎన్నో సంస్కరణలు రాజీవ్‌గాంధీ దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు.

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళి**

భారతరత్న, దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని న్యూఢిల్లీలోని 'వీర్ భూమి' వద్ద తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఆయన రాజీవ్ గాంధీ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

# భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చి, ఆ వ్యాజ్యాన్ని కొట్టివేసింది. ఈ నెల 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు అయింది. అనంతరం పరారీలో ఉన్న భగీరథ్ హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి గత శుక్రవారం అర్ధరాత్రి విచారణ నిర్వహించి తీర్పును రిజర్వ్‌లో ఉంచారు. తీర్పు వెలువడే వరకు అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని భగీరథ్ తరఫు న్యాయవాది చేసిన వినతిని కోర్టు తిరస్కరించింది. ఇదే సమయంలో శనివారం భగీరథ్ పోలీసుల అదుపులోకి వెళ్లారు. తనను పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఉత్తర్వులు ఇవ్వడం ప్రయోజనం ఉండదని పేర్కొంటూ, పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది హైకోర్టుకు లేఖ సమర్పించారు. ఈ అభ్యర్థనపై గురువారం విచారణ చేపట్టిన జస్టిస్ మాధవీదేవి పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే సంబంధిత దిగువ కోర్టులో రెగ్యులర్ బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసుకునే స్వేచ్ఛను పిటిషనర్‌కు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఉక్కిరి బిక్కిరి...

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ప్రతి రోజు సుమారు 150 మెట్రిక్ టన్నుల చెత్త డంపు యార్డుకు చేరుతున్నట్లు తెలుస్తోంది. ఆ మేరకు అక్కడ సరినడా స్థలం లేకపోవడంతో ఏళ్ల తరబడి వేస్తున్న చెత్త గుట్టలుగా పేరుకుపోతుంది. దీంతో ఎండ వేడికి చెత్త అంటుకుని మంటలు చెలరేగి దట్టమైన పొగ వ్యాపిస్తుంది. కార్పొరేషన్ ఆధ్వర్యంలో డంపు చేసిన చెత్తను బయో మైనింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన యంత్రాలు సరిగా పని చేయకపోవడం, సేకరిస్తున్న చెత్తను రీసైకిల్ చేసే యంత్రం సామర్థ్యం సరిపోకపోవడంతో చెత్త పేరుకు పోవడానికి కారణంగా తెలుస్తోంది.

**ఆరోగ్య సమస్యలు తప్పడం లేదు**

డంపు యార్డులో చెలరేగుతున్న మంటలతో వ్యాపిస్తున్న పొగతో పలు ఆరోగ్య సమస్యలు వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు. డంపు యార్డులో పేరుకు పోతున్న చెత్త వలన పలు రకాల కెమికల్స్, కార్బన్ ఉద్గారాలు ఉత్పత్తి తో చర్మ సంబంధ, ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులతో పాటు పలు రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదముందని చెబుతున్నారు. సమీప కాలనీల ప్రజలు రోజు నరకం చూస్తున్నామని వాపోతున్నారు. సాధ్యమైనంత తొందరగా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

**నేడు రౌండ్ టేబుల్ సమావేశం..**

కరీంనగర్ ప్రజలు ఎదుర్కొంటున్న డంప్ యార్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నేడు బద్దం ఎల్లారెడ్డి భవన్ లో వివిధ రాజకీయ పార్టీలు, పలు ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డంప్ యార్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన పార్టీలు హామినిచ్చి అధికారంలోకి వచ్చాక సమస్యను పట్టించుకోవడంలేదని, నిత్యం నరకం చూస్తున్న నగర వాసులకు డంప్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ సమావేశంలో చర్చించనున్నట్లు నిర్వహకులు తెలిపారు.

# వేతనాలు పెంపు

(మొదటి పేజీ తరువాయి)



సుదర్శన్ రెడ్డి, ఎంపిలు వేం నరేందర్ రెడ్డి, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఎంఎల్‌ఎలు రాజ్‌ఠాకూర్, మందుల సామ్యూల్ పాల్గొన్నారు. సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్మికుల బాధ్యతను వదిలేస్తే, తమ ప్రభుత్వం బాధ్యతతో కార్మికుల ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కార్మికులకు సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. కనీస వేతన పెంపుపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం కార్మిక సంఘాలు, పరిశ్రమల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుని సిఫార్సులు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుత ద్రవోల్బణం, పెరిగిన నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకుని కనీస వేతనాలను పెంచామని వివరించారు. జోన్ 1 లో మున్సిపల్ కార్పొరేషన్స్, జోన్ 2 లో మున్సిపాలిటీలు, జోన్3 లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీస వేతనం నిర్ణయించామన్నారు. సింగరేణి సంస్థలో కూడా వేతనాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని, ఈ సంస్థలో కూడా 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇస్తామని సిఎం చెప్పారు.

**బిఆర్‌ఎస్‌వి శవ రాజకీయాలు...**

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయిందని, మరో 20 శాతం మిగిలిందని, ఈ ప్రక్రియను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ నాయకులు, కెటిఆర్ మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారని, రైతుల విషయంలో శవ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు చనిపోతే వారిని పరామర్శించి, వారితో ఫొటోలు దిగి పోస్ట్ చేస్తున్నారన్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా? అని సిఎం ప్రశ్నించారు. నిజంగానే రైతుల పట్ల ప్రతిపక్ష పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. బిఆర్‌ఎస్ వద్ద దొంగ డబ్బులు బాగా ఉన్నాయని, అందులో నుంచి రైతులను ఆదుకోవచ్చు కదా? అని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వారిని జైలుకు పంపిస్తున్నామని, కానీ డ్రగ్స్‌లో పట్టుపడిన వారికి మాత్రం స్టేషన్ బెయిల్ వస్తుందని, వారిని బాధితులుగా చూస్తున్నారని, అందుకే, ఈ చట్టంలో కూడా సవరణ చేయాల్సిన అవసరం ఉన్నదని సిఎం అభిప్రాయపడ్డారు.

**సమస్య ఏదైనా మోదీది రాజకీయ కోణమే**

ప్రజా సమస్యలను, దేశాల మధ్య జరిగే యుద్ధాన్ని బిజెపి, మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోందని సిఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అందుకే ఎన్నికలు పూర్తవ్వగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారన్నారు. తమ ప్రభుత్వం ప్రతీ అంశాన్ని దీర్ఘకాలిక దృష్టితో చూస్తోందన్నారు.

**'కులగణన'సుప్రీం సమర్థించడం ప్రభుత్వానికి దక్కిన గౌరవం**

కుల గణన అంశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రివర్గానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. జన గణనలో కులగణన చేసే విషయంలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. మోదీ ప్రభుత్వం తక్షణమే జనగణనలో కులగణన చేర్చి, బలహీన వర్గాలకు అభివృద్ధి, సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాల్లో సముచిత స్థానం కల్పించాలని సిఎం డిమాండ్ చేశారు.

**'సాంకేతిక నైపుణ్య' ఉద్యోగాలకే అధిక డిమాండ్**

సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని, ఉద్యోగభద్రత కూడా ఉన్నదని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఐటి, అమెరికా అనే ఆలోచనలను వీడాలని, ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థమని సిఎం అభిప్రాయపడ్డారు. రాష్ట్ర యువత స్కిల్స్‌ను పెంచుకుని విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలకే ముప్పు అని, బ్లూ కాలర్ ఉద్యోగాలకు విదేశాల్లో కూడా మంచి డిమాండ్ ఉన్నదని సిఎం తెలిపారు. పలు వస్తువులకు అమెరికా కేవలం బ్రాండ్ మాత్రమేనని, ఆ వస్తువులు మాత్రం ఇతర దేశాల్లో ఉత్పత్తి అవుతాయన్నారు. గతంలో గల్ఫ్ ఏజెంట్ల చేతిలో చాలా మంది మోసపోయారని, ప్రస్తుతం ఏజెంట్లకు పెద్ద పెద్ద పదవులు వచ్చాయన్నారు.

**గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం వేతన సవరణ చేయలేదు: మంత్రి వివేక్**

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతన సవరణ కూడా చేయలేదని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. కార్మికులు సంతృప్తిగా ఉన్నపుడే ఉత్పత్తి బాగుంటుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

**భగీరథ్ లొంగిపోలేదు...అరెస్ట్ చేశాం**

పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తనిఖీలు నిర్వహిస్తుండగా బండి భగీరథ్‌ను పోలీసులకు చిక్కాడన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించాలంటే , ఆయన తన ఇంట్లోనే భగీరథ్‌ను అప్పగించి ఉండేవారు కదా? అని సిఎం ప్రశ్నించారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్టుగా బిఆర్‌ఎస్ నేతలు శాడిస్టులుగా వ్యవహరిస్తున్నారని సిఎం వ్యాఖ్యానించారు. మైనర్ బాలికను అడ్డుపెట్టుకుని కెటిఆర్ రాజకీయం చేస్తున్నారని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలని, కానీ ఇలా దిగజారి ప్రవర్తించొద్దని సిఎం హితవు పలికారు. కెటిఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసులు ఇచ్చామని గుర్తు చేశారు. డ్రగ్స్ కేసులో దొరికిన మాజీ ఎంఎల్‌ఎ విషయంలో బిఆర్‌ఎస్ ఎందుకు చర్యలు తీసుకోలేదని, ఆయనను పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని రేవంత్ రెడ్డి నిలదీశారు. బండి భగీరథ్ విషయంలోనూ పోక్సో చట్టం ప్రకారమే వ్యవహరించామని, నోటీసులు ఇచ్చి, స్టేట్ మెంట్‌ను కూడా రికార్డ్ చేశామని సిఎం వెల్లడించారు. కెటిఆర్ ఇంకా కల్వకుంట్ల రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పక్క రాజకీయ పార్టీ నుంచి బిఆర్‌ఎస్‌లో చేరితే జగిత్యాలలో సభకు వెళ్లిన కెసిఆర్, రాష్ట్రంలో ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు స్పందించలేదని, కనీసం ఆయన పత్రిక ప్రకటనను కూడా విడుదల చేయలేదని ఆరోపించారు.

# 'ఎబోలా'పై హై అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచవ్యాప్త మహమ్మారి కాదని డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనామ్ గెబ్రియేసస్ స్పష్టం చేశారు.

**అడ్వైజరీలోని సూచనలు**

కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన అడ్వైజరీ ప్రకారం, ఎబోలా ప్రభావిత దేశాల నుంచి భారత్‌కు చేరుకునే ప్రయాణికులు జ్వరం, తీవ్ర అలసట, నీరసం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, విరేచనాలు, గొంతు నొప్పి, శరీరంలో అనూహ్య రక్తస్రావం వంటి లక్షణాలు ఉంటే వెంటనే విమానాశ్రయంలోని ఆరోగ్య విభాగానికి సమాచారం ఇవ్వాలి. ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే తమ ఆరోగ్య పరిస్థితిని వెల్లడించాలని అధికారులు సూచించారు. అలాగే ఎబోలా అనుమానితులు లేదా నిర్ధరిత రోగుల రక్తం, శరీర ద్రవాలతో నేరుగా సంబంధం కలిగిన ప్రయాణికులు కూడా వెంటనే ఆరోగ్య అధికారులను సంప్రదించాలని డీజీహెచ్‌ఎస్ పేర్కొంది. ఇది ఇతర ప్రయాణికుల భద్రత దృష్ట్యా అత్యంత కీలకమని పేర్కొంది. అదేవిధంగా, భారత్‌కు వచ్చిన తర్వాత 21 రోజుల లోపు ఎవరైనా పైన చెప్పిన లక్షణాలతో బాధపడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని, తమ ప్రయాణ చరిత్రను అధికారులకు వెల్లడించాలని సూచించింది. ప్రయాణికుల భద్రత, అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనలు (ఐహెచ్‌ఆర్) ప్రకారం స్క్రీనింగ్, ఆరోగ్య పరీక్షలు, ప్రజారోగ్య చర్యలకు సహకరించాలని కోరింది. ఇదిలా ఉండగా, దేశంలో ఇప్పటివరకు ఎబోలా కేసులు ఏమీ నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. అయినప్పటికీ ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ పేర్కొన్నారు.
ఈ క్రమంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా విమానాశ్రయాల్లో స్క్రీనింగ్, క్వారంటైన్ విధానాలు, నమూనాల పరీక్షలు, రోగుల చికిత్స వంటి పరీక్షలకు సంబంధించిన వివరణాత్మక కార్యాచరణ విధానాలను ఇప్పటికే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పంపినట్లు తెలిపారు.

**ఎబోలా ఎఫెక్ట్ : భారత్-ఆఫ్రికా ఫోరమ్ సదస్సు వాయిదా**

మరోవైపు, ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే వారం ఢిల్లీలో జరగాల్సిన 4వ భారత్ ఆఫ్రికా ఫోరమ్ సదస్సును తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం అధికారికంగా ప్రకటించింది. ఈ సదస్సుకు ఆఫ్రికా నుంచి కీలక నేతలు, అధికారులు రావలసి ఉంది. అయితే, వైరస్ వ్యాప్తి కారణంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఆఫ్రికన్ యూనియన్ ప్రతినిధులతో చర్చించిన తర్వాతే సదస్సును వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. సదస్సు వాయిదా పడినప్పటికీ, ఎబోలాను ఎదుర్కొనేందుకు ఆఫ్రికా దేశాలకు అవసరమైన వైద్య సహాయాన్ని అందిస్తామని భారత్ ప్రకటించింది.

# నిప్పుల కుంపటి

(మొదటి పేజీ తరువాయి)

మొబైల్ ఫోన్లకు చేరవేస్తోంది. ఎండతీవ్రతతో పాటు తీవ్రమైన వడగాలులు వీస్తుండటంతో ప్రజలు అల్లాడి పోతున్నారు. ముఖ్యమైన పనులపై బయటకు వచ్చే వారు తీవ్ర దాహార్తికి గురవుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో 46.4, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 46.2, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్‌లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయి. సూర్యాపేట జిల్లాలో సగటున 44.1 నుండి 46.2 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. మేళ్ళచెరువులో 46.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా నేరేడుచర్ల మండలం ముకుందాపురంలో 44.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గరిడేపల్లి, మోతె మండలం ఉర్లుగొండ, మద్దిరాల మండలం ముకుందాపురం, రెడ్డిగూడెంలో 46.1 డిగ్రీలు, మోతె మండలం మామిళ్ళగూడెం, మునగాలలో 46.0 డిగ్రీల ఉష్ణోగ్రత, చిలుకూరులో 45.9, నూతనకల్ 45.8, నడిగూడెం 45.3, పెన్‌పహాడ్ మండలం చీదెళ్ళలో, మఠంపల్లి మండలం రాయినిగూడెం, మఠంపల్లి, హుజూర్‌నగర్ మండలంలోని లక్కవరంలో 45.1, అనంతగిరి మండలంలోని శాంతినగర్, నేరేడుచర్ల మండలం నర్సయ్యగూడెంలో 45.0, సూర్యాపేట మండలంలోని బాలెంల తండ, పాలకీడు మండలం అలంగాపురంలో 44.7, సూర్యాపేట మండలం యల్కారం, తుంగతుర్తిలో 44.6, గరిడేపల్లి, నాగారం, ఆత్మకూర్(ఎస్), అనంతగిరి మండలంలోని గొండ్రియాల, చింతలపాలెం మండలం దొండపాడులో 44.3, నాగారం మండలం ఫణిగిరి, చివ్వెంల మండలం చందుపట్ల, గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా నేరేడుచర్ల మండలం ముకుందాపురంలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు. కొత్తగూడెంలోని చుంచుపల్లి మండలంలో గల సింగరేణి జిఎం ఆఫీస్, పాల్వంచ మండలం యానంబైలు వద్ద గరిష్టంగా 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.
దుమ్ముగూడెం 46.3, మణుగూరి సింగరేణి జిఎం ఆఫీస్ 43.2, ఆళ్లపల్లి, భద్రాచలం, లక్ష్మీదేవిపల్లిలో 46.1, గరిమెల్లపాడు 45.8, అశ్వారావుపేట, జూలురుపాడు 45.6, అశ్వాపురం, ఏడూళ్లబయ్యారం, కోయగూడెంలో 45.5, 24 ఏరియా ఇల్లెందులో 45.4, మండలపల్లిలో 45.3, మణుగూరు 45.2, సత్యనారాయణపురం 45.1, కరగగూడెంలలో 45 డిగ్రీల ఎండ తీవ్ర నమోదు నమోదైంది. ఇదిలా ఉండగా ఆరెంజ్ అలెర్ట్‌లో బూర్గంపాడు, ములకలపల్లి, మద్దుకూరు, పెంట్ల, ఇల్లెందు 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. భద్రాచలం గోదావరి బ్యాంక్, సుజాతనగర్‌లో 44.8, నాగుపల్లి పాత కొత్తగూడెంలో 44.7, గుండాల, మల్కారం, 44.6, నాయుడుపేట, అంకంపాలెంలలో 44.5 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు మమోదయ్యాయి.

**ఆంధ్రప్రదేశ్‌లోనూ విజృంభణ**

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. అత్యధికంగా పిడుగురాళ్లలో 48.1, వేటపాలెం (బాపట్ల), నందివాడ (కృష్ణా)ల్లో 47.6 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నందనమారెళ్ల (మార్కాపురం)లో 46.6, కూనవరం (పోలవరం)లో 46.5, కావలి (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు)లో 46.4, తెనాలి (గుంటూరు)లో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# సిరాజ్, రషీద్ జోరుకు తలొగ్గిన చెన్నై..



లీగ్ దశ చివరి మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ పంజా విసిరింది. సొంతగడ్డపై బెబ్బెలిలా రెచ్చిపోయిన శుభ్మన్ గిల్ సేన చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ ఆశలను నేలమట్టం చేసింది. భారీ ఛేదనలో సిరాజ్(3–26) విజృంభణతో కుదేలైన సీఎస్కేను శివం దూబే(47) గట్టెక్కించేలా కనిపించినా.. రషీద్ ఖాన్(3–18) తిప్పేయడంతో మ్యాచ్ ఏకపక్షంగా మారింది. రబడ(3–32) సైతం ఓ చేయి వేయగా గుజరాత్ 89 పరుగుల భారీ విజయాన్నందుకోగా ఐదుసార్లు ఛాంపియన్ ఉసూరుమంటూ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

పంతొమ్మిదో సీజన్‌లో దూసుకెళ్తున్న గుజరాత్ టైటాన్స్ అదిరే ఆటతో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఇంటికి పంపింది. అహ్మదాబాద్‌లో తొలుత 229 రన్స్ కొట్టిన గుజరాత్ ప్రత్యర్థిని పడగొట్టింది. పేసర్ సిరాజ్(3–26) ఆదిలోనే చావుదెబ్బ తీశాడు. 230 పరుగుల భారీ ఛేదనకు దిగిన సీఎస్కే బ్యాటర్ల భరతం పడుతూ తొలి ఓవర్లోనే సంజూ శాంసన్(0)ను గోల్డెన్ డక్‌గా ఔట్ చేశాడు మియా భాయ్. ఆ తర్వాతి ఓవర్‌లో రుతురాజ్ గైక్వాడ్(16), ఈ సీజన్లో వేగవంతమైన అర్ధ శతకంతో రికార్డు నెలకొల్పిన ఉర్విల్ పటేల్(0)ను వెనక్కి పంపిన సిరాజ్ మూడో వికెట్‌తో చెన్నైని పీకల్లోతు కష్టాల్లో నెట్టాడు.

సిరాజ్ నిప్పులు చెరగడంతో 29 పరుగులకే మూడు వికెట్లు పడగా మాథ్యూ షార్ట్(19), కార్తిక్ శర్మ(24)లు క్రీజునంటుకునేందుకు ప్రయత్నించారు. కానీ, రబడ ఓవర్లో షార్ట్ ఔటవ్వగా .. 7వ ఓవర్లో గిల్ విసిరిన త్రోకు కార్తిక్ రనౌటవ్వగా చెన్నై 63 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. చూస్తుండగానే ఐదుగురు డగౌట్ చేరగా శివం దూబే(47), బ్రెవిస్(8)లు భారీ ఓటమిని తప్పించేందుకు పోరాడారు.

**దూబే ధనాధన్..** కీలక బ్యాటర్లు ఔటైన చోట దూబే సిక్సర్లతో హల్చల్ చేశాడు. హోల్డర్, అర్షద్ ఖాన్ ఓవర్లో దంచేసి చెన్నై స్కోర్ వంద దాటించాడు దూబే. అర్ధ శతకానికి చేరువైన అతడు రషీద్ ఖాన్(3–18) ఓవర్లో బంతిని గాల్లోకి లేపగా గిల్ వెనక్కి పరుగెడుతూ డైవింగ్ క్యాచ్ అందుకోగా ఆరో వికెట్ 53 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కంబోజ్(19) ఆట కట్టించిన రషీద్.. ప్రమాదకరమైన బ్రెవిస్ను ఔట్ చేసి చెన్నై ఓటమిని ఖాయం చేశాడు. 14వ ఓవర్లో రబడ(3–32) వరసగా నూర్ అహ్మద్, జాన్సన్ను ఔట్ చేయడంతో సీఎస్కే 140కే ఆలౌటయ్యింది. ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయిన గైక్వాడ్ సేన టోర్నీ నుంచి నిష్క్రమించింది.

**చితక్కొట్టిన టాపార్డర్...**గుజరాత్ టైటాన్స్ టాపార్డర్ బ్యాటర్లు చితక్కొట్టారు. ఓపెనర్ సాయి సుదర్శన్(84) అర్ధ శతకంతో కదం తొక్కగా శుభ్మన్ గిల్(64) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. చెన్నై బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్న ద్వయం శతక భాగస్వామ్యంతో జట్టును భారీస్కోర్‌కు పునాది వేసింది. ఆఖర్లో బట్లర్(57 నాటౌట్) బ్యాట్ ఝులిపించడంతో సీఎస్కే ముందు కఠినమైన లక్ష్యాన్ని నిలిపింది గుజరాత్.

# బుడ్డోడు కాదు బుల్డోజర్



క్రికెట్ ప్రపంచంలో కొన్ని దృశ్యాలు కాలంతో సంబంధం లేకుండా అభిమానుల గుండెల్లో నిలిచిపోతాయి. 1991–92 సీజన్లో ఆస్ట్రేలియా గడ్డపై టీనేజర్గా సచిన్ టెండూల్కర్ బ్యాటింగ్ చేస్తుంటే.. ఆసీస్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ మెర్వ్ హ్యూస్ ముఖంలో కనిపించిన ఆశ్చర్యం, నివ్వెరపాటు క్రికెట్ అభిమానులకు ఇప్పటికీ గుర్తే. నాడు సిడ్నీ క్రికెట్ గ్రౌండ్లో రింగుల జుట్టు, అమాయకపు ముఖంతో ఉన్న కుర్ర సచిన్ కొట్టిన అద్భుత స్ట్రెయిట్ డ్రైవ్కు హ్యూస్ నోరెళ్లబెట్టాడు. మూడు దశాబ్దాల తర్వాత ఐపీఎల్ 2026లో ఈ తరం మేటి బౌలర్ల ముఖాల్లో మళ్లీ అలాంటి హావభావాలే కనిపిస్తున్నాయి. కారణం సరికొత్తగా దూసుకొచ్చిన మరో టీనేజర్ వైభవ్ సూర్యవంశీ! స్టార్క్, బుమ్రా, కమిన్స్, హేజిల్వుడ్, ఎంగిడి ఇలా బౌలర్ ఎవరైనా, ఎంతటి పేరున్నా ఈ బీహార్ బుడ్డోడు.. కాదు కాదు బుల్డోజర్ ఎవ్వరినీ వదలడం లేదు. మైదానంలో అతడు సాగిస్తున్న పరుగుల వేట, సృష్టిస్తున్న విధ్వంసం సోమవారం లక్నో సూపర్ జెయింట్స్తో జరిగిన మ్యాచ్‌తో మరో స్థాయికి చేరింది ఈ సీజన్లో వైభవ్ సూర్యవంశీ బ్యాట్ నుంచి సిక్సర్ల సునామీ కురుస్తోంది. ఏకంగా 53 సిక్సర్లు బాదడం, ఒకే సీజన్లో 50 సిక్సర్ల మైలురాయిని దాటిన భారత తొలి ఆటగాడిగా నిలవడం సామాన్యమైన విషయం కాదు. దీనికి అసాధారణమైన కండ బలం, విస్ఫోటక శక్తి అవసరం. 2012లో క్రిస్ గేల్ నెలకొల్పిన 59 సిక్సర్ల రికార్డును అధిగమించడానికి కేవలం 6సిక్సర్ల దూరంలో ఉన్నాడు. 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన ఆటగాళ్లలో ఐపీఎల్ చరిత్రలోనే అత్యధికంగా 236.32 స్ట్రయిక్ రేట్తో సూర్యవంశీ దూసుకుపోతున్నాడు. పవర్ప్లేలోనే 37 సిక్సర్లు బాదడం అతడి పవర్కు నిదర్శనం. అతని బలం కేవలం చేతుల్లోనే లేదు. షాట్ ఆడేప్పుడు అతని మణికట్టు వేగం అమోఘం. సూర్యవంశీ కొడుతున్న సిక్సర్ల గురించే అందరూ మాట్లాడుకుంటున్నారు, కానీ అతని ఆట పునాది బలమైన టెక్నిక్తో నిర్మితమైంది. చాలా మంది పవర్ హిట్టర్లలా కాకుండా, ఈలెఫ్ట్ హ్యాండర్ బంతిని ఆడే సమయంలో తన తలని ఎంతో స్థిరంగా ఉంచుతున్నాడు. మయాంక్ యాదవ్ వంటి బౌలర్లు వేగంతో బంతులు విసురుతున్నా.. సూర్యవంశీ కంగారు పడకుండా ఆ వేగాన్నే తనకి అనుకూలంగా మార్చుకుంటున్నాడు. ఎక్స్ట్రా కవర్ మీదుగా అతను ఆడే షాట్లకు మైక్రో సెకన్ల టైమింగ్ అవసరం. ఇక వికెట్ కీపర్ తల మీదుగా ఆడే ర్యాంప్ షాట్ ఏదో కంగారులో ఆడే స్కూప్ షాట్ లాగా కాకుండా.. బ్యాట్ ఫేస్ నేరుగా ఉంచి అత్యంత వేగవంతమైన బంతిని తెలివిగా డైరెక్షన్ మార్చే ఒక అద్భుతమైన కళలా కనిపిస్తోంది. బంతి వేగాన్ని వాడుకుంటూ.., తల కదలకుండా అతడు ఆడే షాట్లు క్లాసిక్ టెక్నిక్ను తలపిస్తున్నాయి. వైభవ్ బ్యాటింగ్లో ఓ మేటి క్రికెటర్లోని డేరింగ్.. నిర్భయత్వం కనిపిస్తుంది. తను క్రీజులోకి వచ్చిన తర్వాత ఎదురుగా ఉన్న బౌలర్ చేతిలో బంతిని తప్ప ఆ వ్యక్తి ఎవరనేది అతనికి అనవసరం. స్టార్క్, బుమ్రా, కమిన్స్, లక్నో పేస్ దళం.. ఇలా ప్రతి ఒక్కరికీ అతను ఒకే రకమైన ట్రీట్మెంట్ ఇచ్చాడు. బౌలర్ లెంగ్త్లో చిన్న పొరపాటు చేసినా బంతిని నేరుగా స్టాండ్స్లోకి పంపుతున్నాడు. జట్టుకు తన దూకుడు అవసరం అవ్వగానే విరుచుకుపడుతున్నాడు.

# పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- తెలంగాణ ప్రభుత్వం అనాథ పిల్లలను వెనుకబడిన తరగతుల్లోని ఏ గ్రూప్‌లో చేరుస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది?
  బిసి 'ఎ'
- భారత ప్రభుత్వం ఏ ప్రణాళికలో 'సామాజిక అడవుల' కార్యక్రమాన్ని ప్రారంభించింది?
  5వ
- వెయ్యి మెగావాట్ల విద్యుత్తు కొనుగోలుకు సంబంధించి 2015 సెప్టెంబరులో తెలంగాణ ఏ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది?
  ఛత్తీస్‌గఢ్
- 'నీరాంచల్' పథకాన్ని ఏ రంగ అభివృద్ధికి ప్రారంభించారు?
  వాటర్ షెడ్
- విద్యార్థులు, అధ్యాపకుల బదిలీకి సంబంధించి 2015, సెప్టెంబరు 6న తెలంగాణ విశ్వవిద్యాలయం కింది ఏ విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకుంది?
  చికాగో
- విలియంకోట కళాశాలను ఎవరు స్థాపించారు?
  వెల్లస్లీ
- ఆఫ్రికన్ యూనియన్ వార్షిక సదస్సును 2015 జనవరిలో ఎక్కడ నిర్వహించారు?
  అడీస్ అబాబా
- వాతావరణంలో అత్యధికంగా ఉన్న జడ వాయువు ఏది?
  ఆర్గాన్
- 2015, సెప్టెంబరు 28న ఎవరి శత జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది?
  ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ
- వన్డే క్రికెట్‌లో అత్యధిక ఔట్లలో పాలుపంచుకున్న వికెట్ కీపర్‌గా ఇటీవల ఎవరు రికార్డులకెక్కారు?
  కుమార సంగక్కర
- భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య ఎంత?
  1+7
- 'ల్యాండ్ లాక్ కంట్రీ (తాళం పెట్టిన దేశం)' అని ఏ దేశాన్ని పిలుస్తారు?
  బొలీవియా
- కుంభాకార దర్పణాన్ని కిందివాటిలో దేన్ని సరిచేసేందుకు ఉపయోగిస్తారు?
  దూరదృష్టి
- సుప్రీంకోర్టు ఎప్పుడు అమల్లోకి వచ్చింది?
  1950, జనవరి 28
- 'బ్యాంకింగ్ నియంత్రణ చట్టం'ను ఎప్పుడు జారీ చేశారు?
  1949
- కిందివాటిలో ఏ గాజును విద్యుత్ బల్బులు, కంటి అద్దాల తయారీలో ఉపయోగిస్తారు?
  ఫ్లింట్ గ్లాస్
- ఆర్బీఐ 'వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సు (డబ్ల్యూఎమ్ఎ)'ను కిందివాటిలో దేనికి కల్పిస్తుంది?
  కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం
- బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను ఏ వస్త్రంతో తయారు చేస్తారు?
  సిలికాన్ నైట్రేట్, జనపనార
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సొంత కార్యాలయాలు లేని చోట ఆర్బీఐ ఏజెంటుగా ఏ సంస్థ వ్యవహరిస్తుంది?
  స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- అంటుకుపోని వంటగిన్నెలకు దేనితో పూత పూస్తారు?
  టెఫ్లాన్
- కార్గిల్ యుద్ధంలో ఉపయోగించిన మిస్సైల్స్ ఏవి?
  పినాక
- ఇక్ష్వాకుల రాజలాంఛనం ఏది?



  సింహ
- అంతర్జాతీయ పర్యావరణ మొదటి సదస్సు ఎప్పుడు జరిగింది?
  1972
- వధువును డబ్బు ఇచ్చి కొనుక్కునే వివాహ పద్ధతి ఏది?
  అసుర
- 'ఘటిక' అనేది ఎవరి నివాస స్థావరం?
  బ్రాహ్మణ పండితులు
- ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలను ఏటా జనవరిలో ఎక్కడ నిర్వహిస్తారు?
  దావోస్
- 'రెటీనైటిస్ పిగ్మెంటోసా' అనే వ్యాధి శరీరంలోని ఏ భాగానికి సంబంధించింది?
  కళ్లు
- 49వ అక్షాంశ రేఖ ఏయే దేశాలను వేరుచేస్తుంది?
  అమెరికా, కెనడా
- ఇటీవల వార్తల్లోకి వచ్చిన ఖుషాబ్ న్యూక్లియర్ కాంప్లెక్స్ ఏ దేశంలో ఉంది?
  పాకిస్థాన్
- సునామీ అనేది ఎలాంటి విపత్తు?
  భౌగోళిక
- గ్రీకులు 'హైడస్పస్'గా పిలిచిన భారత నది ఏది?
  జీలం
- కర్ణాటక రాజ్య రాజధాని ఏది?
  ఆర్కాట్
- మానవుల జీర్ణవ్యవస్థలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం ఏది?
  హైడ్రోక్లోరిక్ ఆమ్లం
- భారతదేశంలో మొదటి న్యూక్లియర్ పవర్ ప్లాంటును ఎక్కడ నెలకొల్పారు?
  తారాపూర్
- పెన్నానదికి ఎక్కడ ఆనకట్ట కట్టారు?
  నెల్లూరు
- అసంపూర్ణంగా విభజన చెందిన జఠరిక గల జంతువు ఏది?
  తొండ
- రైల్వే స్టేషనులో ఉపయోగించు త్రాసు
  ప్లాట్ ఫారమ్ కాటా
- తల్లి పాలను స్రవించడానికి ఉపయోగపడే హార్మోను పేరేమిటి?
  లాక్టోజనిక్ హార్మోను
- కాపర్ సల్ఫేట్ రంగు
  నీలం
- 'అక్షర సంక్రాంతి' పథకం దేనికి సంబంధించినది?
  అక్షరాస్యతను పెంపొందించడం
- మెదడును కప్పి ఉండే లోపలి పొర
  మృద్వి
- ఆంగ్లేయ విప్లవం ఏ సంవత్సరంలో సంభవించింది?
  1688

## సుప్రీంకోర్టు ఎప్పుడు అమల్లోకి వచ్చింది?



## ఐఎండబ్ల్యుఎఫ్‌లో కొత్తగూడెం నాయకులకు చోటు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఇండియన్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎండబ్ల్యుఎఫ్)లో సింగరేణి కాలరీస్ వర్కర్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) నాయకులకు చోటు దక్కింది. ఐఎండబ్ల్యుఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వాసిరెడ్డి సీతారామయ్య, సహాయకార్యదర్శిగా కొరిమి రాజ్ కుమార్, జాతీయ కౌన్సిల్ సభ్యులుగా వంగ వెంకట్, వీరస్వామి చోటు దక్కిన వారిలో ఉన్నారు. గురువారం ఒడిస్సా రాష్ట్రంలోని పూరీలో ఘనంగా ప్రారంభమైన 14వ ఐఎండబ్ల్యుఎఫ్ మహాసభ రెండో రోజు ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగింది. దేశంలోని వివిధ గనుల ప్రాంతాల నుండి కార్మిక ప్రతినిధులు, నాయకులు కార్మిక సమస్యలు, గనుల రంగ అభివృద్ధి కార్మిక హక్కుల పరిరక్షణపై విస్తృతంగా చర్చించారు. ఎన్నికైన ప్రతినిధులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికైన ప్రతినిధులు మాట్లాడుతూ గని కార్మిక సమస్యల పరిష్కారం కోసం, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాల అమలు, కార్మిక హక్కుల సాధన కోసం సంఘటిత పోరాటాలను మరింత బలోపేతం చేస్తామని హామీ ఇస్తూ భవిష్యత్‌లో మరింత సమర్థవంతంగా పనిచేస్తామన్నారు.

## వడదెబ్బకు గురికాకుండా కార్మికులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

ఎఐటియుసి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎండల తీవ్రత దృష్ట్యా సింగరేణి కార్మికులు వడదెబ్బకు గురికాకుంగా తగిన చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య కోరారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు మధ్యాహ్న వేళల్లో పనులు చేయనివ్వరాదని, వడదెబ్బకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో మాదిరిగా కాకుండా ప్రస్తుతం సరఫరా చేస్తున్న ఒఆర్ఎస్ ప్యాకెట్లలో నాణ్యత లేదని, నాణ్యమైన వాటిని సరఫరా చేయాలన్నారు. సింగరేణిలోని పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఏప్రిల్ 1 నుండి అమలు కావాల్సిన పెరిగిన డిఏ, ఇఎస్ఐ సర్క్యులర్లను యాజమాన్యం తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం కార్పొరేట్‌లోని సివిల్ విభాగం వద్ద కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య విజ్ఞప్తి మేరకు సిఅండ్ఎండి అంగీకరించిన ఫిబ్రవరి 12 నాటి నో వర్క్ నో పెనాల్టీ సర్క్యులర్‌ను ఇవ్వాలన్నారు. ప్రస్తుతం తీవ్రమైన ఎండల నేపథ్యంలో కాంట్రాక్ట్ కార్మికులు రోడ్లమీద మండుటెండలో పనులు చేస్తూ అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు మధ్యాహ్న వేళల్లో పనులు చేయనివ్వరాదని, వడదెబ్బకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో మాదిరిగా కాకుండా ప్రస్తుతం సరఫరా చేస్తున్న నాణ్యమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలని యర్రగాని కృష్ణయ్య అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఎస్.భాస్కర్, సునీల్, సంపత్, గణేష్, మహేందర్, శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న మోదీ ప్రభుత్వం



సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్

పెరిగిన ధరలపై 'ఆకలియుద్ధం' గీతం విడుదల

**ప్రజాపక్షం/మంచిర్యాల :** దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కట్టబెడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ విమర్శించారు. పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలపై తెలంగాణ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో రూపొందించిన ఆకలి యుద్ధం గీతం సిడిని గురువారం జరిగిన కార్యక్రమంలో కలవేన శంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజల జీవనం దుర్భరంగా మారుతున్న తరుణంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అప్పన్నంగా కట్టబెడుతోందని ఆయన విమర్శించారు. కుప్పర్తి రవి రచించిన ఈ గీతాన్ని రేగుంట చంద్రశేఖర్, బబ్బెర రాజేందర్, చొప్పదండి కిషన్, కొయ్యల లింగన్న గానం చేశారు. కార్యక్రమం తెలంగాణ ధూంధాం వ్యవస్థాపక అధ్యక్షులు అంతడుపుల నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ సమక్షంలో జరిగింది. పెరిగిన ధరలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యంగా ఈ గీతాన్ని రూపొందించినట్లు కళాకారులు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, మిరియాల రాజేశ్వర రావు, ప్రజానాట్య మండలి గౌరవ అధ్యక్షులు మిట్టపల్లి పౌల్, కొండూ జనార్ధన్, శంకరీ, బియ్యాలా ఉపేందర్, రామగిరి అర్జున్, గోడిసేల కృష్ణా, దుర్గం కృష్ణ, నీలాల శ్రీనివాస్, ఎల్తూరి పోచన్న, కొరల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

**ప్రజాపక్షం/చందంపేట :** నల్లగొండ జిల్లా చందంపేట మండలం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గుంటిపల్లి గేటు వద్ద ఉన్న వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద రైతుసంఘం, సిపిఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య మాట్లాడుతూ రైతులను ఇబ్బంది పెట్టకుండా ఐకెపి కేంద్ర నిర్వాహకులు వడ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత పది రోజుల నుండి కేంద్రాలకు వడ్లను తీసుకువచ్చి రాత్రింబవళ్లు నిద్రలేకుండా రైతులు కాపుకాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వడ్ల కొనుగోళ్లలో పూర్తిగా విఫలం అయిందని ఆయన ఆరోపించారు. నేటికి వడ్లు కొనుగోలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం రైతులను ఆందోళనకు గురిచేస్తుందన్నారు. అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని త్వరితగతిన కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన వడ్లను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. సిపిఐ రైతులకు ఎల్లవేళలా అండగా ఉండి పోరాడుతుందని తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన అన్నారు. ధర్నా కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి వెంగళయ్య, రైతు సంఘం జిల్లా మండల కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, శంకర్, హనుమంతు, పరమనాయక్ తదితరులు పాల్గొన్నారు.



# జనగణనలో కులగణనపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/వరంగల్ :** దేశ జన గణనలో కులగణన జరపాల్సిందేనని, వెనుకబడిన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు జరపాలంటే వారి సంఖ్య తెలియాల్సిందేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తరతరాలుగా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, అన్ని రంగాలలో తీరని అన్యాయానికి గురైన బిసిలకు తగిన న్యాయం జరగాలంటే వారి ఖచ్చితమైన జనాభా లెక్కలు తేలాలని, దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిలకు రాజ్యాంగపరమైన హక్కులు రావాలని అందుకోసం జన గణనలో కులగణన జరపాలని, బిసి సంఘాలు దేశవ్యాప్తంగా చేసిన పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు జనగణనలో కుల గణన కై విధానపరమైన నిర్ణయం తీసుకుందన్నారు. జనగణనలో కుల గణన చేపట్టవద్దని, గత సంవత్సరం గుమ్ముల సుధాకర్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేయగా సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం తీర్పునిచ్చిందన్నారు. దేశంలో వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలుసుకోవలసిన అవసరం ఏ ప్రభుత్వానికైనా ఉంటుందని, తెలిస్తేనే వారి సంక్షేమానికి ఏవిధమైన చర్యలు తీసుకోవాలో ప్రభుత్వం నిర్ణయించుకోగలుగుతుందని ప్రకటించి, కుల గణన చేయవద్దని వేసిన పిల్‌ను ధర్మాసనం కొట్టివేసిందన్నారు. ఈ తీర్పుతో నైనా బిసి వ్యతిరేక శక్తులకు జ్ఞానోదయం కలగాలన్నారు.

### సుప్రీం తీర్పు బిసిల విజయం

**నల్లబెల్లి :** జనాభా లెక్కలతో పాటు కులగణన చేయాలంటు బిసి కులాలు అనేక ఉధ్యమాలు చేసిన నేపథ్యంలో బుధవారం సుప్రీంకోర్టు బిసి కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేయడం బిసిల విజయమని వరంగల్ జిల్లా బిసి హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. గురువారం నల్లబెల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అగ్రవర్ణలకు 10 శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు కులగణన లేకుండానే అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం బిసిల విషయంలో మాత్రం నిర్లక్ష్య ధోరణి అవలంబించిందని అరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైన సుప్రీం కోర్టు తీర్పుకు కట్టుబడి కులగణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు .

## కల్లుగీత వృత్తిని కార్పొరేట్ శక్తులకు అప్పగించకుండా...

# సహకార సంఘాలతో అభివృద్ధి చేయాలి

తెలంగాణ గీత పనివారల సంఘం సమయన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన 'వృత్తి సంఘాల రౌండ్ టేండ్ సమావేశంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వివిధ దేశాల నుంచి తాటిచెట్లను సేకరించి పెంచిన ఎక్స్‌పీరియం పార్క్‌లో ఆదివారం నిర్వహించనున్న 'తాటికల్లు మేళా' హర్షించదగ్గ విషయమే అయినప్పటికీ కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి కల్లుగీత వృత్తిని అప్పగించే ఏ చర్యఅయినా చెడు సంకేతాలకు దారితీస్తుందని తెలంగాణ గీతపనివారల సంఘం సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం హెచ్చరించారు. గురువారం హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వృత్తి సంఘాల రౌండ్ టేండ్ సమావేశం పొలిటికల్ బిసి నాయకులు అయిలి వెంకన్న అధ్యక్షతన జరిగింది. సమావేశంలో నాగభూషణం మాట్లాడుతూ కల్లుగీత వృత్తిని సహకార సంఘాల ద్వారా అభివృద్ధిపరచడం సహేతుకం అన్నారు. ప్రభుత్వం గీత వృత్తిని అభివృద్ధిపర్చడం ద్వారా పరిశ్రమగా రూపొందించాలని, కల్లుగీత కార్పొరేషన్ అధిక బడ్జెట్‌ను కేటాయించి వృత్తి సంక్షేమ చర్యలు చేపట్టాలని కోరారు. స్వాతంత్ర్య సమయోధులు బొమ్మగాని ధర్మభిక్షం, గౌతు లచ్చన్న వంటి మహనీయులు కల్లు గీత వృత్తిలో హర్రాజ్ విధానానికి వ్యతిరేకంగా పోరాడి కల్లు గీత వృత్తిని సహకార వ్యవస్థలోకి తీసుకువచ్చేలా అవిశ్రాంత కృషి చేశారని, కల్లును నిషేధించాలని ప్రయత్నించిన ప్రభుత్వాలు, కార్పొరేట్ శక్తుల కుట్రలను భగ్నం చేసి గీత వృత్తిని నిలబెట్టారని, దీనిని కాపాడుకుని, అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నాగభూషణం అన్నారు. కల్లుగీత వృత్తిలో కార్పొరేట్ శక్తుల ప్రమేయం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన స్కిల్ యూనివర్సిటీలో గీత వృత్తిపై శిక్షణ, గీత పరిశ్రమ అభివృద్ధికి పరిశోధ, మార్కెటింగ్, ఉపాధి కోర్సులను ప్రారంభించాలని కోరారు. సమావేశంలో బాల్‌రాజ్‌గౌడ్, అంబాల నారాయణ గౌడ్, వట్టికూటి రామారావు గౌడ్, దుర్గయ్య గౌడ్, కనకమామిడి శ్రీశైలంగౌడ్ ప్రసంగిస్తూ కల్లుగీత వృత్తిని పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేయాలని డిమాండ్ చేశారు.



# యాదగిరిగుట్టలో వేదనాదం..

- దక్షిణాదిలోనే అతిపెద్ద వేద పాఠశాల ఏర్పాటు! ● రూ.43 కోట్ల వ్యయంతో 15 ఎకరాల్లో నిర్మాణం ● కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో 24 నెలల్లో అందుబాటులోకి.. ● రూ.243 కోట్ల ఆదాయంతో యాదాద్రి సరికొత్త రికార్డు!

ప్రజాపక్షం/యాదాద్రి




తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట ఆధ్యాత్మికంగానే కాకుండా, వైదిక విద్యా రంగంలోనూ సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి ఆలయ భూముల్లో రాబోయే రోజుల్లో వేదనాదం మారుమోగనుంది. దక్షిణాదిలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, రూ.43 కోట్ల అంచనా వ్యయంతో 15 ఎకరాల విస్తీర్ణంలో రాష్ట్రంలోనే అతిపెద్ద వేద పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య చొరవతో అడుగులు పడ్డాయి. శనివారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగనుంది. రానున్న 24 నెలల్లో (రెండు సంవత్సరాలు) ఈ పాఠశాలలో తరగతులు ప్రారంభం కానున్నాయి.

### కంచి పీఠం పర్యవేక్షణలో ప్రాచీన విద్యా వైభవం

ఈ వేద పాఠశాల నిర్వహణ బాధ్యతలను సుప్రసిద్ధ శ్రీ కాంచి కామకోటి పీఠం తీసుకోనుంది. విద్యాసంస్థకు సంబంధించిన పాఠ్యాంశాలను కూడా పీఠం పండితులే రూపొందిస్తారు. ఇది పూర్తిగా రెసిడెన్షియల్ పాఠశాల విధానంలో నడుస్తుంది.

### సకల సౌకర్యాలతో మాస్టర్ ప్లాన్

హైదరాబాద్కు చెందిన ఒక ప్రముఖ ఆర్కిటెక్చర్ సంస్థ ఈ పాఠశాల కోసం ఉచితంగా మాస్టర్ ప్లాన్ రూపొందించింది. సుమారు 300 మంది విద్యార్థులు ఇక్కడే ఉండి చదువుకునేలా వసతి గృహం (హాస్టల్) నిర్మిస్తున్నారు. ఈ ప్రాంగణంలో అత్యాధునిక లెక్చర్ హాల్తో పాటు గోశాల, యజ్ఞశాల, విశాలమైన వంటశాల, భద్రత కోసం సోలార్ ఫెన్సింగ్తో కూడిన ప్రహరీ గోడను నిర్మించనున్నారు. ఆలయాల ఆధ్వర్యంలో ఇది మూడోది రాష్ట్రంలో ఆలయాల నిధులతో నడుస్తున్న వేద పాఠశాలల్లో బాసర, వర్గల్ తర్వాత ఇది మూడోది కావడం విశేషం. ఇక్కడ చేరే విద్యార్థులు నాలుగు వేదాలైన ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలతో పాటు ఆలయ పూజా విధానాలకు సంబంధించిన 'ఆగమ శాస్త్రాలను' అభ్యసిస్తారు. వేద పండిత కోర్సు కనీసం 7 సంవత్సరాలు, అర్చక కోర్సు 5 సంవత్సరాలు, ఇక్కడ 10 సంవత్సరాల అధ్యయనాన్ని సాధారణ డిగ్రీతో, 12 సంవత్సరాల అధ్యయనాన్ని పీజీ విద్యార్హతతో సమానంగా గుర్తిస్తారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు దేశవ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ ఆలయాల్లో వేద పండితులుగా, అర్చకులుగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

### ఏటేటా పెరుగుతున్న ఆదాయం

**2014 (రాష్ట్ర ఏర్పాటు సమయం):** రూ. 61 కోట్లు
**2022–23:** రూ. 169 కోట్లు
**2023–24:** రూ. 224 కోట్లు
**2024–25:** రూ. 212 కోట్లు
**ప్రస్తుతం:** రూ.243 కోట్లు (దాదాపు నాలుగు రెట్లు వృద్ధి)

### ఆదాయంలోనూ 'లక్ష్మీ' కటాక్షం..

ఒకవైపు ఆధ్యాత్మిక విద్యా కేంద్రంగా మారుతూనే, మరోవైపు యాదాద్రి క్షేత్రం భక్తుల రాకలో, ఆదాయంలో సరికొత్త మైలురాళ్లను అందుకుంటోంది. గడిచిన 12 ఏళ్ల క్రితం జరిగిన ఆలయ పునర్నిర్మాణ అద్భుతం ఇప్పుడు భక్తుల రద్దీ రూపంలో కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆలయ వార్షిక ఆదాయం రికార్డు స్థాయిలో రూ. 243 కోట్లకు చేరింది. తెలంగాణ రాష్ట్రంలో రూ. 200 కోట్లకు పైగా వార్షిక ఆదాయం కలిగిన ఏకైక ఆలయంగా యాదాద్రి అగ్రస్థానంలో నిలిచింది.

### ఏటా కోటి మందికి పైగా దర్శనాలు!

ఆలయంలో కల్పించిన మెరుగైన వసతులు, రవాణా సౌకర్యాల వల్ల భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఆలయ ఈవో భవాని శంకర్ తెలిపారు. 2014లో ఏడాదికి 86 లక్షలుగా ఉన్న భక్తుల సంఖ్య, ప్రస్తుతం 1.02 కోట్లకు పైగా పెరిగింది. సాధారణ రోజుల్లో ప్రతిరోజూ 25,000 మంది భక్తులు, వారాంతాల్లో (శని, ఆదివారాలు): 50,000 మంది భక్తులు, ప్రత్యేక దినాల్లో (స్వాతి నక్షత్రం): ఏకంగా 75,000 మంది వరకు స్వామివారిని దర్శించుకుంటున్నారు. యాదగిరి లక్ష్మీ నరసింహుడి క్షేత్రం ఇకపై అటు భక్తికి, ఇటు వైదిక విద్యకు దేశంలోనే ఒక పెద్ద దిక్సూచిగా మారబోతోంది

## రాష్ట్రంలో స్వేచ్ఛాయుత నిరసనలకు అవకాశం కల్పించిందే కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా స్వేచ్ఛాయుత నిరసనలకు అవకాశం కల్పించింది సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని బిఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ గుర్తుంచుకోవాలని ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. గురువారం సిఎల్పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గతంలో బిఎస్పి రాష్ట్ర అధ్యక్షుడు గా ఉన్నప్పుడు తెలంగాణ శాంతిభద్రతలు, పోలీసు వ్యవస్థ, అప్పటి ప్రభుత్వంపై చేస్తున్న వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలను విస్మరించి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇప్పుడు మాట్లాడుతున్నారని విమర్శించారు. బండి భగీరథ్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాతే బిఆర్ఎస్ స్పందించిందని, అయితే ఆ అంశాన్ని తామే వెలుగులోకి తీసుకొచ్చినట్లు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడటం సరైంది కాదన్నారు. మాజీ ఐపీఎస్ అధికారి అయిన ఆయన చట్టపరమైన ప్రక్రియలను తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. ఫోక్సో కేసుల్లో స్టేషన్ బెయిల్ అనే అంశమే ఉండదని వ్యాఖ్యానించారు. కలుగుతోందన్నారు.తెలంగాణ సమాజానికి తప్పుడు సంకేతాలు వెళ్లేలా వ్యాఖ్యలు చేయకుండా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వేముల వీరేశం సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతాం: కోదండరామ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విలువలతో కూడిన రాజకీయం,ప్రజాస్వామ్య పరిరక్షణ,సామాజిక న్యాయం టిజెఎస్ ప్రధాన లక్ష్యాలని ఆ పార్టీ అధ్యక్షుడు, ఎంఎల్సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామన్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు బాస రమేష్ యాదవ్ కోదండరామ్ సమక్షంలో హైదరాబాద్లోని టిజెఎస్ రాష్ట్ర కార్యాలయంలో టిజెఎస్లో గురువారం చేరారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ప్రస్తుతం డబ్బు కేంద్రంగా సాగుతున్న రాజకీయాల మధ్య ప్రజల ఆకాంక్షలే అజెండాగా టిజెఎస్ పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు కంతి మోహన్ రెడ్డి, బైరి రమేష్, చుక్క గంగారెడ్డి, దార సత్యం, దేశపాక శ్రీనివాస్, హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పుతోనైనా కేంద్రం ఒబిసి కుటుంబాలను లెక్కించాలి

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా చేపట్టిన జనగణనలో బిసి కులాల లెక్కలను సేకరించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం అభినందనీయమని, సుప్రీంకోర్టు తీర్పుతో నైనా కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి బిసి కులగణన ప్రక్రియను ప్రారంభించారని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్లోని బిసి భవన్లో గురువారం కుందారం గణేష్ చారి అధ్యక్షతన జరిగిన బిసి కుల సంఘాల సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గల్లి నుండి ఢిల్లీ వరకు దేశవ్యాప్తంగా జరిగే జాతి జనగణనలో బిసి కులగనన చేపట్టాలని దశాబ్దాలుగా తాము చేస్తున్న పోరాటం సుప్రీంకోర్టు తీర్పుతో తుది దశకు చేరిందని, కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు తోనైనా కళ్ళు తెరిచి ఇప్పటికైనా బిసి కుటుంబాలను ప్రత్యేకంగా లెక్కించాలని ఆయన డిమాండ్ చేశారు. బిసిల పక్షాన నిలబడినందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ త్రిసభ్య ధర్మాసనానికి బిసిల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అతి త్వరలోనే ఢిల్లీలో బిసి సంఘాల సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బిసి సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, ప్రొఫెసర్ మల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి ఎన్నికల్లో ఐఎన్టియుసికి టిఎన్జిఒస్ మద్దతు

కార్మికుల పక్షాన నిరంతర పోరాటం: జలమండలి (ఇయు) అధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్టియుసి అనుబంధం)కు జలమండలి ఎన్నికల్లో టిఎన్జిఓఎస్ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. జూన్ 6న జరగనున్న జలమండలి ఎన్నికల్లో (ఇయు)ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టిఎన్జిఓఎస్ నేతలు పిలుపునిచ్చారు. ఎన్నికల విషయంపై హైదరాబాద్ నాంపల్లి టిఎన్జిఓఎస్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఐఎన్టియుసి , టిఎన్జిఓఎస్ నేతల మధ్య చర్చలు జరిగాయి. సమావేశంలో టిఎన్జిఓఎస్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, నగర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, విక్రమ్తో పాటు మొగుళ్ళ రాజిరెడ్డి, ఐఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి.చంద్రశేఖర్, వై.నాగన్నగౌడ్, అదిల్ షరీఫ్, యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం మారం జగదీశ్వర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా ఐఎన్టియుసి కృషి చేస్తున్న నేపథ్యంలో జలమండలి ఎంప్లాయిస్ యూనియన్కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ముజీబ్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే టిఎన్జిఓఎస్ లక్ష్యమని, కార్మికుల సమస్యలపై ఐఎన్టియుసి పోరాడుతున్నందునే వారికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ కార్మికులకు అండగా నిలబడి, ఇక ముందు వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు ఇ.చంద్రశేఖర్, బి.జైరాజ్, బి.శంకర్ ప్రకాష్, సైద్ హోసిం, ఇందూరి తిరుపతి, గౌస్ పాషా, బి.అశోక్, నరసింహారెడ్డి, సిహెచ్. ప్రవీణ్ కుమార్, బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## రౌల్ కాస్ట్రోపై అమెరికా అభియోగాలను ఖండించిన సిపిఐ




**న్యూఢిల్లీ :** క్యూబా విప్లవ నాయకుడు రౌల్ కాస్ట్రోపై అమెరికా అధికారులు ప్రారంభించిన దారుణమైన, రాజకీయ ప్రేరేపిత అభియోగాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం గురువారం ఇక్కడొక ప్రకటన విడుదల చేసింది. ఈ చర్య సోషలిస్ట్ క్యూబా సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడం, దాని రాజకీయ వ్యవస్థను అస్థిరపరచడం, క్యూబా విప్లవాన్ని దృఢంగా సమర్థించిన వారిని భయపెట్టడం లక్ష్యంగా వరుస అమెరికా ప్రభుత్వాలు ఆ దేశంపై కొనసాగిస్తున్న శతృపూరిత వైఖరికి మరో నిదర్శనమని సిపిఐ అభిప్రాయపడింది. దశాబ్దాలుగా కొనసాగుతోన్న సామ్రాజ్యవాద దురాక్రమణ, దిగ్బంధనం, బలవంతాన్ని ఎదుర్కొని క్యూబా ప్రజల గౌరవం, స్వాతంత్ర్యం, సామాజిక విజయాలను కాపాడే విషయంలో రౌల్ కాస్ట్రో, క్యూబా చారిత్రక నాయకత్వంతో కలిసి ఒక నిర్ణయాత్మక పాత్రను పోషించారని ప్రశంసించింది. క్యూబా ప్రజలకు, ప్రభుత్వానికి సిపిఐ తన గట్టి సంఘీభావాన్ని తెలిపింది. సార్వభౌమ దేశాల అంతర్గత వ్యవహారాలలో ఇటువంటి రాజకీయ కక్షసాధింపు చర్యలను, జోక్యాన్ని వ్యతిరేకించాలని ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య, ప్రగతిశీల, శాంతిప్రియ శక్తులకు భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. అమెరికా విధించిన అన్యాయమైన దిగ్బంధనం కారణంగా క్యూబా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న తరుణంలో ఇటువంటి రెచ్చగొట్టే చర్యలు, ఉద్రిక్తతలను మరింత పెంచి అంతర్జాతీయ చట్టాల సూత్రాలను, శాంతియుత సహజీవనాన్ని ఉల్లంఘిస్తాయని సిపిఐ ఆందోళన వ్యక్తపరిచింది. బయటి వత్తిడి లేకుండా తన మార్గాన్ని తానే నిర్ణయించుకునే క్యూబా హక్కుకు సిపిఐ తన గట్టి మద్దతును ప్రకటిస్తూ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జాతీయ సార్వభౌమాధికారం కోసం రౌల్ కాస్ట్రో, క్యూబా ప్రజలు చేస్తున్న పోరాటానికి సిపిఐ తన సంఘీభావాన్ని పునరుద్ఘాటించింది.

## జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి 21 మందికి ఆర్థిక సహాయం

తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి 21 మందికి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్టు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్, నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి కార్యాలయంలోని కాన్ఫరెన్స్హాల్లో 'జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ' 5వ సమావేశం కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఆర్థిక సహాయం కోసం వచ్చిన 29 దరఖాస్తులను కమిటీ సభ్యులు పరిశీలించారు. ఇందులో 17 మంది మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు, అలాగే తీవ్ర ప్రమాదాలకు గురైన, దీర్ఘకాలికంగా అనారోగ్యం బారిన పడిన నలుగురు జర్నలిస్టులకు జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ ఆర్థిక సహాయం మంజూరు చేసింది. ఎంపికైన 17 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం, అలాగే ఆయా కుటుంబాలకు ప్రతి నెలా మూడు వేల రూపాయల చొప్పున పెన్షన్ ఐదు సంవత్సరాల పాటు అందజేస్తామని శ్రీనివాస్ రెడ్డి వివరించారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలలో ఎల్.కె.జి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు ఒక వెయ్యి రూపాయల చొప్పున ట్యూషన్ ఫీజును, నలుగురు అనారోగ్యం బారిన పడిన వర్కింగ్ జర్నలిస్టులకు జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కమిటీ సమావేశంలో సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ డి.ఎస్. జగన్,తెలంగాణ రాష్ట్ర మీడి యా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణ చందర్ రావు, మేనేజర్ డి.ఆర్.ఎస్. శైలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'టూరిజం ప్రమోషన్‌తో పాటు యువతలో సామాజిక బాధ్యత పెంచాలి'

- తెలంగాణకు డిజిటల్ బ్రాండ్ ఇమేజ్ ప్రభుత్వ లక్ష్యం ● పర్యాటక ప్రచారానికి ఇన్ఫ్లుయెన్సరు ముందుకు రావాలి ● పర్యాటక శాఖ మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పర్యాటక రంగాన్ని డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు కీలక భాగస్వాములని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. అయితే పర్యాటక ప్రచారంతోనే పరిమితం కాకుండా డ్రగ్స్, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ వంటి సామాజిక సమస్యలపై యువతలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 99 రోజుల కార్యాచరణకు అనుసంధానంగా హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో నిర్వహించిన 'తెలంగాణ పర్యాటక క్రియేటర్ల సమావేశం'లో మంత్రి మాట్లాడారు. తెలంగాణ ప్రకృతి అందాలు, చారిత్రక వారసత్వం, సంస్కృతి సంపదను డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రపంచానికి చేరవేయాలని సూచించారు. పర్యాటక రంగం కేవలం విహార యాత్రలకు మాత్రమే పరిమితం కాదని, అది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాల సృష్టికి కీలక శక్తిగా మారుతుందని మంత్రి అన్నారు. పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, స్వచ్ఛత, ఆధునిక టెంట్ వసతులు, వినియోగంలో లేని పర్యాటక ఆస్తులను ఆదాయ వనరులుగా మార్చే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం, ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ ప్రభావాలపై ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి.. ఇన్ఫ్లుయెన్సర్లు తమ కంటెంట్ ద్వారా సామాజిక బాధ్యతను చాటాలని కోరారు. ఈ దిశగా ప్రభుత్వం త్వరలో 'ప్రభాత భేరి' పేరుతో సామాజిక చైతన్య కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. లఘు చిత్రాలు, నాటికలు, కళారూపాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచే కార్యాచరణ చేపడతామని చెప్పారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగస్వాములయ్యే ఉత్తమ టూరిజం క్రియేటర్లకు ప్రభుత్వం తరఫున అవార్డులు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తామని మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ నూతన మెటా ఖాతా, అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌ను కూడా ఆవిష్కరించారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా క్రీడా దినోత్సవం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ , యూత్ వారోత్సవాలు కార్యక్రమాల్లో భాగంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా క్రీడా దినోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్లు , అధికార యంత్రాంగం పర్యవేక్షణలో జిల్లా యువజ , క్రీడాశాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు విజయవంతంగా జరిగాయి. రాష్ట్ర స్థాయి ప్రధాన ఉత్సవాలు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా, యువత, క్రీడాకారులు, తల్లిదండ్రులు, ప్రజల నుండి విశేష స్పందన లభించింది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జంట నగరాల్లోని గచ్చిబౌలి జిఎంసిబి స్టేడియం, కెవిబిఆర్ ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడి యం, జింఖానా గ్రౌండ్స్, సైక్లింగ్ వెలోడ్రోమ్ తదితర క్రీడా వేదికల్లో ఇంటర్ స్టేడియా కాంపిటీషన్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఫెన్సింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, ఫుట్‌బా ల్, చెస్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, రెజ్లింగ్ తదితర క్రీడాంశాల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్ట ర్ ఏ. సోనీ బాలాదేవి ఈ పోటీలను స్వయంగా పర్యవేక్షించారు. ఆమె వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొంటున్న క్రీడాకారులను కలుసుకుని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల వారు, అన్ని వయస్సుల వారు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకునేలా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తోందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు రవితేజ, సుజాత, శ్రీనివాస్, స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు రవికుమార్, రాజ్‌వీర్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై.. 'రియాక్టివ్' నుంచి 'ప్రోయాక్టివ్' వ్యూహం

ఢిల్లీలో ఉన్నతస్థాయి సమీక్షలో కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేరాలపై 'రియాక్టివ్' విధానం నుంచి 'ప్రోయాక్టివ్' వ్యూహానికి కేంద్రం అడుగు లు వేస్తోందని కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. టెలికాం మౌలిక సదుపాయాలను అడ్డుపెట్టుకుని అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సైబర్ మోసాలను జరిగిన తర్వాత కాకుండా.. జరగకముందే గుర్తించి అడ్డుకునే విధంగా వ్యవస్థాగత మార్పులు తీసుకురావడంపై కేంద్రం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ గురువారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో కేంద్ర టెలికాం శాఖ (డిఒటి) ఉన్నతాధికారులతో పాటు హైదరాబాద్ పో లీస్ కమిషనర్ విసి సజ్జనర్, ఐపిఎస్ అధికారులు పాల్గొన్నా రు. ముఖ్యంగా హైదరాబాద్ పోలీసులు ఇటీవల అమలు చేసిన 'ఆపరేషన్ ఆక్టోపస్ 3.0'పై విస్తృతంగా చర్చించారు. వేల సంఖ్యలో 'ఘోస్ట్ సిమ్' కార్డుల నెట్‌వర్క్‌ను ఛేదించడంలో పోలీసులు ప్రదర్శించిన అప్రమత్తత, సాంకేతిక నైపుణ్యాన్ని కేంద్ర మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో సైబర్ నేరాల నిరోధానికి సంబంధించి కీలక అం శాలపై చర్చ జరిగింది. కేవలం ఫిర్యాదులు వచ్చిన తర్వాత చర్యలు తీసుకోవడం కాకుండా, ముందస్తు సమాచార సేకరణ ఆధారంగా నేరాలను అరికట్టే 'ఇంటెలిజెన్స్ లెడ్ ఎన్‌ఫోర్స్‌మెంట్' విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. అలాగే టెలికాం శాఖ, పోలీసు, దర్యాప్తు సంస్థల మధ్య సమాచార మార్పిడిని మరింత వేగవంతం చేసి మోసగాళ్ల నెట్‌వర్క్‌లను ప్రారంభ దశలోనే కట్టడి చేయాలని అభిప్రాయపడ్డారు. సాంకేతిక వ్యవస్థలు ప్రజల భద్రత, సేవల మెరుగుదలకు ఉపయోగపడాలని, అవి నేరాలకు వేదికగా మారకుం డా నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. సైబర్ భద్రత విషయంలో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. టెలికాం శాఖ–పోలీసు విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత పెంపొందించడం,పౌరుల ఆర్థిక, వ్యక్తిగత భద్రత కోసం ముందస్తు నివారణ యంత్రాంగాల ఏర్పాటు, నకిలీ సిమ్ కార్డుల చలామణి, టెలికాం నెట్‌వర్క్‌ల దుర్వినియోగం పై కఠిన చర్యలు, మూల స్థాయిలోనే సైబర్ నేరాలను అడ్డుకునే నియంత్రణ వ్యవస్థల బలోపేతం చేయాలని నిర్ణయించారు.

## ఆరు నెలల్లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయాలి:శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ అంశంపైన కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లుగా కేవలం సమీక్షలకే పరిమితమైందని బిఆర్ఎస్ మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుతోనే తమ బతుకులు ముడిపడ్డాయన్నారు. నార్లాపూర్,ఏదుల రిజర్వాయర్లు 95 శాతం పూర్తయ్యాయని, బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కాలువల పనులను దాదాపు 98 శాతం పూర్తి చేశామని వివరించారు. వచ్చే ఆరు నెలల్లో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంఎల్‌ఎ అంజయ్య యాదవ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పాలమూరురంగారెడ్డిలో ఐదు రిజర్వాయర్లను పూర్తి చేశామన్నారు. మాజీ ఎంఎల్‌ఎ బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు దాదాపు పూర్తయిందన్నారు.

## సరస్వతి పుష్కరాలకు టిజిఎస్‌ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు : ఎండి వై.నాగిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు సంస్థ వైస్ చైర్మన్, ఎండి వై.నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మే 21వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. పవిత్ర పుష్కర స్నానాలు ఆచరించేందుకు కాళేశ్వరానికి వెళ్లే భక్తులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా, వారి ప్రయాణం సురక్షితంగా, సుఖవంతంగా సాగేలా అధునాతన బస్సులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. భక్తుల రద్దీతో పాటు వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల నుండి కాళేశ్వరానికి ఈ ప్రత్యేక బస్సులు నడపబడుతున్నాయని ఎండి స్పష్టం చేశారు. హైదరాబాద్, నర్సంపేట, తొర్రురు, భూపాలపల్లి, మణుగూరు, కరీంనగర్, మంథని, హన్మకొండ, మహబూబాబాద్, జనగాం, పరకాల, నిజామాబాద్, గోదావరిఖని, మంచిర్యాల వంటి ముఖ్య ప్రాంతాల నుండి నేరుగా కాళేశ్వరానికి బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. పుష్కరాలకు వెళ్లే ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ల కొరకు టిజిఎస్‌ఆర్‌టిసి అధికారిక వెబ్‌సైట్ www.tgsrtcbus.in ద్వారా తమ టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చని సంస్థ పేర్కొంది.

## జనగణనపై సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/దుండిగల్:** కుత్బుల్లాపూర్ జోన్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, ఐఏఎస్ దుండిగల్ సర్కిల్‌ను సందర్శించి, జనగణన కార్యక్రమంపై అన్ని నోడల్ అధికారులు మరియు సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడం, పర్యవేక్షణను కట్టుదిట్టం చేయడం, సమాచారం



సక్రమంగా నమోదు చేయడం వంటి అంశాలపై అవసరమైన సూచనలు జారీ చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ ఫీల్డ్ స్థాయిలో తనిఖీలు నిర్వహించి, ఎన్యూమరేషన్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. సర్వే పనులు ఖచ్చితత్వంతో, సమర్థవంతంగా జరుగుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించి, సిబ్బందికి తగిన మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్, ఎఎంసి లక్ష్మయ్య, ఎసిబి శ్రీనివాస్, డివైఇఇ అన్వేష్ రెడ్డి, ఎఇ సురేందర్ నాయక్, సెన్సస్ సూపర్వైజర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలపై భారం మోపుతున్న మోదీ: సత్యం శ్రీరంగం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం విమర్శించారు. గురువారం గాంధీ భవన్‌లో నిర్వహించిన ప్రతికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూపీఏ హయాంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు అధికంగా ఉన్నప్పటికీ ప్రజలపై భారం మోపలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినా, కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలు, సెస్సుల పేరుతో ప్రజలను దోచుకుంటోందని ఆరోపించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న రాష్ట్రాల్లో పాలన అద్భుతంగా సాగుతోందని, దేశం వికసిత్ భారత్ వైపు దూసుకెళ్తుందని ప్రచారం చేశారని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలు, కేంద్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందని ప్రచారం చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. దేశ ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించే బాధ్యత ప్రభుత్వానిదేనని, అయితే ఆ భారాన్ని దేశభక్తి పేరుతో సామాన్య ప్రజలపై మోపడం దురదృష్టకరమని అన్నారు. ఇప్పటికే రూపాయి విలువ రికార్డు స్థాయిలో పడిపోతూ డాలర్‌తో పోలిస్తే రూ.96.90దాటిందని, రూపాయి విలువ వందకు చేరువలో వెళ్లే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గంలో దివంగత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కెపిహెచ్‌బి కాలనీ మలేషియా టౌన్‌షిప్ సర్కిల్‌తో పాటు బాలానగర్ చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహాలకు ఆయన స్థానిక నాయకులతో కలిసి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశ ప్రధానిగా చేసిన సేవలను కొనియాడారు. దేశంలో సంస్కరణల రంగంలోనూ, ఐటి రంగంలోనూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. పేద ప్రజల అభివృద్ధే కాంగ్రెస్ పాలన లక్ష్యమని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, మైనార్టీ నాయకులు, ఎస్సీ సెల్, బిసిసెల్, సేవాదళ్ నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

**పెద్దేముల్‌లో:** దేశ ప్రధానిగా దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరువలేనివని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన పెద్దేముల్‌లో గురువారం మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ డిపార్ట్ మెంట్ రాష్ట్ర కన్వీనర్ ఎండి రియాజ్, డిసిసి ఉపాధ్యక్షురాలు శోభరాణి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సిఎను బిసిసిఐ

# తక్షణమే స్వాధీనం చేసుకోవాలి

### టిసిఎ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ ప్రస్తుత పాలకవర్గాన్ని తక్షణమే సస్పెండ చేసి, రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ), ప్రధాన కార్యదర్శి ధారం గురువ రెడ్డి నాయకత్వంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ)కి ఒక నివేదికను గురువారం సమర్పించింది. హెచ్‌సిఎలో 'పాలనా వ్యవస్థ పూర్తిగా పతనమైందని, క్రికెట్ పరిపాలనలోకి నేరస్థులు చొరబడ్డారని, భారతీయ క్రికెట్ సమగ్రతకు ముప్పు కలిగించే ప్రమాదకరమైన ఆర్థిక కుట్ర జరుగుతోందని' టిసిఎ తన నివేధికలో పేర్కొంది. బిసిసిఐ రాజ్యాంగ నిబంధనలు 3(బి), 3(సి), 23, 25, 26, 28, 30 31లను ప్రస్తావిస్తూ... ప్రతిపాదిత టిజి20 లీగ్‌ను తక్షణమే నిలిపివేయాలని, అనధికారిక ఫ్రాంచైజీల ఏర్పాటు కార్యకలాపాలను సస్పెండ చేయాలని, గతంలో జమ్మూ కాశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ వ్యవహారంలో జోక్యం చేసుకున్న తరహాలోనే ఇక్కడ కూడా ముగ్గురు సభ్యులతో కూడిన స్వతంత్ర కమిటీని నియమించాలని టిసిఎబిసిసిఐని కోరింది. ఆర్థిక మోసాలు, నమ్మక ద్రోహం వంటి తీవ్రమైన ఆరోపణలపై క్రైమ్ నెం. 02/2025 కింద జరుగుతున్న సిఐడి విచారణను టిసిఎ తన ఫిర్యాదులో ప్రముఖంగా ప్రస్తావించింది. ఈ కేసులోనే 09 జూలై 2025న అప్పటి హెచ్‌సీఏ అధ్యక్షుడు ఎ. జగన్ మోహన్ రావుతో సహా పలువురిని అరెస్ట్ చేసినట్లు పేర్కొంది. సుప్రీంకోర్టు ఆమోదించిన బిసిసిఐ రాజ్యాంగం ప్రకారం ప్రస్తుత అపెక్స్ కౌన్సిల్ స్వయం ప్రకటిత గవర్నింగ్ కౌన్సిల్‌కు



ఎలాంటి చెల్లుబాటు అయ్యే ప్రజాస్వామ్య బలం లేదని, అందువల్ల అవి 'చట్టవిరుద్ధం మరియు మొదటికే చెల్లవు' అని టిసిఎ స్పష్టం చేసింది. మార్చి 2026 లో జరిగిన హెచ్‌సిఎ ఎన్నికలపై కూడా ఈ నివేదిక తీవ్రమైన ఆరోపణలు చేసింది. ఎమ్. జీవన్ రెడ్డి గౌరవ కార్యదర్శిగా 'ముందుగా అనుకున్న ప్రకారం ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం', ఆ తర్వాత మిస్టర్ అగం రావును స్వయం ప్రకటిత గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్‌గా నియమించడాన్ని టిసిఎ తప్పుబట్టింది. ఫోర్జరీ, వంచన, కుట్ర మరియు ఓటర్ల తారుమారు వంటి ప్రాథమిక నేరాలు జరిగినట్లు ఆధారాలు ఉన్నందున, 2018–2026 మధ్య కాలానికి సంబంధించిన హెచ్‌సీఏ సభ్యత్వ మరియు ఎన్నికల రికార్డులన్నింటినీ ఫోరెన్సిక్ ల్యాబ్ ద్వారా స్వాధీనం చేసుకుని తనిఖీ చేయాలని టిసిఎ డిమాండ్ చేసింది.

## బంగారు పతకం సాధించిన జశ్వంత్ కుమార్‌కు పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ అభినందనలు



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** వెంకటేశ్వరనగర్ డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీకి చెందిన ప్రసాద్ రావు తనయుడు ఎం.జశ్వంత్ కుమార్ ఇటీవల మలేసియా కౌలాలంపూర్‌లో జరిగిన అంతర్జాతీయ యోగాసన ఛాంపియన్‌షిప్2026లో బంగారు పతకం సాధించి ప్రతిభ చాటారు. 11వ అంతర్జాతీయ మెగా ఫెడరేషన్, మలేషియా యోగ కల్చరల్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 19వరకు నిర్వహించిన ఈ పోటీల్లో జశ్వంత్ కుమార్ విజయం సాధించడంతో పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ శాలువాతో సత్కరించి అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం గొప్ప విషయమన్నారు. మన ప్రాంతానికి చెందిన యువకుడు ఈ స్థాయిలో ప్రతిభ కనబరచడం గర్వకారణమని, జశ్వంత్ కుమార్ ఇతర యువతకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి, వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహిస్తే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జశ్వంత్‌కుమార్ తండ్రి ప్రసాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ వెంటనే చేసుకోవాలి

### మండల వ్యవసాయ అధికారి జ్యోతి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబుపేట మండలంలోని రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా వెంటనే పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతి సూచించారు.గురువారం గుబ్బడి ఫత్తేపూర్ గ్రామంలో రైతులను కలిసి ఫార్మా రిజిస్ట్రేషన్ చేయించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతుల భూముల వివరాలు, పంటల నమోదు, సాగు సమాచారం ప్రభుత్వ రికార్డుల్లో నమోదు కావడానికి ఈ రిజిస్ట్రేషన్ ఎంతో కీలకమని తెలిపారు. రైతు భరోసా, పంటబీమా, సబ్సిడీలు, విత్తనాలు, ఎరువుల పంపిణీ వంటి పథకాల





లబ్ధి పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అవసరమని పేర్కొన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, మొబైల్ నంబర్ తదితర పత్రాలతో సమీప రైతు వేదికలు లేదా వ్యవసాయ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు. ఈ నెల చివరి తేదీవరకు వేచి చూడకుండా ముందుగానే నమోదు చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాయన్న, ఉపసర్పంచ్ షేక్ అక్బర్, వ్యవసాయ శాఖ సిబ్బంది ఏఈఈ ఆదిల్, వార్డు సభ్యులు శ్రీలత, జగదీష్, వరలక్ష్మి, నిర్మల, రాంచంద్రయ్య, శ్రీల త, శివారెడ్డి, రైతు సమన్వయ సమితి సభ్యులు, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పోస్టాఫీస్‌లో ఆధార్ కేంద్రం ప్రారంభం

### పోస్టల్ అధికారి సంపత్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** శామీర్‌పేటలోని భారత తపాల శాఖ కార్యాలయం లో ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించామని ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ అధికారి సంపత్‌రెడ్డి కోరారు. గురువారం శామీర్‌పేటలో భారత ప్రభుత్వం తపాల శాఖ ఆధ్వర్యంలో శామీర్‌పేట గ్రామంలో గల సబ్ పోస్టాఫీస్ నందు ప్రజల సౌకర్యార్థం ఆధార్ నమోదు, అప్డేట్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాల కార్యాలయంలో కొత్త ఆధార్ నమోదు, మొబైల్ నెంబర్ అప్డేట్, చిరునామా మార్పు, పేరు. పుట్టినతేది, ఫోటో అప్డేట్, బయోమెట్రిక్ అప్డేట్ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆధార్‌కార్డులో పేరు మార్పు కొరకు పదవ తరగతి మెమో సర్టిఫికెట్, పుట్టినతేది సర్టిఫికెట్, రాజపత్రం, పాస్‌పోర్టు కావాలన్నారు. చిరునామా ధృవీకరణకు గ్యాస్ బిల్, బ్యాంక్ పాస్‌బుక్, లేదా రేషన్‌కార్డు ఉండాలన్నారు. పుట్టినతేదీ ధృవీకరణకు బర్త్ సర్టిఫికెట్, 10వ మార్కుల సర్టిఫికెట్, పాస్‌పోర్టు కలిగి ఉండాలని చెప్పారు. చిన్న పిల్లలకు తల్లిదండ్రుల ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్ తల్లిందండ్రుల ఆధార్‌లో ఉన్నట్లుగా పేరు, చిరునామా, బర్త్ సర్టిఫికెట్‌లో ఉండాలన్నారు. అలాగే 5 సంవత్సరాల లోపు పిల్లలకు బయోమెట్రిక్ అవసరం లేదన్నారు. అన్ని అప్డేట్‌లకు రుసుము నిబంధనల ప్రకారం ఉంటుందన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్‌లు తప్పనిసరిగా తీసుకురావాలని చెప్పారు. మరిన్ని వివరాలకు శామీర్‌పేట సబ్‌పోస్టాఫీస్ అధికారిని సంప్రదించాలని సూచించారు.

## అన్నదాత ఆవేదనపై బిజెపి గళం

### ధాన్యం కొనుగోళ్లపై ధర్నా

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** రైతులు పండించిన వడ్లను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించి రైతుల సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడంలో ఆలస్యం చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

వర్షాలు, ఎండలు తట్టుకుని పండించిన ధాన్యం కొనుగోలు కాక గోదాముల వద్దనే నిల్వ ఉండిపోవడంతో రైతులు ఆందోళనకు గురువుతున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించి వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు కొమ్మిడి శోభరెడ్డి, ప్రధాన కార్యదర్శి చెల్లక శ్రీధర్, కొమ్మిడి విక్రాంత్ రెడ్డి, సురువు, అనిల్ గౌడ్, మధుపూదన్ రెడ్డి, కొమ్మిడి దామోదర్ రెడ్డి, కట్ట మధుపూదన్ రెడ్డి, చలపతిరావు, మమత శర్మ, తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనికి 10లోపు పనిచేసి వెళ్లండి : కలెక్టర్ దీపక్‌తివారీ

**ప్రజాపక్షం/వికారాబాద్‌రూరల్ :** జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనికి 10లోపు పని చేసివెళ్లండి అని వికారాబాద్ జిల్లా కలెక్టర్ సూచించారు. వికారాబాద్ మండల పరిధిలోని పులుమద్ది గ్రామంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. అక్కడ పనిచేస్తున్న ఉపాధిహామీ కార్మికులను కలిసి వారికి జాగ్రత్తలు తెలిపారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉదయం 5.30నుండి 10గంటల లోపు పని చేసుకొని ఇళ్లకు తిరిగి వెళ్లాలని సూచించారు. జాబ్ కార్డు లేని వారికి వెంటనే ఉపాధి కల్పించేటట్లు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఆర్‌డిఓ సత్తయ్య, జెడ్పి సిఇఒ సుధీర్, సర్పంచ్ శ్వేత,మ ఎంపిడిఒ వినయ్‌కుమార్, తదిరులు పాల్గొన్నారు.



## అలియాబాద్ మున్సిపాలిటీలో సిసి రోడ్డుకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** అలియాబాద్ మున్సిపాలిటిలో అభివృద్ధి పనుల్లో భాగంగా సిసి రోడ్డు పనులకు అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి గురువారం భూమిపూజ చేశారు. అలియాబాద్ మున్సిపల్ 18వ వార్డులో మున్సిపల్ నిధులతో ఆ వార్డు కౌన్సిలర్ గూదె వెంకటేష్‌తో కలిసి సిసి రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపల్‌లోని అన్ని వార్డుల్లో దశలవారీగా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతామని చెప్పారు. ప్రభుత్వ సహకారంతో అలియాబాద్ మున్సిపాలిటికి మరిన్ని నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి పాటుపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్‌లు గాదె వెంకటేష్, కోడూరి మౌనిక దినేష్, సామల జశ్వంత్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, ఎఇ సనా, నాయకులు పాల్గొన్నారు.



## దేశాభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన గొప్ప వ్యక్తి రాజీవ్ గాంధీ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహం ఎదురుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,డిసిసి సెక్రటరీ మామిండ్ల ముత్యాలు యాదవ్,ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్‌లు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి స్థానిక ప్రభుత్వ హాస్పిటల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి ఇటికల కృష్ణ రెడ్డి,కీసర గుట్ట డైరెక్టర్లు సగ్గు అనితశ్రీనివాస్, సామల అమరేందర్,మత్స్యశాఖ డైరెక్టర్ మేద బోయిన వెంకటేష్,మాజీ సహకార బ్యాంక్ డైరెక్టర్ బొక్క ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, మైనారిటీ అధ్యక్షులు ఫరూక్, ఎస్టి సెల్ అధ్యక్షులు సురేష్ నానవత్, మేకల సునీల్ కుమార్, బొక్క సత్తిరెడ్డి, కావాడి మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**మర్పల్లిలో:** దేశానికి సాంకేతికతను తీసుకువచ్చింది రాజీవ్‌గాంధీనే అని మండల పార్టీ అధ్యక్షులు సురేష్ యాదవ్ అన్నారు. గురువారం వికారాబాద్ నియోజకరవర్గంలోని మర్పల్లి మండల కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫోటోకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. దేశానికి ఐటిరంగ అభివృద్ధి ప్రదాత, దేశాభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. నీ ఆశయం భవిష్యత్ తరాలకు ఎప్పుడు స్ఫూర్తిదాయకమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, మల్లేష్ యాదవ్, జగదీష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



## దేశాన్ని ప్రగతి బాటలో నడిపించిన రాజీవ్ గాంధీ

### ఆర్‌టిఐ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** భారతదేశ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసిన దేశ మాజి ప్రధాని సేవలు అనిర్వచనీయమని దేశాన్ని ప్రగతి బాటలో నడిపించిన నవ యువ నాయకుడు రాజీవ్ గాంధీ అని జిల్లా ఆర్‌టిఐ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్, అలియాబాద్ మున్సిపాలిటి కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్‌ల ఆద్వర్యంలో మాజీ దేశ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి కార్యక్రమానికి విచ్చేసి రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. భారతదేశాన్ని 21వ శతాబ్దం వైపు నడిపించిన దూరదృష్టి గల నాయకుడని కొనియాడారు. కంప్యూటర్, టెలికాం రంగాల్లో నూతన




సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని సాంకేతిక యుగంలోకి తీసుకెళ్లిన నాయకుడుగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి, అలియాబాద్ మాజి సర్పంచ్ కమతం కృష్ణారెడ్డి, మాజి జడ్పిటిసి బాలేష్, కౌన్సిలర్ జశ్వంత్‌రెడ్డి, ఎఎంసి డైరక్టర్ బిక్షపతి, దేవస్థానం మాజీ చైర్మన్ లక్ష్మి నారాయణ, నాయకులు కొంగ విఠల్,కొమ్ము వినోద్, ముద్దం రాఘవరెడ్డి, వెంకటయ్య, నాగమల్లారెడ్డి, రాము, మురళీగౌ డ్, కొండల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నా రు.

**తాండూరులో :** దేశానికి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరాజబాల్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు ధారాసింగ్‌నాయక్‌లు అన్నా రు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురష్కరించుకుని తాండూరు పట్టణంలోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాండూరు మాత శిశు సంక్షేమ ఆసుపత్రిలో బాలింతలకు, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణి చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి ఐటి సేవలు అందించిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బాతుల నాగు, మున్సిపల్ కౌన్సిలర్లు జుంటుపల్లి వెంకటర్ , పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయుకులు న్యాయవాది గోపాల్, ప్రభాకర్ గౌడ్, అప్పు, లింగదలి రవి తదితరులు పాల్గోన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు శ్రీకారం..

**జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ముమ్మర సవరణ 2026 కార్యక్రమాన్ని ప్రకటించింది. ఓటరు జాబితాలో పేర్ల డూప్లికేషన్, మరణించిన వారి పేర్లు తొలగించకపోవడం, తరచూ వలసల కారణంగా ఒకే వ్యక్తి పలుచోట్ల ఓటరుగా నమోదవడం వంటి సమస్యలను నివారించేందుకు ఈ చర్యలు చేపడుతున్నట్లు ఈసి స్పష్టం చేసింది. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపింది.

ఈ సవరణ ప్రక్రియ జూన్ 25 నుంచి ప్రారంభమై అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణతో ముగియనుంది. ఇందులో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించనున్నారు. జూలై 31న డ్రాఫ్ట్ ఓటరు జాబితాను విడుదల చేసి, ఆగస్టు 30 వరకు క్లైయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం సెప్టెంబర్ 28 వరకు పరిశీలన, విచారణ ప్రక్రియ పూర్తి చేసి అక్టోబర్ 1న తుది జాబితాను ప్రకటించనున్నారు. సర్వే సమయంలో బిఎల్‌ఓలు ప్రతి ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శిస్తారని అధికారులు తెలిపారు. ఓటర్ల వివరాలతో ముందుగా ముద్రించిన ఎన్యూమరేషన్ ఫారాలను అందించి, వాటిని ఎలా పూరించాలో వివరించనున్నారు. తర్వాత మరోసారి వెళ్లి నింపిన ఫారాలను సేకరిస్తారు. ఫారాన్ని సమర్పించిన వారికి రసీదు కూడా అందజేస్తారు. ఓటరు ఇంట్లో లేని పరిస్థితుల్లో కుటుంబంలోని వయోజన సభ్యుడు ఫారం నింపి సమర్పించవచ్చని తెలిపారు.

**సులభంగా ఆన్‌లైన్ సదుపాయాలు..**

ఓటర్లు ఆన్‌లైన్‌లో కూడా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం ఓటర్స్ పోర్టల్, ఈసిఐ నెట్ మొబైల్ యాప్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించవచ్చు. ఆధార్ కార్డులోని పేరు, ఓటరు జాబితాలోని పేరు సరిపోతే ఓటిపి ఆధారంగా ఈసైన్ చేసి ఫారం సమర్పించే అవకాశం ఉంటుంది. 2002 ప్రత్యేక సవరణ జాబితాలో తమ పేరు ఉందో లేదో ఓటర్లు 'సెర్చ్ బై ఏలెక్టర్స్ డిటెయిల్స్' సదుపాయం ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఒకవేళ పేరు లేకపోయినా, తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల వివరాల ఆధారంగా నమోదు ప్రక్రియ కొనసాగించవచ్చని స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పుల కోసం ఫారం6, ఫారం8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకునే యువత కూడా ముందస్తుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

**విదేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో ఉన్న కుటుంబ సభ్యులు సమర్పించవచ్చు..**

ఆధార్ నెంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికమని ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఫారంలో ఉన్న ఫోటో పాతదైనా, తప్పుగా ఉన్నా తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటో జతచేయాలని సూచించారు. విదేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాల్లో ఉన్న ఓటర్ల తరఫున కుటుంబ సభ్యులు ఫారాలు సమర్పించవచ్చని తెలిపారు. అలాగే ఇంటింటి గణన దశలో ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

అయితే డ్రాఫ్ట్ జాబితా విడుదల తర్వాత ఎన్నికల నమోదు అధికారికి అనుమానం వచ్చినపుడు మాత్రమే పాస్‌పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రం, ప్రభుత్వ ఐడిలు వంటి పత్రాలు కోరవచ్చు అన్నారు. ఫారమ్ నింపడంలో ఇబ్బందులు ఎదురైతే బిఎల్‌ఓలను లేదా టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1950ను సంప్రదించాలని ఎన్నికల సంఘం సూచించింది. ఎన్యూమరేషన్ ఫారాలు లేదా డిక్లరేషన్ ఫారాలలో ఉద్దేశపూర్వకంగా తప్పు డు సమాచారం స్తే, రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్ యాక్ట్ 1950, సెక్షన్ 31 ప్రకారం ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారని ఎన్నికల అధికారులు హెచ్చరించారు.

నందమూరి బాలకృష్ణ, మాస్ యాక్షన్ స్పెషలిస్ట్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం ఎన్ బి కె 111 ఇప్పటికే మ్యాసివ్ బజ్ క్రియేట్ చేస్తోంది. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ కావడంతో అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి.

# రీల్



## జెమిని సురేష్ హీరోగా 'ఆత్మకథ'

వారాహి ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై సోమేష్ నిర్మాతగా శ్రీనివాస్ బండ్రెడ్డి రచనా దర్శకత్వంలో రానున్న చిత్రం ఆత్మ కథ యాన్ అన్ టోల్డ్ స్టోరీ. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేతుల మీదగా ఈ చిత్ర టైటిల్, అలాగే ట్రైలర్ లాంచ్ చేయడం జరిగింది. జెమిని సురేష్ హీరోగా, రూప హీరోయిన్‌గా చేయగా 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వి, సమ్మెట గాంధీ, షకలక శంకర్, తాగుబోతు రమేష్, ధనరాజ్, నాగ మహేష్, బలగం విజయలక్ష్మి, శ్రీనివాస్ నాయుడు తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ కార్యక్రమానికి తెలుగు చిత్ర నిర్మాతల మండలి సెక్రటరీ తుమ్మల ప్రసన్నకుమార్ , నటుడు కె.వి ప్రదీప్, నటి కరాటే కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. శ్రేయాంశ్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి గోపి డిఒపిగా చేయగా రాఘవేంద్ర రెడ్డి ఎడిటింగ్ చేశారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ భాషలలో విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనివాస్ గుండ్రెడ్డి మాట్లాడుతూ నేను ఇతర భాషలలో కూడా సినిమాలు చేశాను. ప్రతి సినిమాకు నా వెనుక ఉండి నన్ను సపోర్ట్ చేస్తూ వచ్చిన వ్యక్తి మా అన్నయ్య ప్రసన్న చెప్పిన బడ్జెట్‌లో ఒక సినిమా చేశాను. అన్నారు. తెలుగు చిత్ర నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ వారాహి ఎంటర్‌టైన్‌మెంట్స్ వస్తున్న ఆత్మకథ చిత్రం ఒక సామాన్యుడిది. దర్శకుడు శ్రీనివాస్ తమ పిల్లలు కూడా ఇదే ఇండస్ట్రీలో ఉండటంతో వారి సహాయంతో నిర్మాతకు బడ్జెట్ పెరగకుండా ఈ సినిమాకు ఎంతో బడ్జెట్ తగ్గించి వేడి చేశారు. అలాగే నిర్మాత, సంగీత దర్శకుడు కూడా సొంతవారు కావడం విశేషం అన్నారు. నటుడు జెమిని సురేష్ మాట్లాడుతూ సెప్టెంబర్ 7, 2005న హైదరాబాద్‌కు వచ్చి యాంకర్, డబ్బింగ్ ఆర్టిస్ట్, క్రియేటివ్ డైరెక్టర్ స్థాయి నుంచి కష్టపడి ఈరోజు 'ఆత్మకథ' సినిమా ద్వారా ప్రధాన హీరోగా మారాను. హీరోగా అవకాశం ఇచ్చిన దర్శకుడు శ్రీనివాస్, నమ్మి పెట్టుబడి పెట్టిన నిర్మాత సోమేష్, అలాగే తదుపరి చిత్రం 'బ్లాక్ మెయిల్' నిర్మాత అవినాష్ కూనప రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## చిరంజీవి 158 సినిమాకు క్లాప్ కొట్టిన పవన్



మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు బాబీ కొల్లి (కె.ఎస్. రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కుతున్న మెగా158 చిత్రం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమంతో అధికారికంగా ప్రారంభం కావడంతో, మరో భారీ బాక్సాఫీస్ విజృంభణకు రంగం సిద్ధమైంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్రానికి క్లాప్ కొట్టారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రబాబు కూడా పాల్గొన్నారు. మెగా బ్రదర్స్ ఇద్దరూ కలిసి పాల్గొనడం అభిమానుల సందడి నెలకొంది. మెగా 158 చిత్రంలో మెగా స్టార్ చిరంజీవి కెరీర్‌లో మరో హైవోల్టేజ్ మాస్ ఎంటర్టైనర్‌గా నిలుస్తోంది. చిరంజీవి సరసన జాతీయ అవార్డు గ్రహీత ప్రియమణి కీలక పాత్ర పోషించనున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆమెకు ఇది రెండవ చిత్రం. ఈ సినిమాకు సంబధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు.

## హైదరాబాదీ ముత్యాలతో మెరిసిన రష్మీ ఠాకూర్



భారతీయ వస్త్రాలకు ఒక మైలురాయిగా రష్మీ ఠాకూర్ 79వ ఫెస్టివల్ డి కేన్స్‌లో తన అరంగేట్రం చేశారు. ప్రపంచ రెడ్ కార్పెట్‌పై భారతదేశ సాంస్కృతిక రాయబారిగా ఆమె ప్రాతినిధ్యం వహించారు. తెలంగాణ నేతన్నల చేతితో నేసిన 200 సంవత్సరాల పోచంపల్లి ఇకత్ కూచర్ దుస్తులను ఠాకూర్ ప్రదర్శించారు. పోచంపల్లి టు కేన్స్ అనే థీమ్‌తో తెలంగాణ మగ్గాల నుండి ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక చలనచిత్రోత్సవం వరకు మన జీఐట్యాగ్ చేనేతను తీసుకెళ్లారు. ఈ దుస్తులకు వన్నె తెచ్చినవి ప్రఖ్యాత హైదరాబాదీ ముత్యాలు — నిజాంల కాలం నాటి వారసత్వ ఆభరణాలు. ఇకత్ నేతలోని రేఖాగణిత డిజైన్‌కు సరిపోయేలా వీటిని అలంకరించారు. భారతదేశ వస్త్ర వారసత్వం , రాజస ఆభరణాల వారసత్వం మధ్య ఈ కలయిక ఒక శక్తివంతమైన సంభాషణను సృష్టించింది. కేన్స్ నుండి మాట్లాడుతూ, రష్మీ ఠాకూర్ ఇలా అన్నారు: రెడ్ కార్పెట్‌పై నడవడం నా వ్యక్తిగత అరంగేట్రం మాత్రమే కాదు. ఇది తెలంగాణ అరంగేట్రం. 200 ఏళ్ల చరిత్రను తమ దారాల్లో పొదిగిన పోచంపల్లి నేతన్నలందరి కోసం ఇది. మన చేనేతను హైదరాబాదీ ముత్యాలతో జత చేయడం భారత దేశ హస్తకళకు వందనం అని కేన్స్ రెడ్ కార్పెట్ పై నడిచిన సందర్భంగా రష్మీ ఠాకూర్ పేర్కొన్నారు. 79వ ఫెస్టివల్ డి కేన్స్ 13 నుండి 24 మే 2026 వరకు జరుగుతుంది. ఠాకూర్ హాజరు భారతీయ చేనేత మరియు హైదరాబాదీ ముత్యాలను ప్రపంచ లగ్జరీ మరియు సాంస్కృతిక సంభాషణలో ముందంజలో నిలిపింది.

## గురుదేవ్ రవి శంకర్‌ను కలసిన నిర్మాత రవి



'భగవంతుడు' సినిమా విడుదలకు ముస్తాబవుతున్న తరుణంలో నిర్మాత రవి పనస గురుదేవ రవి శంకర్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సినిమా కాన్సెప్ట్‌ను రవి శంకర్‌కు నిర్మాత వివరించారు. ఈ సినిమా హిట్ కావాలని ఈ సందర్భంగా రవి శంకర్ కోరారు. సినిమా యూనిట్ పడిన కష్టం తప్పకుండ ఫలిస్తోందని ఆయన ఆశీర్వదించారు.

## 'డేవిడ్ రెడ్డి' టీజర్ విడుదల



'మంచు మనోజ్ నటిస్తున్న కొత్త సినిమా 'డేవిడ్ రెడ్డి'. ఈ సినిమాను వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్స్‌పై నల్లగంగుల వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ హనుమా రెడ్డి యక్కంటి రూపొందిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్‌తో ఇంటెన్స్ యాక్షన్ డ్రామా కథతో భారీ పాన్ ఇండియా చిత్రంగా 'డేవిడ్ రెడ్డి' సినిమా తెరకెక్కుతోంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడలో రూపొందుతున్న ఈ చిత్రం ఈ దసరా పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'డేవిడ్ రెడ్డి' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ ఎలా ఉందో చూస్తే 1897 నుంచి 1920 మధ్య బ్రిటీష్ పాలనా కాలం నేపథ్యంతో 50 బెటాలియన్లలోని 2 వేల మందిని ఒంటరిగా ఎదుర్కొన్న డేవిడ్ రెడ్డి సాహసం, దేశాన్ని మోసం చేసేందుకు సిద్ధంగా ఉన్న అతని వ్యక్తిత్వం బ్రిటీషర్స్‌ను ఆకర్షిస్తుంది. డేవిడ్ రెడ్డిని తమ కోసం పనిచేసేలా ఒప్పించాలని బ్రిటీషర్స్ ప్లాన్ చేస్తారు. అమాయకులని కాపాడే డేవిడ్ రెడ్డి దేశాన్ని ఎందుకు మోసం చేయాలనుకున్నాడు?, భారతీయులే అతనిని అరెస్ట్ చేయాలని ఎందుకు కోరుకున్నారు ?, డేవిడ్ రెడ్డి అంతిమ లక్ష్యం ఏంటి, బ్రిటీష్ యువతితో అతని ప్రేమ కథ ఎలా సాగింది...? ఇలాంటి అంశాలతో టీజర్ ఆద్యంతం ఆసక్తి కలిగించింది. డేవిడ్ రెడ్డి కాదు రాక్షస రెడ్డి అని బ్రిటీషర్స్ భయంతో చెప్పడం అతని క్యారెక్టర్‌లోని వైల్డ్ నెస్‌ను చూపిస్తోంది. డేవిడ్ రెడ్డి పాత్రలో మంచు మనోజ్ ఇంటెన్స్ పర్ ఫార్మెన్స్ చేశారు. ఆయన చేసిన యాక్షన్ సీక్వెన్స్‌లు టీజర్‌కు హైలెట్ గా నిలుస్తున్నాయి.

## 'నాగబంధం' నార్త్ ఇండియాలో జూలై 3న రిలీజ్



అభిషేక్ నామా దర్శకత్వంలో, విరాట్ కర్ణా నటించిన 'నాగబంధం ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం జూలై 3న థియేటర్లలో ఘనంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. ప్రతీ అప్‌డేట్‌తో ఈ చిత్రంపై బజ్ నెక్స్ట్ లెవల్ కి చేరుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, గ్లింప్స్, సాంగ్స్ సినిమాపై మ్యాసివ్ బజ్ క్రియేట్ చేశాయి. మరో క్రేజీ అప్డేట్ ఇచ్చారు. నార్త్ ఇండియాలో అన్ని భాషల థియేట్రికల్ రిలీజ్ పార్ట్‌నర్‌గా ప్రముఖ నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ చేతులు కలిపింది. ఎపిక్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతున్న 'నాగబంధం'ను నార్త్ ఇండియాలో అన్ని భాషల్లో జీ స్టూడియోస్ విడుదల చేయనుంది. ఈ సినిమాలో నభా నటేష్, ఐశ్వర్యా మీనన్, రిషబ్ సాహ్నీ, జగపతి బాబు, గరుడ రామ్, మహేష్ మాంజ్రేకర్, జయప్రకాశ్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎన్ఐకె స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ నిర్మాణంలో వస్తున్న 'నాగబంధం' పౌరాణికం, చరిత్ర, యాక్షన్ అంశాల కలయికగా రూపొందుతోంది. పాన్ ఇండియా స్థాయిలో 'నాగబంధం' జూలై 3న విడు దల కానుంది.

### బాలల హక్కుల పరిరక్షణ కమిషన్
## జవహర్ బాలభవన్ సందర్శన..

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కోత్తకోట సీతా దయాకర్ రెడ్డి, కమిషన్ సభ్యులు గురువారం నాంపల్లి లోని జవహర్ బాలభవన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు అక్కడ ఉన్న పిల్లలు, సిబ్బంది, తల్లిదండ్రులతో పరస్పరం మాట్లాడారు. ఈ సందర్భంగా బాల భవన్‌లో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యా, సౌకర్యాల పరిస్థితులను కమిషన్ పరిశీలించింది. బాలభవన్‌లో నివసిస్తున్న విద్యార్థులు, సాంఘిక సంక్షేమ, శిశు సంక్షేమ కార్యకర్తలతో కమిషన్ సభ్యులు సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పిల్లల అభివృద్ధి, భద్రత, ఆరోగ్యం, విద్య తదితర అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. అలాగే బాలల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషన్ ఆదేశించింది. పిల్లలకు మెరుగైన వసతులు, నాణ్యమైన ఆహారం, విద్యా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాలల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, బాలల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం సహించబోదని కమిషన్ స్పష్టం చేసింది.

## సెంట్రలైజ్డ్ కిచెన్ పేరుతో వంట కార్మికులకు అన్యాయం చేయొద్దు : ఎఐటియుసి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ పాఠశాలల్లో సెంట్రలైజ్డ్ కిచెన్ పేరుతోని అల్పాహారం పథకాన్ని హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు కాకుండ వంట కార్మికులకే అప్పజెప్పాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసుఫ్; ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఎఐటియూసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ప్రేంపావణి అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా ఎం.డి. యూసుఫ్, ఎస్.బాలరాజు మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా పాఠశాలలో వం టలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందిస్తున్న వంట కార్మికులు ఉద్యోగ భద్రత లేక ఆందోళనకు గురవుతున్నరన్నారు. గతంలో చేసిన అనేక పోరాటాలలో నేటి ఎంఎల్ఎలు, మంత్రులు, ఏకంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాటి ప్రతి పక్ష హోదాలో తమ ఉద్యమంలో ప్రత్యేకంగా పాల్గొని సంఘీభావం ప్రకటించి మా కు మనో ధైర్యం కల్పించారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ భద్రత, రూ.10వేలు వేతనాలు చెల్లిస్తామ ని హామీ ఇచ్చి ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా ప్రకటించి మూడేళ్లు గడుస్తున్న నేటికి అమలు చేయక పోవడం శోచనీయమన్నారు. ఇప్పుడు సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పేరుతోని వంట కార్మికుల ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చే ప్రయత్నాలు ప్రభుత్వం విరమించుకుని, 54 వేల మంది వంటకార్మికులను రోడ్డున పడేయకూడదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు, కార్మికుల ఉనికికే ప్రమాద పరిస్థితుల నేపథ్యంలో ఉద్యోగ భద్రత, ఎన్నికల హామీల అమలు, అలాగే అల్పాహారం పాత బిల్లుల కోసం అవసరం అయితే సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికులను ఉద్యమానికీ సిద్ధం చేయడంలో భాగంగా జూన్ 6 వ, తేదీన జరిగే రాష్ట్ర తృతీయ మహసభలను జయప్రదం చేయాలనికోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్,ఆఫీస్ బేరర్స్, పూసాల రమేష్, టి.చక్రపాణి, నిమ్మటూరి రామక్రిష్ణ, ధర్మల రామ్మూర్తి, మీసం లక్ష్మ ణ్, యండి ముంతాజ్, ఆది రంగారెడ్డి, పోలప్పోలు వెంకటేష్, ప్రభావతి, వసంత, బాల్‌రాజు, పుష్పలత, రేఖ తదితరులు పాల్గొన్నారు.

## కీలక సూత్రధారి హతం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించింది. 2019, ఫిబ్రవరి 14న సిఆర్‌పిఎఫ్ కాన్వాయ్‌ని లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు అమరులైన సంగతి తెలిసిందే. ఈ ఉగ్రదాడి ఘటన వెనక పాకిస్థాన్ హస్తం గల ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్ ఉన్నట్లు భారత నిఘాసంస్థలు గుర్తించాయి. దీనికి ప్రతీకారంగా భారత వాయుసేన ఫిబ్రవరి 26న వైమానిక దాడులు చేపట్టింది. పాక్ భూభాగంలోని బాలాకోట్‌లోని జైషే మహ్మద్ ఉగ్ర స్థావరాలపై తెల్లవారుజామున బాంబుల వర్షం కురిపించింది. ఆ తర్వాత పాక్ ప్రతీకార దాడులు చేపట్టింది. మన గగనతలంలోకి వారి యుద్ధ విమానాలు దూసుకొచ్చాయి. అయితే పాక్ చర్యను భారత వాయుసేన సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఈ క్రమంలో మన మిగ్ విమానం ఒకటి కూలి వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ శత్రుచెరలో చిక్కుకుపోయారు. అయితే అంతర్జాతీయ ఒత్తిడితో మూడు రోజుల తర్వాత అభినందన్‌ను పాక్ విడిచి పెట్టింది.

## రైల్వే కనెక్టివిటీ పెంచుతాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణికులకు మౌలిక వసతుల కల్పనపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి గురువారం న్యూఢిల్లీలోని రైల్వే భవన్‌లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో కొనసాగుతున్న వివిధ రైల్వే ప్రాజెక్టులు, కొత్త లైన్‌లు, ఎలక్ట్రిఫికేషన్ పనుల పురోగతిపై ఈ సందర్భంగా ఇరువురు మంత్రులు సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి సేవలు అందించడమే లక్ష్యంగా సాగుతున్న సుమారు 42 ప్రధాన రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనుల ప్రస్తుత స్థితిగతులపై ఈ సమావేశంలో వివరంగా చర్చించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్ నగరం, దాని చుట్టుపక్కల ప్రాంతాల ప్రయాణికులకు అత్యంత కీలకమైన ర వాణా సౌకర్యంగా ఉన్న ఎంఎంటిఎస్ రైళ్ల అంశం ఈ భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చింది. ఎంఎంటిఎస్ రైళ్ల వేళలను క్రమబద్ధీకరించడంతో పాటు, ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరిచేలా చొరవ తీసుకోవాలని రైల్వే మంత్రిని కిషన్ రెడ్డి కోరారు. దీనికి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సా నుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్‌లు, హైస్పీడ రైల్ కారిడార్ పనుల పురోగతిపై కూ డా ఈ భేటీలో చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో తెలంగాణలో రైల్వేల ఆధునీకరణ, నెట్‌వర్క్ విస్తరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి అంకితభావంతో పనిచేస్తోందని రైల్వే మంత్రి స్పష్టం చేశారు.

## బిఆర్‌ఎస్ ఇన్‌చార్జీలు

(మొదటి పేజీ తరువాయి)

ఆ పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను ప్రకటించారు. సభ్యత్వ నమోదు పక్రియ ముగియగానే గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని రకాల కమిటీలకు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తారు. అంతకుముందు 'డిజిటల్ యాప్ సభ్యత్వ నమోదు' అంశంపైన అన్ని నియోజకవర్గాల ఇన్ చార్జీలతో పాటు ప్రతీ నియోజకవర్గానికి ఒక్కరు చొప్పున ఐటి నిపుణులతో కలిపి హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో 'డిజిటల్ శిక్షణ' ఇవ్వనున్నారు. ఈ శిక్షణ అనంతరం రాష్ట్ర ప్రధానకార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గాల వారీగా బిఆర్‌ఎస్ జిల్లా కార్యాలయాల్లో శిక్షణ శిభిరాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆయా నియోజకవర్గం లోని బూత్ సంఖ్య ఆధారంగా బూత్‌కు ఇద్దరు చొప్పున వారం రోజుల పాటు శిక్షణా ఉంటుంది. డిజిటల్ సభ్యత్వ నమోదు శిక్షణ పూర్తయిన వెంటనే, సభ్యత్వ నమోదు తేదీని ప్రకటిస్తారు. సభ్యత్వ నమోదు తేదీ ప్రకటించిన రోజునే కెసిఆర్‌తో పాటు పార్టీ ముఖ్యులంతా సభ్యత్వ పునరుద్ధరణ కార్యక్రమంలో పాల్గొననున్నట్టు బిఆర్‌ఎస్ తెలిపింది. ఆ తర్వాత గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్తాయి వరకు అన్ని రకాల కమిటీలకు ఎన్నికల షెడ్యూలును ప్రకటిస్తారని, నిర్ణీత తేదీలలో కమిటీల నియామకం పూర్తి చేసుకుని, పార్టీ శిక్షణాశిబిరాలు నిర్వహిస్తామని బిఆర్‌ఎస్ ప్రకటించింది.

## సింగరేణికి సిరులు

(మొదటి పేజీ తరువాయి)

అందిపుచ్చుకుని సింగరేణితో సహా పలు రాష్ట్ర సంస్థలు సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. సింగరేణి సంస్థ ఇప్పటికే 8 చోట్ల 245.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. వీటిలో 147 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఓపెన్ యాక్సెస్ ప్లాంట్లుగా, మిగిలిన 98.50 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఇన్ హౌజ్ ప్లాంట్లుగా గుర్తించి తెలంగాణ విద్యుత్తు గ్రిడ్‌లకు అనుసంధానం చేసింది. ఈ ఇన్ హౌజ్ ప్లాంట్ల విద్యుత్తును కూడా తెలంగాణ విద్యుత్ శాఖ గ్రిడ్‌లకు అనుసంధానం చేసినప్పటికీ విద్యుత్ ఒప్పందం ప్రకారం ఇక్కడ స్థానిక అవసరాలకు ఉపయోగించుకోగా మిగిలిన విద్యుత్తుకు మాత్రం తెలంగాణ డిస్కమ్ ఎటువంటి చెల్లింపులు జరపదు. మిగులు విద్యుత్తును కేవలం ఉచితంగానే గ్రిడ్డుకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా ఇన్ హౌస్ ప్లాంట్ల నుండి రోజుకు వేలాది యూనిట్ల మిగులు విద్యుత్తును ఎటువంటి ఆర్థిక ప్రయోజనం లేకుండా గ్రిడ్‌కు సరఫరా చేయడం జరుగుతోంది. అయితే ఈ మిగులు విద్యుత్తుతో ఆర్థికంగా లబ్ధి పొందే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు సింగరేణి సంస్థ రాష్ట్రంలోనే తొలిసారిగా ఒక మెగావాట్ సామర్థ్యం గల బిఈఎస్ఎస్‌ను మందమర్రి ప్లాంట్‌లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసింది. మందమర్రిలో గల 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్ సమర్థవంతంగా పనిచేస్తూ మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలలోని గనులకు, కాలనీలకు అవసరమైన విద్యుత్తును అందిస్తోంది. అయితే స్థానిక విద్యుత్తు అవసరాలకు సరిపోగా ఇంకా కొంత విద్యుత్తు మిగిలిపోతుంది. ఈ నేపథ్యంలో మందమర్రి ప్లాంటులో జనవరి నెలలో 'బ్యాటరీ ఎనర్జీ స్టోరీ సిస్టం'ను సింగరేణి ఏర్పాటు చేసింది. అప్పటి నుండి ఇప్పటి వరకు బిఈఎస్ఎస్ యూనిట్ స్థానిక అవసరాలకు వినియోగించగా ఇంకా మిగిలిన 3,35,485 యూనిట్ల విద్యుత్తును నిల్వ చేసుకుని అవసరమైన సందర్భంలో వినియోగించుకుంది. తద్వారా సింగరేణి సంస్థకు రూ. 25,66,460 ఆర్థిక లబ్ధి చేకూరింది. ఒక మెగావాటు సామర్థ్యం గల బిఈఎస్ఎస్ యూనిట్ ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్తును ఆదా చేయడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఇక్కడ ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన బిఈఎస్ఎస్ విజయవంతం కావడం పట్ల సింగరేణి యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మరిన్ని ప్రాజెక్టులను చేపట్టేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు సింగరేణి యాజమాన్యం ప్రకటించింది.

## పుష్కర హోరు

(మొదటి పేజీ తరువాయి)

దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హై కోర్ట్ న్యాయమూర్తి నందా, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, భూపాలపల్లి, రంగారెడ్డి ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, మల్ రెడ్డి రంగారెడ్డి, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు త్రివేణి సంగమ క్షేత్రంలో సరస్వతి అంత్య పుష్కర వేడుక ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. విఘ్నాధిపతి అయిన విఘ్నేశ్వరునికి తొలి పూజలు చేసిన తరువాత సరస్వతి నది అంత్య పుష్కర మహోత్సవ వేడుకలకు అంకురార్పరణ చేశారు.

**పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి గణపతి పూజ**

అత్యంత అరుదైన సరస్వతి పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమంలో పుష్కర స్నానలను కూడా నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పుష్కర స్నానాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు వేద పండితులు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని, శ్రీ శుభానంద దేవిని, సరస్వతి మాతను దర్శించుకున్నారు.

**కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న గవర్నర్ దంపతులు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో దక్షిణ కాశీగా ప్రఖ్యాతి చెందిన కాళేశ్వరం క్షేత్రంలో గురువారం సరస్వతి అంత్య పుష్కరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కాళేశ్వరం సరస్వతి పుష్కరాల మొదటి రోజులో భాగంగా సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల దంపతులు కాళేశ్వరం చేరుకున్నారు. కాళేశ్వరం చేరుకున్న రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులకు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సంకీర్త్ లు ఘన స్వాగతం పలికారు. అనంతరం సరస్వతి పుష్కర్ ఘాటు వద్ద ఉన్న త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించి సరస్వతి మాతకు పూజలు నిర్వహించారు.

**1 కోటి 20 లక్షలతో నిర్మించిన మ్యూజియాన్ని ప్రారంభించిన గవర్నర్**

కాళేశ్వరం పుష్కరాల అభివృద్ధి పనుల్లో భాగంగా కోటి 20 లక్షల రూపాయలతో పురాతన విగ్రహాల చరిత్రను తెలిపే మ్యూజియాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మ్యూజియాన్ని ప్రారంభించారు. అనంతరం హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com